ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-2-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 19 పేజీలు: 12 వెల: 6.50


అధ్యక్ష ఎన్నికల సర్వేలో జెలెన్‌స్కీకి 57% రేటింగ్

9లో

'సంగమం' నీరు తాగేందుకు సరైనదే: యుపి సిఎం

# ప్రకృతి సేద్యంతో మరింత వృద్ధి

● అమెరికా సంస్థల సహకారం తీసుకుంటున్నాం ● రైతు సాధికార సంస్థతో త్వరలో ఒప్పందం ● 28-29 నాటికి 50 లక్షల ఎకరాల్లో అమలు ● రైతుల సహకారంతో సేద్యంలో కొత్త పుంతలు: సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో వ్యవసాయరంగం కీలక ఆర్థిక వనరని రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు.ఈ రంగంలో విస్తారమైన ఉత్పత్తులు, గణనీయ లాభాలను తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలను సాధించుకోవాలను కుంటున్నామన్నారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడుల సహకారాన్ని ఆశిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రమోట్ చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగవుతోంది. 2028-29 నాటికి రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి.. తద్వారా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం సాగయ్యేలా చూడాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. ఈ గమ్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం వివిధ దిశల్లో ప్రయత్నాలు చేస్తోంది. రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరిస్తోంది. మరోవైపు ఈ రంగంలో ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు రైతుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు వివిధ సంస్థలతో కలిసి పనిచేయనుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల దావోస్ పర్యటనలో పలు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఎపితో కలిసి పనిచేసేందుకు రావాలని పలు సంస్థలను ఆహ్వానించారు.

ఈక్రమంలో చంద్రబాబుతో దావోస్‌లో భేటీ అయిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు ఎపికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకలిశారు. పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఫైర్మన్ క్రేయిగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వైజర్ గినా మెగ్‌కార్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సిఇఒ కీత్ అగోడా ముఖ్యమంత్రితో సచివాలయంలో సమావేశం అయ్యారు. దావోస్ సమావేశానికి కంటిన్యూ మీటింగ్‌గా జరిగిన నేటి సమావేశంలో రానున్న రోజుల్లో కలిసి పనిచేసే అంశాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం, రైతు నుండి వినియోగదారు వరకు ఎండ్‌టుఎండ్ అనుసంధాన వ్యవస్థను రూపొందించడం, మార్కెట్ డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయడంపై ఈ సంస్థలు సహాయపడనున్నాయి.

పబ్లిక్, ప్రైవేట్ సంస్థల నుంచి ఆర్థిక సాయాన్ని అందిచేందుకు సహకారాన్నిస్తాయి. ప్రకృతి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రమోట్ చేస్తాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన రైతు సాధికార సంస్థతో పెగాసస్ >>2

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తా



బిజెపి ఎల్‌పి సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక

డిప్యూటీ సిఎంగా పర్వేష్ సింగ్ వర్మ, అసెంబ్లీ స్పీకర్‌గా విజేంద్ర గుప్తా, మంత్రులుగా ఆరుగురు ఎంపిక

నేడు రామ్‌లీలా మైదాన్‌లో ప్రమాణం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశరాజధాని కేంద్రపాలితప్రాంతర ఢిల్లీ ముఖ్యమంత్రిగా బిజెపి మహిళానేతనే ఎంపికచేసింది. విద్యార్థిదశనుంచే బిజెపి రాజకీయాల్లో కొనసాగిన రేఖాగుప్తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిజెపి శాసనసభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాదాపు రెండున్నరదశాబ్దాల తర్వాత ఢిల్లీ మళ్లీ బిజెపి పాలనలోకి వచ్చింది బిజెపి పరంగా రెండోమహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా కాగా ఢిల్లీని పాలించిన మహిళా ముఖ్యమంత్రుల్లో నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా నిలిచారు. 15ఏళ్లపాటు కాంగ్రెస్ నాయకురాలు షీలాదీక్షిత్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆ తర్వాత సుష్మస్వరాజ్ బిజెపినుంచి సిఎంగా పాలనచేస్తే ఆతర్వాత అదికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ చివరి రోజుల్లో ముఖ్యమంత్రిగా అతిశిమర్లేనా కొనసాగారు. ఇపుడు నాలుగోమహిళా సిఎంగా రేఖాగుప్తా ఎన్నికయ్యారు. షాలిమార్‌బాగ్‌నుంచి ఎన్నికల్లో గెలిచి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. రేఖాగుప్తా ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యదర్శిగా, బిజెపి మహిళామోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగాకూడా ఉన్నారు. >>2

## డబ్బున్న దేశానికి 21 మిలియన్ డాలర్లు ఎందుకివ్వాలి?

భారత్‌పై ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో వృధా వ్యయం కట్టడికోసం రూపొందించిన డోజ్ విభాగం నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. భారత్‌లోజరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్ల ఫండ్‌ను ఇటీవల ఈ విభాగం రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించారు. అమెరికా పన్నుచెల్లింపుదారుల సొమ్ము ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నించారు. ఫ్లోరిడాలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ భారత్‌కు మేం ఎందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలి వారి వద్ద చాలాడబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలుచేస్తున్న దేశాల్లో అది ఒకటి. ఆవిషయంలో అమెరికా ఎప్పుడూ భారత్‌ను చేరుకోలేదు. నాకు ఆదేశంపట్ల చాలా గౌరవం ఉంది కానీ వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా మనదేశంలో ఓటర్ల పరిస్థితి ఎలాఉంది అని ట్రంప్ ఎదురు ప్రశ్నలు వేసారు. ఇతరదేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విదిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ నేతృత్వంలోని డోజ్ ఈనెల 16న జాబితా ప్రకటించింది. అందులో భారత్‌కు ఉద్దేశించిన నిధులను కూడారద్దుచేసినట్లుప్రకటించింది. బంగ్లాదేశ్,నేపాల్‌లకు కేటాయించిన ఫండ్స్ కూడా రద్దుచేసింది.

# ఆధ్యాత్మిక పర్యాటకంలో ఎపి టాప్



బుధవారం తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్‌పో 2025 ముగింపుసదస్సులో మంత్రి లోకేష్

రాష్ట్రంలో 27,105 ఆలయాలున్నాయి..

సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత

ఐటి సిఎక్స్ ముగింపు సదస్సులో మంత్రి లోకేష్

**తిరుమల, ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో హిందూ సంస్కృతిలో ఆలయాలు, పండుగలు,పూజలు కీలకమైన భాగమని, ఇది మనజీవన విధానమని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. దీన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత సాంకేతికత, కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)వచ్చినా మానవ సమాజాన్ని నడిపించేది ఆ దేవదేవుడేనని భక్తి తత్త్వం తెలియజేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా వారి ప్రయోగం విజయవంతం కావాలని చెంగాలమ్మ ఆలయంలోనో, తిరుమల శ్రీవారి ఆలయంలోనో ముందురోజు పూజలు చేస్తారని ఆయన గుర్తుచేశారు. నమ్మకం మాత్రమేగాక ఇదొక విజయమన్నారు. అందుకే ప్రజల్లో భక్తిభావాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు, దేవాలయ వ్యవస్థలు, సంస్థలు కృషి చేయాలని సూచించారు. తిరుపతిలో జరుగుతున్న అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్ పో(ఐటిసిఎక్స్)2025 ముగింపుసదస్సు బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి నారాలోకేశ్ హాజరై ఆధ్యాత్మికత, భక్తిభావం, ఆలయాల ప్రాశస్త్యం గురించి చక్కగా వివరించారు. వాట్సాప్ ద్వారా ఆలయాల సేవలు, డ్రోన్ నిఘా వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలతో మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుకుంటూ, ఆలయాల పాలనావ్యవస్థను ఆధునీకరించడంలో రాష్ట్రప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సానుకూల నాయకత్వం, పరివర్తనాత్మక మార్పును తీసుకురాగలదనడానికి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు నిదర్శనమన్నారు.

వేంకటేశ్వర నిత్యఅన్నదాన పథకాన్ని తిరుమలలో 1985లో ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. ఈ పథకాన్ని రామారావు కోటి కార్పస్ ఫండ్‌తో ప్రతిరోజూ 2వేలమంది యాత్రికులకు అన్నదానంతో ప్రారంభించారన్నారు. 2001లో చంద్రబాబు ప్రాణదానం ట్రస్ట్ ఏర్పాటుచేసి, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ చికిత్సలు, శస్త్రచికిత్సలు, మందులు, భోజనం వంటి సదుపాయాలను ఈ ట్రస్ట్ అందిస్తోందన్నారు. ప్రస్తుతం 440 కోట్లతో ఈ ట్రస్ట్ విస్తృతమైన సేవలందింస్తోందన్నారు.

**ఆధ్యాత్మిక పర్యాటకరంగంలో అగ్రగామి:**

గ్లోబల్ ఆలయాల నిర్వహణ వ్యవస్థ,విధాన రూపకర్తలు, నిపుణులను ఒకేచోట చేర్చడంలో ఈ కార్యక్రమం మైలురాయిగా నిలుస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. మొన్న ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద జరిగిన పవిత్ర మహాకుంభమేళాకు హాజరైనందుకు నేను ఎంతో ఆనందించానన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మికంగానేగాక ఆధునిక సాంకేతికతను సమర్ధవంతంగా అందిపుచ్చుకోవడంలో ముందున్నాయనడానికి ఐటిసిఎక్స్ >>2

## మిర్చి రైతులను ఆదుకోండి

కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులను ఆదుకునేలా చర్యలుమిర్చి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని సిఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. మార్కెట్ జోక్యం ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు. సాగు వ్యయానికి, విక్రయధరకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని కోరారు. 50 శాతం నిష్పత్తిలో కాకుండా వందశాతం నష్టాన్ని కేంద్రం భరించాలని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవాలని చంద్రబాబు కోరారు రాష్ట్రంలోని మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని, ప్రస్తుతం ఉన్న కేంద్రం మద్దతు ధరను కూడా పెద్ద ఎత్తున పెంచాలని కేంద్రాన్ని కోరారు.. ఈ విషయంలో కేంద్రానికి ఇప్పటి వరకూ నాలుగు లేఖలు రాయడం జరిగిందన్నారు. అయితే గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13,600/ లు మాత్రమే ఉందని ఆయన తెలిపారు.

కేవలం గత రెండేళ్ల మాత్రమే అంతర్జాతీ >>2

## గగన్‌యాన్ జి1 కోసం సి32 దశ మోటార్ ఇంజిన్ సిద్ధం

2లో



బుధవారం సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# ఇక మెరుగైన పౌరసరఫరాలు

ఇప్పటిదాకా 32 లక్షల మె.ట. ధాన్యం కొనుగోలు

రూ. 7,522 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం: మంత్రి నాదెండ్ల

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు అందిస్తున్న సేవల్లో లోపాలను గుర్తిస్తూ మరింత మెరుగైన సేవలందించేందుకు డీఎస్వోలు, డీఎంలు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరులోని సివిల్ సప్లై భవన్‌లో మంత్రి అధ్యక్షతన బుధవారం ఉదయం సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అధికారులందరూ కలిసి టీం స్పిరిట్‌తో పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజలకు జవాబుదారీతనం పెంచే విధంగా పనిచేయాలని, ఇక్కడ సివిల్ సప్లై కార్పొరేషన్ సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ రెండు >>2

## ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీలు

**విజయవాడ.ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఓపీ కౌంటర్లు పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఔషధాలు అందుబాటులో ఉన్నాయా ? లేవా ? అని ఆరా తీశారు. స్ట్రెచర్లు, వీల్ చైర్లపై రోగులను తీసుకెళ్లే సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే నియామకాలు చేపడతామన్నారు. సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన ఆసుపత్రి సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపడుతున్నామంటున్న మంత్రి సత్యకుమార్ రోగులతో ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నాను.ఆస్పత్రిలో శుభ్రత చాలా బాగుంది. సిబ్బంది ఓపికగా పని చేస్తున్నారు. మంచి ఆహారం అందిస్తున్నారు.

కొంత సిబ్బంది కొరతఉంది. దానికోసం నియామకాలు చేపడుతున్నాం. వాస్తవానికి గతం కంటే పరిస్థితులు మెరుగయ్యాయి. మరిన్ని సదుపాయాల కోసం కృషిచేస్తాం. డాక్టర్లు అందరూ పేషెంట్లతో ఎలా వ్యవహరిస్తున్నారని వాళ్లను అడిగి తెలుసుకు న్నాను. సిబ్బంది తమను చాలాబాగా చూసు కుంటున్నారని తెలిపారు. ఒపి సేవలు త్వరితగతిన జరుగుతున్నాయ >>2

# రాష్ట్రంలో బతకలేని రైతు

కర్షకుల కష్టాలను పట్టించుకోని సిఎం చంద్రబాబు

అక్రమ కేసులకు మూల్యం తప్పదు..

గుంటూరు మిర్చియార్డులో రైతుల కష్టాలను పరిశీలించిన మాజీ సిఎం జగన్

'కోడ్' ఉల్లంఘించారని జగన్ సహా పలువురిపై కేసులు నమోదు



బుధవారం గుంటూరు మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**గుంటూరు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త ప్రతినిధి, :** వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి గుంటూరులోని మిర్చి యార్డులో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్న రైతులతో మాట్లాడేందుకు అదే విధంగా వారి సమస్యలను తెలుసుకోవడానికి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి శ్రేణులు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జగన్ వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. జగన్ మిర్చి యార్డ్ లోకి వెళ్లి అక్కడి రైతులకు కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన మిర్చి పంటకు కనీసం రూ.10 నుంచి రూ.11 వేల గిట్టుబాటు ధర కూడా రావడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.21 నుంచి రూ.27వేల వరకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తుచేశారు. గిట్టుబాటు ధర లభించక మిర్చి రైతులు విలవిల్లాడిపోతున్నారని కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అన్ని విధాల విఫలమైందని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించక అయిన కాడికి అమ్ముకొని నష్టాల పాలవుతున్నారని కనీసం ఈ జిల్లాలో యార్డుకు కూతవేటి దూరంలోని ఉన్నా సిఎం చంద్రబాబు నాయుడుకు మిర్చి ధరల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా రైతులకు భరోసా ఇవ్వలేకాపోయింది అని అన్నారు. తన ప్రభుత్వం భయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, దిగుబడి >>2

# ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి19, ప్రభాతవార్త ప్రతినిధి:** సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రేపు జరగనున్న ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. ఢిల్లీలో చంద్రబాబు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. హోం మంత్రి అమిత్ షా, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో భేటీ అయ్యే అవకాశం ఉంది.

**రాష్ట్ర పరిస్థితులపై ఢిల్లీ పెద్దలతో చర్చలు**

రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, ఇతర సాయం పై అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ కానున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తో భేటీలో పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదల గురించి చర్చించనున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థంతో నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక సాయం పై చర్చించే అవకాశం ఉంది. కేంద్ర >>2

# రాష్ట్రాలకు 1,554.99 కోట్ల విపత్తు సాయం

● ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు ● తెలంగాణకు రూ. 231.75 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** గత ఏడాది సంభవించిన తుఫాను, వరదలతో నష్టపోయిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. ఈ వరద సాయం కింద వివిధ రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్రం అదనంగా కేటాయించిన మొత్తం రూ.1554.99 కోట్ల రూపాయలను విడుదల చేయనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ బుధవారం నాడు 5 రాష్ట్రాలకు రూ.1554.99 కోట్ల అదనపు సాయాన్ని ఆమోదించింది. 2024లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు నాగాలాండ్, ఒడిశా, త్రిపుర రాష్ట్రాల్లో సంభవించిన విపత్తులకుగానూ కేంద్రం ఆయా రాష్ట్రాలకు విపత్తు సాయంపై నిర్ణయం తీసుకుంది. ఎపి, తెలంగాణలో ఆకస్మిక వరదలు రావడం సహా కొండ చరియలు విరిగి పడటం లాంటి ప్రకృతి విపత్తులు జరిగిన రాష్ట్రాలకు కలిపి నిధులు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు, రూ. తెలంగాణకు రూ.231.75 కోట్లు, త్రిపురకు రూ. 288.93 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకుంది. విపత్తులు సంభవించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు విపత్తు నష్టం అంచనాకు మంత్రులు, అధికారుల బృందాలను పంపి రిపోర్ట్ తెప్పించింది. ఆ వివరాలు పరిశీలించిన కమిటీ ఆయా రాష్ట్రాల్లో సంభవించిన నష్టానికిగానూ అదనపు వరద సాయంపై >>2

20-02pg2exHMNWJQE.qxd:20-02pg2exHMNWJQE.qxd 01/01/01 10:03 AM Page 1





బుధవారం పూణెలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

>> 50 ఏళ్ల రేఖా 1974 హర్యానాలోని జింద్ జిల్లాలోని నంద్‌గఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి భారతీయ స్టేట్‌బ్యాంకులో అధికారి. రేఖ కుటుంబం 1976లోనే ఢిల్లీకి మకాం మార్చింది. అప్పటికి ఆమె వయసు రెండేళ్లుమాత్రమే. రేఖ గుప్తా ప్రాథమిక విద్యనుంచి ఉన్నత విద్య మొత్తం ఢిల్లీలోనే పూర్తిచేసారు. బాల్యంలోనే రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ విద్యార్థి విభాగం అఖిలభారతీయ విద్యార్థిపరిషత్‌లో చేరారు. ఆ తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్నపుడు ఆమె దౌలత్‌రామ్ కళాశాలలో కార్యదర్శిగా ఎన్నికల్లో విజయం సాధించారు. 1995-96లో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రేఖ న్యాయశాస్త్రంలో ఎల్‌ఎల్‌బి పూర్తిచేసారు.

చదువు అనంతరం రేఖగుప్తా 2003-04లో బిజెపి యువమోర్చా ఢిల్లీ యూనిట్‌లోచేరి కార్యదర్శి పదవినికూడా చేపాట్టారు. 2007లో ఉత్తర పీతంపుర డివిజన్‌నుంచి కౌన్సిలర్ అయ్యారు. 2007-09లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మహిళా సంక్షేమం, శిశుఅభివృద్ధి కమిటీకి రెండేళ్ల ఛైర్‌పర్సన్‌గా కొనసాగారు. 2009లో ఢిల్లీ బిజెపి మహిళామోర్చా ప్రధానకార్యదర్శి. 2010లో బిజెపి ఆమెకు జాతీయ కార్యవర్గసభ్యురాలి హోదాను కల్పించింది. రేఖా గుప్తా ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని రెండుసార్లు ఓటమి చవిచూసారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్‌బాగ్ స్థానం నుంచి పోటీచేసారు. ఆప్‌కు చెందిన వందన కుమారిచేతిలో సుమారు 11వేల ఓట్లతేడాతో ఓటమిచవిచూసిన రేఖా రెండోసారి కూడా 3400 ఓట్లతేడాతో ఓటమి పాలయ్యారు. అయితే 2025 అసెంబ్లీ ఎన్నికల్లో అదే వందన కుమారిని 29వేల పైచిలుకు ఓట్లతేడాతో ఓడించి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. రేఖాగుప్తా ఎంపికను చివరి నిమిషంవరకూ గోప్యంగానే ఉంచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో అనుసరించిన వ్యూహాన్నే ఢిల్లీకి కూడా బిజెపి వర్తింపచేసింది. అలాగే బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళా సిఎం ఎవ్వరూ లేకపోవడంతో ఢిల్లీకి మహిళా సిఎంను నిలబెట్టాలన్న వ్యూహంతోనే రేఖాగుప్తాను ఎంపికచేసారు. దీనికితోడు పార్టీ రాజకీయాల్లో విద్యార్థి దశనుంచి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న గుప్తాను అనూహ్యంగా విజయం వరించింది. మొదటిసారి ఎమ్మెల్యే కావడం ఆపై వెనువెంటనే సీఎం పదవి ఆమెను వరించడంతో పార్టీశ్రేణులు కూడా ఆమెను అభినందిస్తున్నాయి.

**డిప్యూటి సిఎంగా పర్వేశ్‌సింగ్ వర్మ**

కాగా సిఎంగా మహిళా అభ్యర్థిని ఎంపికచేసిన బిజెపి డిప్యూటి సిఎంగా కేజ్రీవాల్‌పై గెలిచిన పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మను ఎంపికచేసారు. అలాగే స్పీకర్‌గా విజయేంద్రగుప్తాను ఎంపికచేసినట్లు బిజెపి హైకమాండ్ వెల్లడించింది. పరిశీలకులుగా మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్, పార్టీ జాతీయ కార్యదర్శిల సమక్షంలోనే జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా రేఖాగుప్తాను ఎన్నుకున్నారు. ఇక గవర్నర్ వికె సక్సేనాను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరతారు. సిఎంతోపాటు సుమారు ఆరుగురు కేబినెట్‌మంత్రులుగా ప్రమాణంచేస్తారని తేలింది. మధ్యాహ్నం 12.30 గంటలకు రామ్‌లీలామైదాన్‌లో ప్రముఖులు సమక్షంలో ప్రమాణస్వీకార వేడుకలు జరుగుతాయి.

**ప్రధానిమోడీ, అమిత్‌షాల హాజరు**

కాగా ప్రమాణస్వీకార సభకు ప్రధానిమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఇతర కేంద్ర మంత్రులతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ సీనియర్ నాయకులతోపాటు పారిశ్రామికవేత్తలు, బాలివుడ్ నటులు, ఇన్వెస్టర్లు అందరూ హాజరవుతున్నారు. సుమారు 50వేలమందికిపైగా ఈ రామ్‌లీలామైదాన్ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా. ఇందుకు సంబంధించి ఢిల్లీయంత్రాంగం ఇప్పటికే భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లుచేసింది.

## కృష్ణపట్నం భూముల బదలీకి ఉత్తర్వులు

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** చైన్నై బెంగుళూరు పారిశ్రామిక నడవా పరిధిలోని కృష్ణపట్నం నోడ్‌కు సంబంధించిన 2500.4 ఎకరాలను ఏపీఐఐసీ నుంచి ప్రత్యే వాహక నౌక కు ఔట్‌రైట్ సేల్స్ విధానంలో బదిలీ చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ భూములకు సంబంధించి ఇండియన్ స్టాంప్ చట్టం సెక్షన్ 9 ప్రకారం వర్తించే మినహాయింపులను పరిశీలించాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 2139.15 ఎకరాలను బదిలీ చేసేందుకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ భూముల బదిలీకి నిర్దేశించిన రూ.34 కోట్లు స్టాంపుడ్యూటీ కింద మినహాయింపులిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది.

## ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

>> వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మిర్చి రైతుల సమస్యలపై సిఎం మాట్లాడనున్నారు. మిర్చి ధర పతనంతో కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే చంద్రబాబు లేఖలు రాశారు. ఈ రాత్రికి సిఎం తిరిగి అమరావతి చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన కారణంగా గురువారం జరగాల్సిన కేబినేట్ భేటీ వాయిదా పడింది.

## ప్రకృతి సేద్యంతో మరింత వృద్ధి

>> క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థలు ఎంవోయూ చేసుకోనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అవకాశాలను, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని.. ఆరోగ్యంపై శ్రద్ధపెరుగుతోందని అన్నారు. తాము తీసుకునే ఆహారంపై వారు అవగాహన కోరుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్, ట్రేసబులిటీ అనేది కీలకం కానుందని అన్నారు. ఆ దిశగా తాము రైతులను, ఉత్పత్తి దారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రకృతి సేద్యం తన కల అని సిఎం చెప్పారు. రైతుల్లో చైతన్యం తెచ్చి అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం అని అన్నారు. దీనికి సహకరించాల్సిందిగా ఆ సంస్థల ప్రతినిధులను కోరారు. మేము వ్యవసాయంలో జాతీయ స్థాయిలో అన్ని సాగుపద్దతుల్లోను, ఉత్పత్తిరంగంలో ముందంజన ఉండాలనుకుంటున్నాం, ఇందుకు మీ సహకారం ఇవ్వాలని పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్‌ను సిఎం చంద్రబాబునాయుడు కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

## ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీలు

>> న్నారు. మందులు తీసుకునే దగ్గర కాస్త క్యూ ఉంది. దాని నివారణకు మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి సంక్లిష్ట వ్యాధుల నియంత్రణ, నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గుల్లియన్ బారీ సింద్రోమ్ (జిబిఎస్) విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల (జిజిహెచ్)లో తగిన వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి సత్య కుమార్ యాదవ్ మీడియాకు తెలిపారు. జిబిఎస్ కేసుల వివరాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి, ఈ వ్యాధి సోకడానికి, విస్తరించడానికి గల కారణాలను గుర్తించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ఈ వ్యాధి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో గత ఏడాది పది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 301 కేసులు నమోదుకాగా, వీటిలో అధిక మొత్తంలో 115 కేసులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదవ్వడానికి కారణం ఆ ఆసుపత్రిలో న్యూరాలజీకి సంబందించిన అన్ని రకాల వైద్య సేవలు, ఔషదాలు అందుబాటులో ఉండటమేనన్నారు. అదే విధంగా ఈ ఏడాది జనవరిలో 43 కేసులు నమోదు కాగా వారిలో 17 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జిబిఎస్ వ్యాధి బారిన పడిన వారికి తగిన వైద్య సేవలు అందజేసేందుకు అవసరమైన ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, ఏఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక పేషంట్ కి రోజుకి ఐదు ఇంజక్షన్లు ఐదు రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందని, బహిరంగ మార్కెట్ లో ఈ ఇంజక్షను ఖరీదు దాదాపు రూ.20 వేల వరకూ ఉందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో దీన్ని ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఎన్.టి.ఆర్.వైద్య సేవ పథకం క్రింద కూడా ఈ వ్యాధి కవర్ చేయబడుతున్నదన్నారు.

## ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

**వెంకటగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్తం** తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థినికి గర్భవతిని చేసిన ఇద్దరిపై వెంకటగిరి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 10వ తరగతి చదువుతున్న తన కూతురును ఇద్దరు వ్యక్తులు గర్భవతిని చేశారంటూ బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత కొన్నిరోజులుగా బాలిక శరీరంలో మార్పులు గమనించి బిడ్డకు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా గర్భవతిగా నిర్ధారణ చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో షేక్ రబ్బానీ (38), చినబాబు అలియాస్ బాలు (33)లను ప్రాథమికంగా నిందితులుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎవి రమణ తెలిపారు.

## మిర్చి రైతులను ఆదుకోండి

>> యంగా కొన్ని కారణాలు వల్ల మిర్చి రైతుకు రూ.20వేల ధర పలికిందన్నారు. బిందు సేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్ / స్ప్రింక్లర్లను ఏఒక్కరికీ పంపిణీచేయలేదన్నారు. దాదాపు రూ.1600 కోట్లు మేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే, తాము అధికారంలోకి వచ్చిన వెంటే రైతులకు ఆ సొమ్మును చెల్లించడం జరిగిందన్నారు. గడిచిన 10 ఏళ్లుగా మిర్చి ఉత్పత్తి ధరలపై వివరాలను సిఎం సమర్పించారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కలిసి రైతులకు సాయంపై వెంటనే జోక్యం చేసుకోవాలని కోరనుంది. ఈ క్రమంలోనే ఆయనకు సీఎం చంద్రబాబు లేఖలను రాసారు.. ఈ నేపథ్యంలో మిరప ధరలపై సీఎం చంద్రబాబు అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. గతేడాది డిసెంబరు 26 ఈ ఏడాది ఫిబ్రవరి 5,11 తేదీల్లో కేంద్రానికిలేఖలురాశారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఎంపీలు కూడా కేంద్రపెద్దలను కలసి సమస్యను వివరించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రిని కలిసి రైతుల సమస్యలపై వివరించనున్నట్లు సమావేశంలో సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.

## 1,554.99 కోట్ల విపత్తు సాయం

>> ప్రకటన చేసింది.

కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వరదలు కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు గతంలోనే ఎస్‌డిఆర్‌ఎఫ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 27 రాష్ట్రాలకు గానూ మొత్తం రూ.18,322.80 కోట్లు విడుదల చేసింది. అదే విధంగా ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి 18 రాష్ట్రాలకు రూ.4,808.30 కోట్లు కేంద్రం అందించింది. రాష్ట్ర విపత్తునిధి నుంచి 14 రాష్ట్రాలకుగారూ రూ.2208.55 కోట్లు, జాతీయ విపత్తు నిధి నుంచి 8 రాష్ట్రాలకుగానూ కేంద్రం ఇదివరకే రూ.719.72 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇక ఎన్డీఏ మిత్రపక్షాలలో ఎపి, బిహార్‌లకు అధిక వాటా కేటాయించారని తెలంగాణకు తక్కువ కేటా యించారని విమర్శలు చోటు చేసుకున్నాయి.



బుధవారం సమావేశమైన మూడు రాష్ట్రాల జలవనరుల మంత్రులు ఉత్తమ్, డికె శివకుమార్, నిమ్మల

### సానుకూల వాతావరణంలో చర్చించుకుందాం

## నీటి వివాదాలు పరిష్కరించుకుందాం

### మూడు రాష్ట్రాల జల వనరుల మంత్రుల ఏకాభిప్రాయం

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర జలశక్తి సంఘం ఆధ్వర్యంలోని అఖిలభారత స్థాయి ఇరిగేషన్ మంత్రుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, డికె శివకుమార్, ఉత్తమ కుమార్ రెడ్డిలు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ఒకవైపు కర్ణాటక, మరోవైపు తెలంగాణ సరిహద్దుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 3 రాష్ట్రాల సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎవరు నష్టపోకుండా మూడు రాష్ట్రాల రైతులు శ్రేయస్సు కోసం సమిష్టి నిర్ణయాల ద్వారా, సంప్రదింపుల ద్వారా కలసి కృషి చేద్దాం అన్నారు. తుంగభద్ర నీటి నిల్వ, పూడిక వంటి అంశాలతో పాటు ఇతర అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంలో రామానాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది నీటిని కాకుండా, గత పది సంవత్సరాలుగా కృష్ణానదికి వస్తున్న నీటిని చూడాలని వారి దృష్టికి తీసుకెళ్ళారు. కృష్ణా నది దిగుకు నీరు రావడం కష్టమవుతుందని ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల వంటి ప్రాజెక్టులు నిండితేనే, కిందకు నీరు వస్తుందని రామానాయుడు వివరించారు. ఈ దశలో కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ ఆయికట్టులకు నీరందించడం కష్టంగా మారిందని నిమ్మల వివరించారు. అలాగే శ్రీశైలం నాగార్జునసాగర్ జలాశయాల్లో ఉన్న నీటిని తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. తద్వారా ఇరు రాష్ట్రాల రైతులకు ఎటువంటి పంట నష్టం, తాగు నీటి ఇబ్బంది లేకుండా జూన్ వరకు ప్రణాళిక బద్ధంగా పరస్పర అంగీకారంతో పనిచేయాలనుకున్నారు. తుంగభద్ర రిజర్వాయర్ పూడికతీతకు ప్రత్యామ్నాయంగా చేపట్టవలసిన చర్యలు గురించి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఎపి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలుస్తానని కోరారు. ముందు తగు ప్రతిపాదనలతో అధికారుల స్థాయిలో చర్చించి ఆ తదుపరి ముఖ్యమంత్రిని కలవొచ్చని ఆయనకు సూచించారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తి

### కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఉదయ్ పూర్ లో అఖిల భారత స్థాయిలో జరుగుతున్న రాష్ట్రాల జల వనరుల శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ప్రత్యేకంగా కలిసారు. ఆయనకు రాష్ట్ర నీటి వనరులు, జరుగుతున్న పనులు, కావాల్సిన సాయం తదితర అంశాలతో నివేదిక అందజేశారు. నివేదిక లోని అంశాలను విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రధాని మోదీ కూడా పోలవరం ప్రాజెక్ట ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటున్నట్లు చెప్పారు. త్వరలో తాను కూడా పోలవరం ప్రాజెక్ట సందర్శనకు వస్తానని హామీ ఇచ్చారు. తొలుత రామానాయుడు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు జల వనరుల శాఖ మంత్రి సి ఆర్ పాటిల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుని మూడుసార్లు సందర్శించి, పోలవరం పూర్తికి గడువును 27 డిసెంబర్ కు నిర్దేశించి నిర్దేశించినట్లు మంత్రి నిమ్మల కేంద్రమంత్రికి వివరించారు.

సాంకేతిక అంశాలకు సంబంధించి డిజైన్లను త్వరితగతిన ఆమోదించి, పంపించాలని కోరారు. అలాగే 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సిఎం రివ్యూలు చేస్తున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని, మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతామని చెప్పారు. డివాల్ నిర్మాణంతో పాటు సమాంతరంగా ఈసిఆర్‌ఎఫ్ నిర్మాణ పనులు చేపట్టే విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్యాప్1 లో ఇప్పటికే డివాల్ నిర్మాణం పూర్తయ్యిందని, ఈసిఆర్‌ఎఫ్ నిర్మాణానికి పెండింగ్ లో ఉన్న అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వివరాలను ప్రతినెలా, కేంద్రానికి తెలియచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని, అందుకుగానూ, ప్రతి నెలా కేంద్రానికి పనుల వివరాలు పంపిస్తామని తెలిపారు.

## సిఇసిగా జ్ఞానేశ్వర్‌కుమార్ బాధ్యతల స్వీకారం

### కమిషనర్‌గా విధుల్లో చేరిన వివేక్ జోషి



బుధవారం సిఇసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జ్ఞానేశ్ కుమార్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా ఎంపికచేసిన జ్ఞానేశ్ కుమార్ బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కొత్త కమిషనర్‌గా నియమితులయిన వివేక్‌జోషికూడా ఎన్నికల కమిషనర్‌గా విధుల్లోచేరారు. 2024 మార్చినెలనుంచి ఎన్నికలసంఘంలో కమిషనర్‌గా పనిచేస్తున్న జ్ఞానేశ్ కుమార్‌ను చీఫ్‌కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ కూడా జారీచేసారు. ఇప్పటివరకూ పనిచేసిన రాజీవ్‌కుమార్ పదవీకాలం పూర్తికావడంతో ఆయన మంగళవారమే పదవినుంచి దిగిపోయారు. ఇక రెండో ఎన్నికల సంఘం కమిషనర్‌గా ఉత్తరాఖండ్ కేడర్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధు కొనసాగుతు న్నారు. జోషి హర్యానాకేడర్ మాజీ ఐఎఎస్ అధికారి. ఆయన్ను కమిషనర్‌గా జ్ఞానేశ్వర్‌పనిచేసిన పోస్టులో నియమించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే ముందు ప్రధాన లక్ష్యమని, అంతే కాకుండా 18 ఏళ్లునిండిన ప్రతిపౌరుడుకూడా ఓటరుగా నమోదుచేసుకోవాలని, ఓటు హక్కు వినియో గించుకుని తమకు నచ్చిననేతలను చట్టసభలకు ఎన్నుకునేవిధంగా అవగాహన పెంచాల్సిన కర్తవ్యం ఎన్నికల సంఘానిదేనని అన్నారు. ఎన్నికలసంఘం నిరంతరం ఓటర్లతో మమేకమై పనిచేస్తుందని ఆయన అన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 20-02-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
సప్తమి ఉ.9.59
విశాఖ మ.1.29
వర్జ్యం : సా.5.53-7.39
దు.ఉ.10.33-11.20, 2) మ.3.13-4.00
శుభసమయం : ఉ.8.15-8.40
రా.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం :** సంఘంలో గౌరవం పొందుతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి.

**వృషభం:** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. జీవిత భాగస్వామ్య సాయం అందిస్తారు.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందుల నుండి కొంతవరకు బయటపడతారు.

**కర్కాటకం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ప్రయాణాలు.

**సింహం:** అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు.

**కన్య :** రుణాలు తీరి ఊరట చెందుతారు. విలువైన సమాచారం అందుకొంటారు.

**తుల :** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి సన్మానాలు పొందుతారు.

**వృశ్చికం:** పాతమిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. ధనలాభం.

**ధనుస్సు:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**మకరం:** గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. కొత్త మిత్రుల పరిచయం.

**కుంభం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. పనులు పూర్తి.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి వత్తిడులు ఎక్కువవౌతాయి. ఖర్చులు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలో బతకలేని రైతు

>> ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతుల కష్టాలు కనిపించడం లేదని వారి బాధల పట్ల కనీసం కనికరం కూడా లేదన్నారు. రైతుల పట్ల కూటమి సర్ కార్యహరిస్తున్న తీరుపై మాజీ సిఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు సూచించారు. రాజకీయ దురుద్దేశంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఎల్లకాలం ప్రభుత్వం ఇదే ఉండదని తమ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ఎవరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తనను మిర్చి యార్డు సందర్శించకుండా అడ్డంకులు సృష్టించారని కనీసం ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన భద్రత కూడా కల్పించలేకపోయారని ఆరోపించారు. ఇవన్నీ కూడా తను గుర్తుపెట్టుకుంటానని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేయాలో తనకు తెలుసునని జగన్ హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డితో తమ ఆవేదన వ్యక్తం చేసిన మిర్చి రైతులు.. మిర్చి యార్డులో రైతులను స్వయంగా కలిసి ధరల గురించి ఆరా తీశారు. రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని జగన్ ఎదుట వాపోయారు. గతంలో మేలు రకం మిర్చి రూ.18,000 నుండి 20 వేల రూపాయల వరకు కొనుగోలు చేసేవారిని ప్రస్తుతం రూ. 10,000 రూపాయలు కూడా కొనే పరిస్థితి లేదని జగన్ వెదుట రైతులు వెల్లబుచ్చారు. యార్డులో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మరికొందరు రైతులు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. మరికొందరు రైతులు సీజన్లో మధ్యాహ్నం భోజనం కూడా సరిగా కొనసాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకు మాజీ సిఎం జగన్ వస్తున్నారని సమాచారంతో వైసీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు.

**ఎన్నికల నిబంధల ఉల్లంఘనపై కేసునమోదు :**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని పర్యటన వాయిదా వేసుకోమని పోలీసులు తెలిపినా పటించుకోకుండా మిర్చియార్డు పర్యటించినందు వల్ల ఎన్నికల కోడ్ నిబంధపై జగన్‌తో పాటు కోడాలినాని, అంబటి రాంబాబు మేరుగు నాగార్జున, అప్పిరెడ్డిలపై కేసునమోదు చేశారు.

# ఇక మెరుగైన పౌరసరఫరాలు

>> కలిసి ఒకే నిర్ణయంతో ముందుకు సాగాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు నిలబడి మెరుగుగా పనిచేయడం తద్వారా అంతిమంగా వ్యవస్థ నిలబడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తర్వాత మిల్లర్లకు వద్దు ప్రభుత్వానికే ధాన్యం అమ్ముతామనే పరిస్థితి రైతు నుంచి వచ్చిందన్నారు. ఇప్పటివరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.7,522 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 24 గంటల్లోనే రూ.7,508 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నష్టపోయి, నమ్మకాన్ని కోల్పోయిన రైతుకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం2 పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడానికి, పథకాల అమలులో పారదర్శకత పెంచేందుకు ప్రతిఒక్కరూసహకరించాలని మంత్రి నాదెండ్ల పిలుపునిచ్చారు. అందుకు ప్రజల్లో ఉన్న సందేహాలను నివృతి చేయాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. అందుకు తగ్గట్లుగా అధికారుల సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలుచేపట్టాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఆన్‌లైన్ వ్యవస్థకు సిద్ధం కావాలన్నారు. గత 25 సంవత్సరాల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేషన్ షాపు నుంచి ఒక బస్తా బియ్యం దారి మళ్లితే వెంటనే ఫోన్ వచ్చేదని, ఈ విధంగా ప్రజలకు రేషన్ మాఫియాపై అవగాహన పెంచాలని సూచించారు. దేశంలో ఇప్పటికీ చాలామంది పేదవాళ్లు ఆహారం(ధాన్యం)కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వచ్చే అకడమిక్ సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మిడ్ డే మీల్స్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు పౌర సరఫరాల శాఖ నుంచి సన్న బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందించబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సివిల్ సప్లై, తూనికలుకొలతలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు. ఇక రైతు సేవా కేంద్రాలు, రైస్‌మిల్లు మధ్య ధాన్యంతేమ శాతంలో తేడా వస్తే చర్యలు తీసకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. నాదెండ్ల రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా రూ.7522 కోట్లు జమ చేశాం. అందులో 24 గంటల్లోనే రూ.7508 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. ధాన్యం సేకరణలో 30 వేల లారీలు, 37 వేల మంది హమాలీలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక పర్యాటకంలో ఎపి టాప్

>> నిదర్శనమన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం, టెంపుల్ టూరిజంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏటా 36-40మిలియన్ల మంది యాత్రికులు సందర్శిస్తున్నారని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 27, 105 ఆలయాలు నిలయంగా ఉందన్నారు. ఐటిసిఎక్స్ దేవాలయాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక ప్రపంచ సమాజం అన్నారు.

**అందరూ సంస్కృతిని కాపాడుకోవాలి:**

హిందూ ధర్మం సనాతనమైందని, మానవసేవే మాధవసేవగా సాటి మనుషులకు సమాజానికి సేవచేస్తే , ఆదేవుడికి సేవచేసినట్లేనని హిందూ ధర్మం చెబుతుందని మంత్రి లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. మన దేశసంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పదన్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం మన వైపు చూస్తుందని ,మన సంస్కృతిలో ఆలయాలు, పండుగలు, పూజలు ముఖ్యమైనవన్నారు. పిల్లలకు గంటలు గంటలు ఫోన్లు, ట్యాబ్‌లు ఇచ్చే పద్దతికి స్వస్తిచెప్పాలన్నారు. ఆ సమయంలో మన పురాణాలు, మన దేవుళ్ల ,మన పండుగలు, ఆచారాలు గురించి పుస్తకాలు ఇవ్వాలన్నారు. అందరం కలసి సంస్కృతిని కాపాడుకోవాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టిలో ఆలోచించి ఆలయాల పరిపాలనను మెరుగుపరచడానికి సిబ్బంది, భక్తుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు. అర్చకుల పారితోషికం నెలకు 15వేల రూపాయలకు పెంచారన్నారు. అనంతరం ఐటిసిఎక్స్ నిర్వాహకులు మంత్రి లోకేశ్‌ను దుశ్శాలువతో సన్మానించి, శ్రీవారి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, ఐటిసిఎక్స్ టెంపుల్‌కన్వెన్షన్ వ్యవస్థాపకుడు గిరీష్‌వాసుదేవ్‌కులకర్ణి, చైర్మన్‌ప్రసాద్‌లాడ్, తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## ఎయు విసి ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు పలువురి అభినందనలు

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా నియమితులైన ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఏయూ విశ్రాంత అధ్యాపకులు సంక్షేమ సంఘం బాధ్యులు ఆచార్య డీబీఆర్ఎస్‌కె బెనర్జీ ఒక ప్రకటనలో నూతన వీసీ ఏయూలో సంస్కరణలు చేపట్టాలని శత వార్షికోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆచార్య రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏయూ పూర్వ వైభవం సంతరించుకొంటుందన్నారు. శాసనమండలి పూర్వపు సభ్యుడు అమ్మినేని శివరామకృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ఓఎస్‌డి డాక్టర్ నిరీక్షణకుమార్ తదితరులు రాజశేఖర్ నియామకాన్ని స్వాగతించారు.

## ఎమ్మెల్యేల అవగాహన సదస్సు వాయిదా..

### రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర

**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసన సభా భవనంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించాల్సిన ఎమ్మెల్యేల అవగాహన సదస్సు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. ఈ అవగాహన సదస్సు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తదుపరి తెలియజేస్తామన్నారు. ఈ అవగాహన సదస్సును లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా ప్రారంభించాల్సి ఉంది. మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్యనాయుడు కీల ప్రసంగం చేయాల్సివుంది.ఈ సమావేశాలను మార్చిలో శాసనసభా సమావేశాలు ముగిసిన తరువాత తిరిగి నిర్వహించే అవకాశం ఉంది.


తిరుపతిలో టిడిపి నేతలు, కార్యకర్తలతో మంత్రి లోకేశ్ సమావేశం

# పనిచేసేవారిని ప్రోత్సహిస్తా!

- కార్యకర్తలకు అండగా నిలబడాలి
- సాంకేతికతతో మదించి పదవులు
- తిరుపతిలో కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్

**తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు దేశంపార్టీలో పదవుల పంపిణీకి కొత్తవిధానం తీసుకువస్తామని, ఎక్కడకు వెళ్ళినా కార్యకర్తలను కలవడానికి ప్రాధాన్యం ఇస్తానంటూ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. పార్టీలో పనిచేసేవారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ పద్దతిలో సాంకేతికతతో పనితీరును మదింపుచేసి, గుర్తించిన వారికి పదవులు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. పార్టీలో జాతీయ అధ్యక్షుడి నుండి బూత్ఇన్‌ఛార్జి, బూత్‌కమిటీ సభ్యుల వరకు "కుటుంబ సాధికార సారధి"నమోదు కావాల్సి ఉంటుందన్నారు. ఒకరోజు తిరుపతి పర్యటనకు బుధవారం ఉదయం వచ్చిన మంత్రి నారాలోకేశ్ పార్టీ కార్యకర్తలు, నేతలతో తిరుపతి కపిలతీర్థంలోని పార్టీ కార్యాలయంలో సుదీర్ఘంగా ఐదుగంటల పాటు సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు పులివర్తినాని, బొజ్జలసుధీర్‌రెడ్డి, తిరుపతినాయకులు నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, వట్టికుంటశంకరనారాయణ, సుగుణమ్మ, మబ్బుదేవనారాయణరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, రవినాయుడు,సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతి యాదవ్, బుల్లెట్‌రమణ తదితరులతో కలసి ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం సమన్వయసమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. పార్టీలేకపోతే మనం ఎవరూ లేమని గుర్తుంచుకోవాలన్నారు. మనకు సమాజంలో గౌరవం లభిస్తుందంటే అందుకు కారణం తెలుగుదేశం పార్టీనే అన్నారు.

**- మొదట కార్యకర్తలతోనే సమావేశమవుతా:** టిడిపి కోటి సభ్యత్వంతో అతిపెద్ద కుటుంబంగా మారడానికి కార్యకర్తే అధినేత అని మంత్రి లోకేశ్ ఉద్ఘాటించారు. ఇకపై ఏ నియోజకవర్గం పర్యటనకువెళ్ళినా మొదట కార్యకర్తలతోనే సమావేశమవుతానని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా అందరికీ పదేపదే చెప్పేది ఒక్కటేనని, ఏ నియోజకవర్గంలో పర్యటించినా అక్కడి క్లస్టర్,యూనిట్, బూత్ కమిటీ సభ్యులను కలిసి మాట్లాడాలన్నారు."బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారంటీ,,మన టిడిపి యాప్, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కావాలని మంత్రి ఆదేశించారు. అందులో భాగంగానే పార్టీని బలోపేతం చేసేందుకు సగంరోజు మీతోనే గడుపుతున్నానన్నారు. పార్టీ, ప్రభుత్వం రెండు అనుసంధానమై పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో తన పాదయాత్రలో అన్నా "నేను కష్టపడ్డాను...నన్ను గుర్తించడంలేదు"అని చాలామంది నాతో చెప్పారన్నారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని, పనిచేసేవారిని ప్రోత్సహిస్తానని మరోసారి స్పష్టం చేశారు.

**-పార్టీ సుప్రీం...కూటమిని కలుపుకుని పనిచేయండి:** పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ నిర్దేశం చేశారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా జయప్రదం చేయాలని ,కూటమి పార్టీల నేతలను కలుపుకుని పనిచేయాలని సూచించారు. ఏ విషయం అయినా సమిష్టిగా చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యకర్తలకు ఏ పార్టీ చేయని విధంగా ప్రమాద బీమా 5లక్షలు రూపాయలు చేశామన్నారు. త్వరలో కార్యకర్తల ఆరోగ్యానికి సంబంధించి కూడా మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. కార్యకర్తల పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు పార్టీ కార్యాలయంలో కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామన్నారు.

**-వైసిపి దుష్ప్రచారం తిప్పికొట్టండి:** పార్టీలో గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని, మన లక్ష్యం పార్టీ బలోపేతం కావడమేనని మంత్రి అన్నారు. నేడు వైసిపికి ప్రతిపక్షహోదా కూడా లేదని, వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికోట్టాలని ఆయన నేతలకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి అన్నీ అప్పులుచేసి పోయారని, అయినా ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని ,ఫెన్షన్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల వైసిపి నుండి స్వతంత్రులుగా ఉన్న 15మంది కార్పొరేటర్లతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# తిరుమల సమాచారం

## ధ్వజారోహణంతో కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా మొదలయ్యాయి. అర్చకుల వేద మంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, వినాయకస్వామి, చండీకేశ్వరస్వామి, వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో మకర లగ్నంలో నందిచిత్రంతో కూడిన ధ్వజపటం అధిరోహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణివాసన్ గురుకుల్ వేదోక్తంగా ధ్వజపటం ఎగురువేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం విశేషంగా జరుగుతుంది. 27న కల్యాణోత్సవం, 28న త్రిశూలస్నానంతో ,ధ్వజావరోహణంతో ముగుస్తాయి. అనంతరం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు ఉదయగురుకుల్ పాల్గొన్నారు.

## బోర్డు సభ్యుడు రాజీనామా చేయాలి

- ఆయన తీరు బాధ్యతారాహిత్యం
- టిటిడి ఉద్యోగ, ప్రజాసంఘాలు డిమాండ్

**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి చెంత సేవకునిగా, భక్తిభావంతో వ్యవహరించాల్సిన ఓ బోర్డుసభ్యుడు ఆలయం వెలుపలకు వచ్చేముందు మహద్వారం గేట్ వద్ద ఉద్యోగిపై చిందులేయడం, దుర్భాషలాడటం మంచిది కాదని, విచక్షణారహితంగా ప్రవర్తించిన ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని టిటిడి ఉద్యోగ ,ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తితో భక్తుల పట్ల, ఉద్యోగుల పట్ల హుందాగా ఉండాల్సిన బోర్డు సభ్యుడే ఇలా



వ్యవహరించడం భక్తులను కలచివేసిందని అంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సిఎంఓ కార్యాలయం టిటిడి అధికారులను సంప్రదించి సిసికెమెరా పుటేజీ వివరాలు ఆరా తీసిందని తెలిసింది. ఉద్యోగి పట్ల దురుసుగా, రాయలేని మాటలతో దుర్భాషలాడిన కర్నాటక బోర్డుసభ్యుడు పదవికి రాజీనామా చేయకుంటే దశలవారీగా ఆందోళనలను చేపడతామని టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు చీర్ల కిరణ్, తదతరులు హెచ్చరించారు. మహద్వారం గేట్‌లో విధుల్లో ఉన్న బాలాజీకి అండగా నిలబడతామన్నారు. టిటిడి నిబంధనలప్రకారం నడచుకోవాల్సిన విఐపిలు కూడా అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగదన్నారు. విఐపిలు కూడా దేవదేవుని దర్శనానంతరం సాధారణ భక్తులలాగే బయటకు వెళ్ళాల్సి ఉందన్నారు. అయితే బోర్డు సభ్యుడనే భావంతో మహద్వారం గేట్‌తెరవలేదని ఆయన తీరు ఉద్యోగుల అంకితభావ సేవలను కలచివేస్తోందన్నారు. ప్రభుత్వం, టిటిడి ఆయన పై చర్యలు తీసుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేస్తామని చెబుతున్నారు. కాగా ప్రజాసంఘాలు కూడా బోర్డుసభ్యుడి వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమలలో తప్పిపోయిన భక్తుడు



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు కుటుంబసభ్యుల నుండి క్యూలైన్‌లో తప్పిపోయాడు. నాలుగురోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో కుటంబసభ్యులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరుజిల్లా పోనంగిగ్రామానికి చెందిన దాసరి సీతారం కుటుంబంతో ఈనెల 15న తిరుమలకు వచ్చారు. వైకుంఠంమ్ క్యూకాంప్లెక్స్‌లో స్కానింగ్ వద్ద తప్పిపోయాడు. కుటుంబసభ్యులు దర్శనానంతరం వెలుపలకు వచ్చారు. ఆయన ఆచూకీ తెలియలేదు. తిరుమల,తిరుపతి ,స్వగ్రామంలో వెదికినా కనబడలేదు.దీంతో కుటుంబసభ్యులు తిరుమలకు వచ్చి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల సిఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. ఆ చూకీ తెలిస్తే 9440696769, 9440796771 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

# పోలీసులను బెదరించడాన్ని జగన్ మానుకోవాలి

### - రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తమను ఇబ్బందులు పెట్టిన పోలీసులు ఎక్కడ ఉన్నా తీసుకొచ్చి బట్టలు ఊడదీసి నిలబెడతామంటూ మాజీ సీఎం జగన్ పోలీసులను బెదిరించడాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారులసంఘం రాష్ట్రఅధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడారు. 8 నెలల క్రితం ఉన్న పోలీసులే ఇప్పుడూ ఉన్నారనే విషయాన్ని జగన్ గ్రహించాలన్నారు. రాజకీయాలకు, వర్గాలకు, రాగద్వేషాలకు అతీతంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. చట్టం, న్యాయం, ధర్మం, సత్యానికి సంకేతాలైన ఆ నాలుగు సింహాలకే పోలీసులు సెల్యూట్ చేస్తారు తప్ప చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వారికి చేయరనే సంగతి జగన్ తెలుసుకోవాలని సూచించారు. పోలీసులపై ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేయొద్దంటూ హితవు పలికారు. పోలీసులపై చేసిన బెదిరింపు వ్యాఖ్యలను జగన్ వెంటనే వెనిక్కి తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.ఆయన స్థాయిని ఎంటో గుర్తించుకోవాలన్నారు.ఓ బాధ్యతాయుతమైన ప్రజా ప్రతినిధి, మాజీ ముఖ్యమంత్రికి మాట్లాడే తీరు నేర్పించాల్సిరావడం ఇబ్బందికరంగా ఉందన్నారు. చట్టాలపై ఆయనకు ఏ మాత్రం గౌరవం లేదనే విషయాన్ని ఈ వ్యాఖ్యలే బహిర్గతం చేస్తున్నాయని మండిపడింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడ దిగజారాయో చెప్పాలని డిమాండు చేసింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మిర్యాల బాలసురేష్ జి అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త** నిర్వహణ పరమైన కారణాల వల్ల సికింద్రాబాద్–దానాపూర్–సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే నెంబర్ 12791/92 ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నేటి (ఈనెల 20)నుంచి 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి.

## విజయవాడలో విశేషంగా ఆకట్టుకుంటున్న 'గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025'


గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" చీరల ప్రదర్శన

**విజయవాడ,ఫిబ్రవరి19, ప్రభాత వార్తప్రతినిధి:** విజయ వాడలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైనగ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. మహిళలు ఈ ప్రదర్శనకు భారీగానే తరలి వస్తున్నారు. స్థానిక మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఇటీవల ఈ ప్రదర్శనను ప్రారంభించారు. గ్రామీణ భారతదేశ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ ప్రదర్శన ను ఇప్పటి వరకు 10 వేల మంది సందర్శించగా వివిధ వస్తువుల కొనుగోళ్ల ద్వారా రూ. 35 లక్షల ఆదాయం వచ్చిందని నాబార్డు డీజీఎం మురారీ మోహన్ బెహ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు నగర ప్రజలతోపాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వివిధ రాష్ట్రాల నుంచి ఏర్పాటైన కళాఖండాలు, వస్త్రాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి నైపుణ్యం కలిగిన చేనేత మరియు హస్త కళాకారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు ఇందులో ప్రదర్శిస్తున్నారన్నారు.. గ్రామీణ భారతదేశ అభివృద్ధి కోసం నాబార్డు చేస్తున్న సమగ్ర కృషిని నగర ప్రజలు మరింత ఆదరించాలన్నారు. ఈ రాష్ట్ర స్థాయి ప్రదర్శన ఈనెల 24 ఆదివారం తో ముగియనున్నదని నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీజీఎం విజ్ఞప్తి చేశారు.ఈ ప్రదర్శనలో రాష్ట్ర సాంప్రదాయ హస్తకళల్లో మంగళగిరి పట్టు, ఉప్పాడ, పొందూరు ఖద్దరు, తెలంగాణ ప్రత్యేకతలైన నారాయణపేట సిల్క్ కాటన్ చీరలు ఉన్నాయన్నారు. అలాగే శ్రీకాకుళంలోని సిక్కోలు కాటన్ చీరలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. తిరుపతికి చెందిన బాలాజీ హస్త కళలు, ధర్మవరం పట్టు చీరలు, శ్రీ బాలాజీ కాటన్ సిల్క్, కొండపల్లి, ఏటికొప్పాక వంటి సంప్రదాయ కళాఖండాలతో పాటు, తమిళనాడు నుండి ప్రత్యేకంగా వచ్చిన నవసారిగై ఎప్కో పట్టు చీరలు కూడా ఈ ప్రదర్శనలో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

## అమరావతిలోని 13 గ్రామాల్లో ఒకేరోజు రూ.12,422 కోట్లతో టెండర్లు

**రాజంపేట అర్బన్ ఫిబ్రవరి19 ప్రభాతవార్త** అమరావతి రాజధాని అభివృద్ధి దేశంలో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. అటు ప్రపంచ బ్యాంకు నిధులు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్,ఇటు కేంద్ర ప్రభుత్వం నిధులు ఖరారు కావడంతో రాజధాని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసింది. అందులో భాగంగా ఏపీ సి ఆర్ డి ఏ ఒకే రోజు 14 గ్రామాలలో 12,422 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బుధవారం టెండర్లు పిలిచి రికార్డు సృష్టించింది. రాజధాని నిర్మించనున్న గ్రామాలలో ఇప్పటికే 13 గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచన ప్రభుత్వం తాజాగా ఒకే రోజు మరో 13 గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లను పిలిచింది. ఏపీ సి ఆర్ డి ఏ పరిధిలోని లింగాయపాలెం ,ఉద్దండ రాయునిపాలెం, వెలగపూడి, మందడం, కృష్ణాయపాలెం, మల్కాపురం, మందడం, అయినవోలు ,వెలగపూడి, వెంకటపాలెం, కూరగల్లు, నౌలూరు, నిడమర్రు గ్రామాలలో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించింది. పైన పేర్కొన్న భూ సమీకరణ చేసిన గ్రామాలలో మౌలిక సదుపాయాలు, లే అవుట్ల అభివృద్ధి కోసం టెండర్లు పిలిచారు. 7ఏ జోన్ పరిధిలో 1235.52 కో, 9 జోన్ పరిధిలో 2774 కోట్ల తోను,9ఏ జోన్ పరిధిలో 1817 కోట్ల వ్యయం తోను, 10జోన్ లో 1487.50 కోట్ల తోనూ,12 జోన్ పరిధిలో 2949 కోట్ల తోను,12ఏ జోన్ పరిధిలో 2159 కోట్ల రూపాయల అంచనా వ్యయంతోను అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచారు. టెండర్లలో పాల్గొనేందుకు నేటి నుంచి మార్చి 6 చివరి గడువు కాగా, అదే రోజున సాంకేతిక బిడ్ కూడా తెరుస్తారు. ఈ మేరకు ఏపీ సి ఆర్ డి ఏ కమిషనర్ టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆదివాసీ మహిళలపై పెరుగుతున్న హింసను సంఘటితంగా ప్రతిఘటించాలి

### ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్, టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత


దళిత స్త్రీశక్తి 18వ వార్షిక సభలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్,టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** దళిత ,ఆదివాసీ మహిళలపై పెరుగుతున్న హింసను సామాజిక వాదులంతా సంఘటితంగా ప్రతిఘటించాలని ఏపీ ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్,టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత వ్యాఖ్యానించారు.దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో డీఎస్ ఎస్ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షతన బుధవారం విజయవాడలోని అంబేద్కర్ భవన్ లో డీఎస్ఎస్ 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసి మహిళలపై జరుగుతున్న హింస, మానసిక ఆరోగ్యం వివిధ కోణాలు అంశంపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎపి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సునీత మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం దళిత మహిళలపై హింసాత్మక ఘటనలు పెట్రేగి పోతున్నాయని చెప్పారు. 23 శాతం మహిళలపై లైంగిక దాడులు జరుగుతుంటే కేవలం 2 శాతం మాత్రమే నిందితులకు శిక్షపడుతుందని సునీత అన్నారు. మహిళలపై హింసలో ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే తెలుగు రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. అయినప్పటికీ ప్రతినిత్యం స్త్రీలపై హింస పెరిగిపోతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి హింసాత్మక ఘటనలపై దళిత స్త్రీ శక్తి పోరాడటం అభినందనీయమని అన్నారు. 1989 అట్రాసిటీ యాక్ట్ ప్రకారం అందాల్సిన న్యాయం అందడం లేదని చెప్పారు. అందుకే దళిత స్త్రీలపై దాడులు పెరగడానికి కారణమని చెప్పారు. దళితుల జనాభా పెరుగుతున్నా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మాత్రం తగ్గుతున్నాయని వివారించారు. హక్కుల పరిరక్షణ కోసం సంక్షేమ పథకాల అమలు కోసం డిఎస్ఎస్ కృతనిచ్చయంతో పనిచేయడం స్ఫూర్తినిస్తుందని ఆమె పేర్కొన్నారు. పేబ్యాక్ టు ద సొసైటీ నినాదాన్ని ప్రతి ఒక్కరు ఆచరిస్తేనే దళిత స్త్రీల ఆర్థిక, సామాజిక ఎదుగుదల సాధ్యమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ సరస్వతి అయ్యర్ మాట్లాడుతూ స్త్రీలపై హింస అనేక ప్రభావాలకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మానసికంగా ఎంతో ప్రభావానికి గురిచేస్తుంది వివరించారు. ఇలాంటి సంఘటన వల్ల స్త్రీలు మానసిక రుగ్మతలకు గురవుతూ తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతుంటారని పేర్కొన్నారు. ఇందులో దళిత బాలికలు, మహిళలే ఎక్కువగా బాధితులని ఆమె వివరించారు. మానసిక ఆరోగ్య సామాజిక రుగ్మతల నుంచి బయటపడేందుకు దళిత స్త్రీ శక్తి విశేషకృషిని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ప్రతి ఐదు మందిలో ముగ్గురు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు ఇటీవల వచ్చిన నివేదిక వివరిస్తుందని ఇందులో స్త్రీలే ఎక్కువగా బాధితులని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతిని ప్రతి విషయంలోనూ వ్యక్తులు కృంగుబాటుకు గురవుతారని పేర్కొన్నారు. ఈ సంఘటనలను అధిగమిస్తేనే మహిళా సాధికారత సాధ్యమని అందుకు డిఎస్ఎస్ కృషిని అభినందించారు. ఝాన్సీ గెడ్డం తన అధ్యక్ష ఉపన్యాసంలో గత 19 సంవత్సరాలుగా దళిత ఆదివాసి స్త్రీలు బాలికలపై అరాచకాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. అనేక ఒడిదొడుకులు, ఒత్తిడుల మధ్య దళిత స్త్రీ శక్తి 20 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తనదైన పాత్రను పోషిస్తూ ముందుకు సాగుతున్నదని వివరించారు. దళిత, ఆదివాసి స్త్రీలపై జరుగుతున్న అనేక హింసాత్మక ఘటనలు ప్రతిఘటిస్తూ బాధితులకు న్యాయం చేకూరే దిశగా పోరాడిందని అన్నారు. ఈ సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా ముందుకు వెళుతున్నామని అన్నారు. సీనియర్ పాత్రికేయులు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలు హింసాత్మక ఘటనలతో ఉండకూడదని సూచించారు. హింస ఎవరు చేసినా సహించకూడదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు హింసకు గురైతే ఆ ప్రభావం కుటుంబంలోని పిల్లల మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. మెరుగైన సమాజం కావాలంటే మానసిక శారీరక సామాజిక హింసను నిర్మూలించడమే శరణ్యమని ఆయన పేర్కొన్నారు.

## జగన్ మానసిక స్థితి బాగాలేదనిపిస్తోంది: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఓడిపోతే అందుకు కారణాలు సమీక్షించుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహంవ్యక్తం చేశారు. 150 సీట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి ఐదేళ్లు ప్యాలెస్‌లకే పరిమితం అయ్యారని విమర్శించారు. ప్రతిపక్షాలు మీడియా ఎంత ఘోషించినా ఐదేళ్ల ప్యాలెస్‌లు వీడలేదన్నారు .ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లోఉండొద్దనే ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల కోసం పనిచేసేవాడే నిజమైన నాయకుడని చెప్పారు. జగన్ మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి బాగాలేదనిపిస్తోందన్నారు. జగన్ పిచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ మిర్చియార్డు వద్ద పచ్చి అబద్దాలు చెప్పారు. ఎవరైనా నవ్వుకుంటున్నారన్న స్పృహ కూడా లేదు. గుంటూరు మిర్చి యార్డు ఇప్పుడు కొత్తగా రాలేదు. గతంలోనూ ఉంది. జగన్ సొంత మీడియాలో అబద్దాలు ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలో 11 జిల్లాల్లో మర్చి పంట పండుతోంది. ధర రూ.13 వేలకు పడిపోయిందని జగన్ అంటున్నారు. గత ఐదేళ్లఓ మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13వేలు ధర ఉంది. రెండేళ్లు మాత్రమే మిర్చి రైతులకు రూ.20వేలు ధర పలికింది. మిర్చి రైతులకు ఇబ్బందులున్న మాట వాస్తవం సాగు ఖర్చులు పెరిగాయి. పని లేకపోవడంతోనే జగన్ అనవసర విమర్శలు చేస్తున్నారు. ఐదేళ్లూ నాటకాలాడి ఇప్పుడేమా ప్రేమ ఒలకబోస్తున్నారు. జగన్ పాలనలో వ్యవసాయశాఖను పట్టించుకున్న పాపానపోలేదు. ఆదాయం తెచ్చే శాఖలకు జగన్ తాళం వేసి బిగించారు. ఇప్పుడు ఆయన వాటిగురించి మాట్లాడుతున్నారు. ఐదేళ్ల పాలనతో జగన్ రైతుల కోసం ఒక్క మంచి పని కూడా చేయలేదు. సెంటు భూమికి కూడా భూపరీక్షలు చేయించలేదు. వ్యవసాయశాఖనుఅటకపై పెట్టారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ఒక్క పైసా ఖర్చు చేయలేదు. తాను పుట్టిన రాయలసీమలోనూ డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వలేదు. జగన్ రైతులకు పెట్టిన రూ.1600 కోట్ల బకాయిలను మేం వచ్చాక చెల్లించాం. టమాటా ధర తగ్గితే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేశాం. ఈ 8 నెలల్లో ఎరువులు బఫర్ స్టాక్ పెట్టాం. ప్రకృతి విపత్తుల సమయంలో జగన్ ఏనాడూ పైసా ఇవ్వలేదు. మేం వెంటనే పరిహారం చెల్లించాం.

## కోళ్ల రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎపి పౌల్ట్రీ ఫెడరేషన్

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు తొలగించి, కోళ్ల రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఆ సమాఖ్య ప్రతినిధులుఉండవల్లి నివాసంలో సీఎంను కలిసి పౌల్ట్రీ రంగ సమస్యలను వివరించారు. కోడి మాంసం, గుడ్లపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి ప్రభుత్వం సహకరించాలని చికెన్, ఎగ్ మేళాల ఏర్పాటుపై సర్కారు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. తూర్పుగోదావరి జిల్లాతో పాటు మరికొన్ని చోట్ల అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా పున ప్రారంభించాలని ఆ మేరకు కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుబ్బారావు ఉపాధ్యాక్షుడు టి.కుటుంబరావు, బాలాజీ హేచరీస్ డైరెక్టర్ పి.ప్రణీత్ చిత్తూరుకు చెందిని హేమాద్రి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్త


కొట్టినప్పుడు వినిపించే ధ్వనిని బట్టి, పాత్ర గట్టిదా, వట్టిదా అనే సంగతి తెలిసిపోయినట్లే, మనుష్యులు బుద్ధిమంతులా, మూర్ఖులా అనే విషయం వారి ఉపన్యాసం ద్వారా తెలిసిపోతుంది.

న-డెమోస్త నీస్

# మహమ్మారికి ముకుతాడు

రాచపుండుకు చావే అంతిమ పరిష్కారంగాఉన్న రోజుల్నుంచి, ఆధునిక యుగంలో ఎన్నో పరిశోధనలతో జీవన కాలాన్ని పెంచేందుకు వీలుగా కొన్ని ప్రాణాధార ఔషధాలు తయారు చేసే స్థాయికి మన ఔషధరంగం విజయాలు సాధించడం సంతోషదాయకమే. ఆనాటి రాజుల కాలంలో రాజుకు రాచపుండు ఏర్పడితే ఎన్ని ఆయుర్వేద గ్రంథాలు తరచి చూసినా చికిత్సలు లభించేవి కాదని చరిత్ర చెబుతోంది. ఎన్నో దీర్ఘకాలిక రుగ్మతలను నయంచేయగలుగుతుందని చెప్పుకునే రసవైద్య చింతామణిలో కూడా క్యాన్సర్‌కు ఎలాంటివైద్య పరిష్కారాలూ లభించలేదు. భారతదేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఆయేటికాయేడు పెరుగుతూనే ఉంది. జాతీయ వైద్య పరిశోధన మండలి 2020లో చేపట్టిన అంచనాల మేరకు 2020 నాటికి దేశంలో 13.9 లక్షల మంది క్యాన్సర్ రోగగ్రస్థులుండగా, 2025 నాటికి 15.7 లక్షలకు చేరుకుంటుందని అంచనా. తాజా అధ్యయనాలు చూస్తే 2022నాటికే దేశంలో 19 నుండి 20 మిలియన్ల మధ్య ఉంటుందని లెక్కలువేశారు. రోగతీవ్రత, ముందస్తు రోగనిర్ధారణ, నివారణ, నిరోధకత వంటి విషయాలను క్రోడీకరించుకుంటే క్యాన్సర్ మరణాల సంఖ్యలో తేడా లేకున్నా నిరోధకతకూ టీకాలు రావడం మంచి పరిణామం. క్యాన్సర్ రోగుల జీవితకాలాన్ని పెంచడానికి ఇప్పుడొస్తున్న అధునాతన ఔషధ పరిశోధనలు ఉపయోగపడ్తున్నాయనేది తేటతెల్లమే. క్యాన్సర్ మరణాల రేటు 2022లో 8.08లక్షలుగా నమోదైంది. 'క్యాన్సర్ నివారణకన్నా నిరోధమే మేలు' అనే భావనతో ప్రభుత్వాలు వాటికితగిన ఔషధాన్ని రోగికి అందించే ప్రయత్నంలో కృతకృత్యులైనారు. సాధారణంగా క్యాన్సర్ చికిత్సకు వికిరణ, కీమోథెరపి, సర్జరీ వంటి సాంకేతిక ప్రక్రియలను పాటిస్తున్నారు. శరీరంలో ఎలాంటి మార్పులున్నా వెంటనే గమనించి వివిధ చికిత్సా పద్ధతులలో వైద్యానికి వెళ్తే కాస్తంత ఊరట లభిస్తుంది. ఇదెంతో వ్యయంతో కూడిన పని. సామాన్య మానవుడికి ఇలాంటి వైద్యం అందుబాటులో ఉండదు. వైద్యం ఎంతో ఖరీదైనది. వారి ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించదు. అందుకే దీర్ఘకాలిక నయం కానిరుగ్మతగా పేరొందిన క్యాన్సర్‌కు ప్రాచీన కాలంలో 'రాచపుండు'గా చెప్పుకునేవారు. అయితే ఈ ప్రణాలను నియంత్రించలేకపోయినా సిద్ధవైద్యం మాత్రం మరికొంత ఆధునికత పొందిన వైద్యవిధాన ప్రక్రియలు క్యాన్సర్ రుగ్మతను నిరోధించగలమనే నమ్మకం ఈ మధ్య బాగా ప్రచారం పెరిగింది. దాంతో పునర్జన్మ వస్తుందని ఇప్పటికీ జనం నమ్ముతున్నారు. సిద్ధవైద్యంలో ఔషధ వృక్షాల రసాలు,కొన్నిఖనిజ తైలాలు వాడతారు. కనుక శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలో పేరుకుపోయిన విషాలను నియంత్రిస్తాయి. ఇవన్నీ జాగ్రత్తగా వాడాల్సి వస్తుంది. ప్రస్తుత పరిశోధనలు, కొవిడ్‌కు వాక్సిన్ విజయవంతంగా కనిపెట్టడంలో భారతదేశం ఫార్మా పరిశోధనల్లో బాగా ముందడుగు వేసింది. అప్పట్నించి ప్రధాని నరేంద్ర మోడీకూడా అన్నిరుగ్మతలకు మనమే స్వదేశీ వాక్సిన్ ఉత్పత్తి చేయాలని ఆ రంగాన్ని బాగా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే రష్యా దేశం క్యాన్సర్‌కు టీకా కనిపెట్టినట్లు ప్రకటించుకుంది.ఎంతో సంతోషకర విషయం. కాగా తాజాగా ఇప్పుడు భారత్ కూడా ఆరునెలలో క్యాన్సర్ టీకాను అందుబాటులోకి తెస్తున్నామని శుభవార్త చెప్పింది. ఈ టీకాపై పరిశోధనలు పూర్తయి, ట్రయల్స్‌లో ఉన్నామని త్వరలో విడుదల చేసే యోచనను బయటపెట్టారు. 30 యేళ్లు పైబడిన మహిళలకు ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ జరిపి వైద్య చికిత్సలు ఉచితంగానిర్వహిస్తున్నట్లు చెప్తూనే పదహారేళ్ల లోపు బాలికలకు టీకా తెస్తున్నామని చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి ఈవ్యాక్సిన్ అదుపులో ఉంచి దరిచేయనీయకుండా చేస్తుందని కేంద్ర,వైద్య ఆరోగ్యశాఖా సహాయమంత్రి ప్రతాపరావ్ జాదవ్ వెల్లడించారు. ఇప్పుడుమహిళలను బాధించే అన్నిరకాల క్యాన్సర్‌లకూ ఉపశమనం కనుచూపుమేరలోనే ఉంది. యేటా కోటిమంది మరణాలు క్యాన్సర్ మహమ్మారి వల్లనేనని అధికారిక లెక్కలు చెపుతున్నాయి. రష్యా వ్యాక్సిన్‌కు క్లినికల్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. క్యాన్సర్ రోగనిరోధానికి విడుదల చేయడమొక్కటే మిగిలిఉంది. వారివ్యాక్సిన్ పేరు ఎండాఆర్ఎన్ఏ. వ్యాక్సిన్‌లు ఏవైనా రోగకారక క్రిమిని మట్టుబెడతాయి. దాంతో రోగ నిరోధకశక్తిమీద దాడిచేసే కారకాలు మాయమైపోతాయి. శరీరంలో తయారైన యాంటీబాడీలు రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తాయి. అయితే కరోనా వ్యాప్తి సమయంలో సరికొత్త విధానంలో వ్యాక్సిన్ తయారు చేస్తున్నారు. ఇలాంటి వ్యాక్సిన్‌లన్నీ శరీరానికి రోగనిరోధకతను పెంచేవే. నిన్నమొన్నటి కోవిడ్ సమయాలో విజయవంతమైన వ్యాక్సిన్‌తో మానవాళిని కాపాడిన రష్యా,భారత్‌దేశాలు మాత్రమే. వారే ఇప్పుడూ క్యాన్సర్ రోగానికి వ్యాక్సిన్‌లు కొనుగొనడం అభినందించదగినది. రష్యా, భారత్‌లు వ్యాధి నిరోధక టీకాల కోసం పరిశోధనలు చేసి జనంలో ఊరట కలుగచేస్తున్నప్పటికీ ఇతరదేశాలు కూడా మరికొన్ని పరిశోధనలు చేస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌దేశాలు కూడా పరిశోధనలుచేస్తున్నాయి. కాగా కొన్ని దేశాలు మానవాళిని క్యాన్సర్ మహమ్మారి నుండి రక్షించడానికి నిష్కపటంగా పరిశోధనలు వేగవంతం చేస్తున్నాయి. రష్యాదేశం తాము అభివృద్ధి పరిచిన 'టీకా'ను ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందుబాటులోకి తెస్తామని వాణిజ్యపర ఆలోచన ఏదీ లేదని ప్రకటించింది. భారతదేశం ముందు మనవారికి, బయటి దేశాలకు ఆ తర్వాతే అన్న సూత్రాన్ని అవలంబిస్తున్నాయి. అదే జరిగితే క్యాన్సర్ మహమ్మారిని జయించినట్లే!

ఎంత సైంటిస్ట్ అయినా ఫార్ములాస్‌తో మాట్లాడలేడు కదా! ప్రధానంగా భాష సహాయంతోనే మాట్లాడాలి.



ఐన్‌స్టయిన్

డబ్బు సంపాదనలో విజయం సాధించినంత మాత్రాన జీవితంలో నిజమైన విజయం సాధించినట్టు కాదు.



బైరన్

# విద్యావ్యవస్థ నాణ్యతకు స్వతంత్రతే కీలకం

*నిజానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రకృతి విపత్తులు, జనాభా సేకరణకు మాత్రమే, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకింద తీసుకోవాలి. మిగతా ఏఅంశంలోనూ తీసుకోకుండా చట్టంఉన్నది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినటువంటి విలువైన సమయాన్ని వృధా చేయకూడదు అనే బలమైన కారణం చేత, ఆ చట్టం చేయబడినది. కానీ పాలకులు రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు, ఈ చట్టాన్ని ఏమాత్రం వారు పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థులకు నష్టంచేస్తున్నారు. విద్యారంగంలో బాగా ముందున్న దేశాలలో, విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచి, విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడగలుగుతున్నారు. అలాంటి పరిస్థితిని మన రాష్ట్రంలో ఉంచినట్లయితే, విద్యార్థులకు పరిపూర్ణమైన బోధన అంది, మంచి విషయ పరిజ్ఞానం గల పౌరులుగా తయారవుతారు. ఇలాంటి పరిస్థితి కల్పించవలసింది కేవలం పాలకులు, ఉన్నతస్థాయి అధికారులు మాత్రమే!*

తరిగోపుల నారాయణస్వామి

రాష్ట్రంలో ప్రాథమిక విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా టీచర్ల పనితీరును అంచనా వేయాలని ఆదేశించింది. దీనికి వీలుగా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ)ని సంప్రదించి, 6నెలల్లో సూచికలు రూపొందించాలని పేర్కొంది. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం కనీస స్థాయిలో లేకపోవడానికి టీచర్లను బాధ్యులను చేయడంవల్ల, దీర్ఘకాలంలో విద్యాప్రమాణాలు పెరుగుతాయని అభిప్రాయపడింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధన 25(2)(డీ) ప్రకారం, జవాబుదారీతనం, పనితీరులపై సూచికలు తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. అలాగే, 25(2) (ఈ) ప్రకారం, ఉపాధ్యాయులు, అధికారుల వ్యవస్థ పనితీరును, నిర్దిష్ట కాలంలో మదింపు చేయాలని తెలిపింది. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పుఇచ్చింది. విద్యార్థుల అధ్యయన, అభ్యసన సామర్థ్యాన్ని విద్యాహక్కు చట్టం, ఎన్‌సిఆర్‌టి, నిబంధనలమేరకు నిర్వహించిన బేస్లైన్, టీఏఆర్ఎల్(టీచింగ్ ఎట్ రైట్ లెవల్ టెస్ట్) ఫలితాలను గత ప్రభుత్వం బహిర్గతం చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ,డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఇంద్రనీలాబాబు వాదనలు వినిపించారు. విద్యార్థులు చదివే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని, ఐదవ తరగతి విద్యార్థి రెండోతరగతి పాఠ్యాంశాన్ని కూడా చదవలేకపోతున్నాడని తెలిపారు. బేస్‌లైన్, టీఏఆర్ఎల్ టెస్ట వివరాలను తల్లిదండ్రులకు అందజేయడం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఇలా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం మంచిదే,కానీ న్యాయస్థానం కావచ్చు లేదావాజ్యం దాఖలు చేసిన వ్యక్తి కావచ్చు. క్షేత్రస్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రకారం, ప్రభుత్వాలు సదుపాయాలు కల్పిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. ఉపాధ్యాయుల నియామకాలు కావచ్చు. ఇతర సౌకర్యాలున్నాయా అనేవిషయం కూడా పరిశీలనలోకి తీసుకోవలసిన అవసరం ఉన్నది. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు దాదాపు 12 వేలకు పైబడి ఉన్నాయి. అంటే ఈ పాఠశాలలో ఉన్న ఒకే ఒక ఉపాధ్యాయుడు, ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు బోధన చేయవలసి ఉంటుంది. అనగా ఈ ఉపాధ్యాయుడు విద్యార్థులు ఎందరు అనే విషయం కాకుండా, ఒకటి నుంచి ఐదోతరగతి వరకు అన్నిబోధనాంశాలు అనగా, 18సబ్జెక్టులు ప్రతిరోజుచెబుతూ, మరలా 18వర్క్ బుక్కులు విద్యార్థులతో రాయించి, వాటిని ఏకాగ్రతతో పరిశీలించి, దోషనివారణ చేయించాలి. అనగా ఏకోపాధ్యాయపాఠశాలలో ఉన్న ఒక ఉపాధ్యాయుడు, ప్రతి రోజు 36సబ్జెక్టులకు సంబంధించిన విషయాన్ని పరిశీలించి, బోధించి దోషనివారణచేయించాలి. వీటితోపాటు అదనంగా, బోధనేతర కార్యక్రమాలు కూడా చూడాలి. మరి అలాంటి పాఠశాలల్లో ఫలితాలు ఎలా ఆశిస్తాం? విద్యాహక్కు చట్టం



ఈ విధంగా చెబుతున్నదా? మనం ఆలోచించాలి! అలాగే దాదాపు రాష్ట్రంలో ఉన్న 90శాతం ప్రాథమిక పాఠశాలల్లో, ఇద్దరూ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇలాంటి పాఠశాలల్లో కూడా, ఒక్కొక్క ఉపాధ్యాయునికి టెస్ట్ బుక్స్ వర్క్‌బుక్స్‌ను పరిగణలోనికి తీసుకుంటే, 18పుస్తకాలు బోధించి, రాయించి,దోష నివారణ చేయాలి. వీటితోపాటు బోధనేతర కార్యక్రమాలు అదనం. వాస్తవాన్ని పరిగణలోనికి తీసుకుంటే ఇది సాధ్యమా? అని ఆలోచించాలి. మరి సౌకర్యాల విషయాలకు వస్తే, విద్యా హక్కుచట్టం ప్రకారం,ప్రతి తరగతికి ఒక తరగతి గది ఉండాలి. ప్రధానోపాధ్యాయుని కార్యాలయం కూడా ఉండాలి. దాదాపు 90శాతం ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక గది,లేదా రెండుగదులు మాత్రమే ఉన్నాయి. క్రీడా స్థలాల విషయం మరింత విస్మయం కలిగిస్తుంది. కేవలం 10శాతం పాఠశాలలకు మాత్రమే, కనీస స్థాయిలో క్రీడా మైదానాలు ఉన్నాయి. మిగిలిన 90శాతం ప్రాథమిక పాఠశాలలో క్రీడా మైదానాలు లేవు. తాగునీటి సమస్య కూడా ఇంచుమించు ఇదేవిధంగా ఉన్నది. ఇక బోధన విషయాలకు వస్తే, ఉపాధ్యాయులకు బోధన సమయంలో, బోధన చేయించకుండా ఇతర బోధనేతర కార్యక్రమాలు ఇవ్వడం మూలంగా అధికారులే విద్యార్థులకు బోధన అందకుండాచేస్తున్నారు.విలువైన బోధనా సమయంలో, రకరకాల శిక్షణల పేరుతో విద్యార్థులకు బోధన అందకుండా చేస్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు, అత్యవసర ఆదేశాలంటూ, రకరకాల భోదనేతర పనుల అప్పగిస్తూ, పరోక్షంగా అధికారులే, విద్యార్థులకు బోధన అందకుండా చేస్తున్నారు. మరి ఇలాంటి అసౌకర్యాలకు, ఉపాధ్యాయులని బాధ్యత చేయడం సమంజసం కాదు. పాలకులే విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడవలసి ఉంటుంది. వాజ్యం దాఖలుచేసిన వ్యక్తి కావచ్చు, లేదా గౌరవ న్యాయస్థానాలు కావచ్చు, క్షేత్ర స్థాయి వాస్తవాన్ని మదింపు చేసుకోవాలి. ఇలాంటి విద్యార్థులకు నష్టంజరిగే అంశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలగాలి. అలాగే పాలకులు మారినప్పుడల్లా, రకరకాల ప్రయోగాలు విద్యావ్యవస్థలో చేస్తున్నారు. ఏదైనా ఒక విధానాన్ని ఎంచుకున్నప్పుడు ఆ విధానం వలన ఫలితాలు రావడానికి, కొన్నిసంవత్సరాల సమయం పడుతుంది. అంత సమయం ఇవ్వకుండా, ప్రతి సంవత్సరం విద్యా వ్యవస్థలో, బోధనకు సంబంధించి రకరకాల పద్ధతులు ప్రవేశపెడుతున్నారు. ఇది విద్యార్థికి ఉపాధ్యాయులకు అనిస్థితిని కలిగిస్తుంది.పాలకుల విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచకుండా, ప్రతి కార్యక్రమంలోనూ భాగస్వామ్యం చేయడంవలన,బోధనకు ఆటంకం కలుగుతున్నది.ఇలా ఆటంకం కలగడంవలన, ఉపాధ్యాయుడు ప్రతిభావంతంగా పాఠ్యాంశాలనుసకాలంలో పూర్తి చేయుటకు, ఉపాధ్యాయునికి కష్టతరంగా ఉంటుంది. ఉపాధ్యాయునికి కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేసి,బోధనా అంశములకు మాత్రమే బాధ్యత వహించేటట్లు చేయడం సమసితం. నిజానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రకృతివిపత్తులు, జనాభా సేకరణకు మాత్రమే, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకింద తీసుకోవాలి.మిగతా ఏఅంశంలోనూ తీసుకోకుండా చట్టంఉన్నది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినటువంటి విలువైన సమయాన్నివృధా చేయకూడదు అనే బలమైన కారణం చేత, ఆ చట్టం చేయబడినది. కానీ పాలకులు రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు, ఈ చట్టాన్ని ఏ మాత్రం వారు పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థులకు నష్టంచేస్తున్నారు. విద్యారంగంలో బాగా ముందున్న దేశాలలో, విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచి, విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడగలుగుతున్నారు. అలాంటి పరిస్థితిని మన రాష్ట్రంలో ఉంచినట్లయితే, విద్యార్థులకు పరిపూర్ణమైన బోధన అంది, మంచి విషయ పరిజ్ఞానం గల పౌరులుగా తయారవుతారు. ఇలాంటి పరిస్థితి కల్పించవలసింది కేవలం పాలకులు, ఉన్నత స్థాయి అధికారులు మాత్రమే! ●

# మానవ శాస్త్ర పరిశోధకులు పెరగాలి!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

ఇటీవల ప్రాధాన్యతను సంతరించుకున్న మానవ శాస్త్రం (ఆంత్రపాలజీ) ముఖ్యంగా హ్యూమానిటీ లేదా మానవత్వం గురించి చర్చించే శాస్త్రంగా గుర్తించబడింది. మానవ శాస్త్రం పరిధిలో మానవ ప్రవర్తన, మానవ జీవశాస్త్రం, సంస్కృతి, మానవ సమాజం, భాషాశాస్త్రం లాంటి ప్రధాన అంశాలు వస్తాయి. మానవ జాతిని లోతుగా అర్థం చేసుకోవడం, ఆ పరిజ్ఞానాన్ని విశ్లేషించుకోవడం, మానవశాస్త్ర విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉంచటం, పరిశోధనలు కొనసాగించడం, వివిధ మానవ జాతుల సంస్కృతులను అవగాహన పరచడం జరుగుతున్నది. మానవశాస్త్రం పట్ల సామాన్య ప్రజల్లో అవగాహన తక్కువగా ఉన్నందున, దానిని బహుళ ప్రచారంలోకి తీసుకురావడానికి 2015లో అమెరికన్ ఆంత్రపాలోజికల్ సొసైటీ చొరవతో ప్రతి ఫిబ్రవరి మాసం 3వ గురువారం రోజున, అనగా 20 ఫిబ్రవరి 2025న ప్రపంచ మానవ శాస్త్ర దినోత్సవం" లేదా వరల్డ్ ఆంత్రపాలజీ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ మానవ శాస్త్ర దినం2025 ఇతివృత్తంగా భవిష్యత్తు మన ముందుంది. అది సమానంగా పంపిణీ జరగలేదు" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. ఈ వేదికగా



మానవత్వం, మానవ జాతి, సంస్కృతి, మానవ సమాజం లాంటి అంశాల్లో అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇటీవలే పుంజుకున్న మానవ శాస్త్రం లోతులను చూసే ప్రయత్నాలు చేస్తున్న మానవ శాస్త్రవేత్తల అభిప్రాయాలను శ్రద్ధగా వినడం, మానవ జీవితాల వైవిధ్యాలను అర్థం చేసుకోవటం, ఈ రంగంలో ఎదురవుతున్న ప్రపంచ సవాళ్లను అధిగమించే ప్రయత్నాలు చేయడం కొనసాగు తోంది. సమాజ ప్రతికూల తలను ఎదిరించి మానవ శాస్త్రం పట్ల లోతైన పరిశోధనలు చేసి పలు ఆసక్తికర మానవ శాస్త్ర అంశాలను బయట పెట్టిన ఫ్రాంజ్ బోయిస్‌ను మానవ శాస్త్ర పితామహుడు"గా పిలవడం జరుగుతున్నది. మానవ పరిణామం,నిర్మాణం,విధులు, సంస్కృతులు, సాపేక్షత అనే ఐదు భావనల మీద ఆధారపడిన మానవ శాస్త్రం పటిల అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడిన ప్రపంచ మానవ శాస్త్ర దినం" రోజున విద్యాలయాలు, మ్యూజియమ్‌ల సందర్శన, యూనివర్సిటీల్లో సదస్సులు, చర్చలు, కార్యశాలలు లాంటివి నిర్వహిస్తూ మానవ శాస్త్ర కనీస పరిజ్ఞానాన్ని కల్పించవచ్చని తెలుసుకోవాలి. మానవ శాస్త్రం లోతులను మనకు పరిచయం చేస్తున్న పరిశోధకు లను ప్రోత్సహించడం, సన్మానించడం ఈ వేదికగా నిర్వహించవచ్చు. ఈ రోజున అవగాహన కల్పించడానికి ఆంత్రోడే, ఆంత్రపాలజీడే లాంటి హాష్ట్యాగులతో సోషల్ మీడియాలో ప్రచారం చెయవచ్చు. ●

# రూపాయి క్షీణతను నియంత్రించగలమా?

డాక్టర్. పి.ఎస్.చారి

గతకొన్నినెలలుగా రూపాయి విలువ హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ఫిబ్రవరి10, 2025న డాలర్‌తో పోలిస్తే రూపాయి 87.43కనిష్ట స్థాయికి చేరుకుంది. ఇలా ఎందుకు జరుగుతోంది? రూపాయి విలువ రెండురకాలుగా పడిపోతుంది.ఒకటి రూపాయి విలువ తగ్గించడం. ఇది ఇతర కరెన్సీలకు వ్యతిరేకంగా రూపాయి అధికారిక మారకపు రేటులో ఉద్దేశపూర్వకంగా తగ్గుదల. ఇది 1949, 1966, 1991 సంవత్సరాలలో మూడు సందర్భాలలో జరిగింది. మరొకటి అంతర్జాతీయ వ్యాపారంలో హెచ్చుతగ్గుల కారణంగా డాలర్‌తో రూపాయి విలువ క్షీణించడం. ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గుదల. ఇది రూపాయిక్షీణతను ఇది సూచిస్తుంది. భారత రూపాయి విలువ ఇప్పుడు ఎందుకుపడిపోతోంది? రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ పాలస్తీనాయుద్ధం, పెరుగుతున్న ముడిచమురు ధరలు, ఈక్విటీల అమ్మకం, డాలర్ ప్రవాహం. ద్రవ్యవిధానాన్ని కఠినతరం చేయడానికి ఆర్‌బిఐ చర్యలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను కఠినతరం చేయడం వంటి ప్రపంచ కారకాలు దీనికి ప్రధానకారణాలు. చరిత్రలో కొన్నేళ్లుగా డాలర్‌తో రూపాయి మారకంవిలువ హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉంది. 1947లో రూపాయిడాలర్ రేటు రూ.3.30,1966లోరూ.7.50,1995 నాటికి రూ.32.4. 2022లో డాలర్‌కు రూ.82.14 గాఉంది. పాకిస్థాన్, చైనాలతో యుద్ధాలు, విదేశీ రుణాలు అవసరమయ్యే పంచవర్ష ప్రణాళికలు, రాజకీయ అస్థిరత, చమురు ధరలు వంటి అనేక కారణాలవల్ల రూపాయి విలువ పడిపోయింది. అమెరికా చైనామధ్య కొనసాగుతున్న వాణిజ్యయుద్ధం, ఇరాన్ పైన ఆంక్షలు, చమురు ధరల్లో మరింత అస్థిరత రూపాయి విలువను పరీక్షిస్తూనే ఉన్నాయి.రూపాయి క్షీణతప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే, భారతీయ రిజర్వు బ్యాంక్‌కు ఇది రెండువైపులా కత్తిలాంటిది. అనుకూలతవైపు, బలహీనమైన రూపాయి సిద్ధాంతపరంగా భారతదేశ ఎగుమతులను పెంచడం, భారతదేశానికి ప్రయాణాన్ని చౌకగా చేయడం వంటి కొన్ని సానుకూల అంశాలను కలిగి ఉంది. స్థానిక పరిశ్రమ ప్రయోజనం పొందవచ్చు.విదేశాలలో పనిచేసే వ్యక్తులుతమ స్వదేశానికి తిరిగి డబ్బుపంపడం ద్వారా మరింత సంపాదించవచ్చు. ఇది మరింత ఎగుమతి చేయడం ద్వారా కరెంట్ ఖాతాలోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రతికూలతలో, ద్రవ్యోల్బణం ప్రమాదం కూడాఉంది. ఎక్కువ కాలం వడ్డీరేట్లను రికార్డుస్థాయిలో ఉంచడం సెంట్రల్ బ్యాంక్‌కు కష్టతరం చేస్తుంది. ఎందుకంటే భారతదేశం తన దేశీయ చమురు అవసరాలలో మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. బలహీన కరెన్సీ దిగుమతి చేసుకున్న తినదగిన నూనె(ఎడిబుల్ ఆయిల్)ధరలను మరింత పెంచుతుంది. ఇది అధిక ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.రూపాయి కొనుగోలు శక్తిపడిపోవడం, అధిక చెల్లింపుల కారణంగా దేశం కరెంట్ ఖాతా లోటు పెరుగుతుంది. విదేశీ ప్రయాణం,విదేశీ విద్య ఖరీదైపోతుంది.విదేశీరుణం తదితరాలపై వడ్డీభారం పెరుగుతుంది. భారత ఆర్థికవ్యవస్థపై ప్రభావం 2024లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు3శాతం పతనం తర్వాత దేశీయ యూనిట్‌లో తీవ్ర తగ్గుదల వచ్చింది, ఇది ఆసియా కరెన్సీలలో కనిష్టస్థాయి పతనంగా నిలిచింది. జనవరి 1, 2024న, గ్రీన్ బ్యాక్‌తో పోలిస్తే రూపాయి 83.21 వద్ద ఉంది. నోమురా సంస్థ 2025 మధ్యలో డాలర్ తోపోలిస్తే రూ. 87కి పడిపోతుందని అంచనావేసింది.



విశ్లేషణాత్మక అంచనాల ప్రకారం,2025 చివరి నాటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.1037కి, 2029 చివరినాటికి 101.5491గా ఉంటుందని అంచనా. వాణిజ్య లోటు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెనక్కి తగ్గడం, యుఎస్ డాలర్‌ఇండెక్స్ బలపడటం వంటి కారణాల వల్ల సమీపకాలంలో రూపాయి డాలర్ మారకపు విలువ అస్థిరంగా ఉంటుందని కూడా అంచనా. యుఎస్ప్రెడేటు పెంపు భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్యడాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రూపాయి బలహీనపడవచ్చని యుఎస్‌సెంట్రల్‌బ్యాంకు అంచనావేసింది. సాధారణంగా, నికర ఎగుమతిదారులు తమ డాలర్లకు ఎక్కువ రూపాయలను అందుకుంటారు. కాబట్టి నికర దిగుమతిదారులు దిగుమతుల కోసం డాలర్లను కొనుగోలు చేయడానికి ఎక్కువ చెల్లించాలి. పెద్ద మొత్తంలో విదేశీ అప్పులున్న వారు కూడా వడ్డీఖర్చులను రూపాయిలోచూస్తారు. తరుగుదల ఆర్థిక వ్యవస్థలో ఇలా కొన్ని పరిణామాలకు దారితీస్తుంది. భారత దేశం 2024 ఆర్థిక సంవత్సరంలో సుమారు 723బిలియన్ భారతీయ రూపాయల విలువైన మందులు, ఔషధాలను యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసింది. ఈ రంగం ఎగుమతులలో అత్యధిక విలువను సాధించింది. నికర ఎగుమతి దారుగా ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమ బలహీనమైన రూపాయి నుండి ప్రయోజనం పొందుతుంది. అయితే రాబోయే ఆర్డర్‌లలో వినియోగదారులు సవరించిన రేట్లను డిమాండ్ చేయడం వల్ల లాభాలు స్వల్పకాలికంగా ఉండవచ్చని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. రత్నాలు, ఆభరణాల రంగం విషయానికొస్తే, రూపాయివిలువ క్షీణించడం దాని యూనిట్లకు ఖర్చు ప్రయోజనాన్ని ఇస్తోంది. సమాచారం సాంకేతికత సేవలు పరిశ్రమ యునైటెడ్ స్టేట్స్‌రాబడులకు 50 శాతం కంటే ఎక్కువ దోహదపడుతుంది. ఇదికాకుండా క్షీణిస్తున్న రూపాయి అతిపెద్ద లబ్ధిదారులలో ఒకటిగా ఉంటుంది. గార్మెంట్ రంగం లాభాల్లో ప్రతి 1శాతం పతనానికి, లాభాలు 0.25 0.5శాతం పెరుగుతాయి. భారతదేశ తేయాకు ఎగుమతులు 510శాతం పెరుగుతాయని అంచనా. పెట్రోలియం ఉత్పత్తులు, సేంద్రీయ రసాయనాలు, ఆటోమొబైల్స్ యంత్రాలు భారతదేశం ప్రధాన ఎగుమతి వస్తువులైతే, ప్రపంచంలో భారతీయ తేయాకు పోటీతత్వాన్ని పెంచడం మరింత ఎగుమతులను ప్రోత్సహిస్తుంది. అధిక దిగుమతులు, సరఫరా కొరత కారణంగా పెరుగుతున్న వస్తువులధరలతో, ఎగుమతిదారులకు ఉత్పత్తివ్యయం పెరుగుతుంది, ఇదివారిలాభాలను ప్రభావితం చేస్తుంది. డొనాల్డ్‌ట్రంప్‌హయాంలోబలహీనమైన ఆదాయాలు,డాలర్‌ను బలోపేతంచేయడం, టారిఫ్‌విధానాల గురించి ఆందోళనల కారణంగా విదేశీ పెట్టుబడిదారులు జనవరి 10వరకు భారతీయఈక్విటీల నుండి రూ.22,194 కోట్లను ఉపసంహరించుకున్నారు. యునైటెడ్ స్టేట్స్ డాలర్స్‌కి వ్యతిరేకంగా భారత రూపాయి క్షీణత కారణంగా,భారతదేశం ముడిచమురు దిగుమతిబిల్లు ఎనిమిది నుండి తొమ్మిదిశాతం పెరుగుతుందని పెట్టుబడిసమాచారం క్రెడిట్‌రేటింగ్ ఏజెన్సీ నివేదికతెలిపింది. ఫారెక్స్మార్కెట్‌లో ఆర్‌బిఐ భారీ జోక్యాన్ని ప్రతిబింబిస్తూ, ఫిబ్రవరి1,2025 నాటికి దేశ విదేశీ మారక నిల్వలు51.52బిలియన్ డాలర్లు తగ్గి 630.607 బిలియన్ డాలర్లు పడిపోయాయి.తగ్గిన మూలధన ప్రవాహం, విస్తృతమైన వాణిజ్య లోటు,భారతదేశంలో ఆర్థికవృద్ధి మందగించడం వల్ల రూపాయి క్షీణత మరింత తీవ్రమవుతుంది. డాలర్‌తో ఇతర కరెన్సీలు అమెరికా డాలర్‌తోపోలిస్తే అనేక కరెన్సీలు హెచ్చుతగ్గులకులోనవుతున్నాయి. తత్ఫలితంగా, భారత దేశంతో సహా వివిధ అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల నుండి విదేశీ మూలధన ప్రవాహం వారి దేశీయ కరెన్సీలపై ఒత్తిడితెచ్చింది. యూరో, బ్రిటిష్‌పౌండ్, జపనీస్ ఇతర ప్రధాన ప్రపంచ కరెన్సీల కంటే యుఎస్డాలర్‌తో రూపాయి క్షీణత తక్కువగా ఉంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూపాయి బలపడు తున్న యుఎస్డాలర్‌తో మాత్రమే క్షీ ణించిందని, ఇతర బల మైన స్థూల అంశాలతో పోలిస్తే స్థిరంగా ఉందని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం, ప్రపంచంలోని కరెన్సీ నిల్వలలో 61శాతం కంటే ఎక్కువ డాలర్లలో ఉన్నాయి. ●

# ప్రజావాక్కు



## సఫలమా? విఫలమా?

భారత ప్రధాని నరేంద్రమోడీ ఫ్రాన్స్‌దేశానికి వెళ్ళి కృత్రిమ మేథ మానవాళికి కలిగే ప్రయోజనాలను సవివరంగా తెలియజేసారు.కానిదీనివల్ల మెదడు పనితీరు మీద ఎంత ప్రభావముంటుందో మాత్రంతెలియజేయలేదు. అమెరికా యాత్రలో ట్రంప్‌తో కరచాలనాలు,కౌగిలింతలు చేసుకుని ఒకరి నొకరు అమితంగా పొగుడుకుని తమ ఆత్మీయతను ప్రపంచానికి చాటి చెప్పారు. కాని అక్కడ నివసిస్తున్న భారత వలసదారులకు సంకెళ్ల వేసి మన దేశానికి పంపిస్తుంటే ఇదేమి క్రూరచర్యఅని ఒక్కమరక వేయలేకపోయారు.మనకు ఎఫ్35 యుద్ధ విమానాలెందుకు? మనకు ఆయుధ సంపత్తి లేకనా, చాలకనా? ప్రస్తుతం మన మీద యుద్ధ భయాలేవి లేవుగా. ఇంతకూ మోడీ అమెరికా పర్యటనసఫలమా? విఫలమా?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పారిశుధ్యం,మంచినీటి సరఫరా అధ్వాన్నం!

జీబీఎస్ వ్యాప్తిని కట్టడి చేయమని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు ఈ సిండ్రోమ్ కలుషిత నీరు, ఆహారంవల్లే అని వైద్యపరీక్షల్లో గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి మన రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణ,రక్షిత మంచినీటి సరఫరా అధ్వాన్నంగా ఉన్నాయి. గత సంవత్సరం విజయనగరం జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలినప్పుడు కూడా ఉపముఖ్యమంత్రి ఇకపై తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. విజయవాడ వంటి నగరాల్లో కూడా పారిశుధ్యం అధ్వాన్నంగాఉంది. ముఖ్యమంత్రి పరిస్థితి తీవ్రతగుర్తించి పారిశుద్ధ్య నిర్వహణ,మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలి.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

## ఉద్యోగం కంటే వ్యాపారమే మిన్న

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పూర్ణిమ అనే యువతి యం.ఫార్మసీ పానీ పూరీ వాలా పేరుతో పానీ పూరి వ్యాపారాన్ని మొదలుపెట్టి మంచిఆదాయాన్ని సంపాదిస్తోంది. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా టీ షాప్,టిఫిన్ సెంటర్, కూరగాయల దుకాణంవంటి వ్యాపారాలు చేస్తూ చక్కటి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## ఆకస్మిక తనిఖీలు దినచర్య కావాలి!

ఎట్టకేలకు రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంసెట్టి సుభాష్ ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ముదావహం. ఆయన తనిఖీలో హాజరు పట్టీలో సంతకాలు పెట్టి వెళ్లిపోయిన సిబ్బంది వైనం వెలుగు చూడటం ఎటువంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, అన్ని స్థాయిల్లో ఈ బాగోతాలు నిత్యకృత్యం! పలువురు ఐఎఎస్ అధికారులు హైదరాబాద్‌లో నివాసంఉంటూ వారంలో మూడు రోజులు మాత్రమే పని చేస్తున్నారు! చాలా పురపాలక సంఘాల్లో వేరే వారినిపురమాయించి సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు నిత్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరంఉంది. చాలామంది ఉద్యోగుల్లో ప్రభుత్వమన్నా, ప్రజలన్నా జవాబుదారీ తనం లేకుండా పోయింది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

## విగ్రహాన్ని నెలకొల్పాలి

అమరజీవి పొట్టి శ్రీరాములు నిష్కళంక దేశభక్తుడు. అంటరానితనం నిర్మూలనకు అనేక నిరాహారదీక్షలు చేసి నిమ్న వర్గాలకుదేవాలయ ప్రవేశంకల్పించారు.ఆయన తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని విశేష కృషి చేశారు. ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరుడయ్యారు. ఆయన బలిదానం వల్లనే ఆంధ్రరాష్ట్రంఏర్పడింది.దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. విజయవాడలో కనకదుర్గమ్మవారధి నిర్మాణ, సుందరీకరణలలో భాగంగా పొట్టిశ్రీరాములు గారి నిలువెత్తు విగ్రహాన్ని తొలగించారు. ఈ విగ్రహాన్ని 1994లో నాటి ప్రధాని పి.వి. నరసింహారావు ఆవిష్కరించారు. వారధి నిర్మాణ, సుందరీకరణ పూర్తయినా విగ్రహాన్ని ఇంకా నెలకొల్పలేదు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## బేటి బచావో, బేటి పడావో

భేటి బచావో భేటి పడావో కార్యక్రమం మొదలు పెట్టి దశాబ్దం అయిందని తెలిసి ఈ లేఖ రాయాలి అనిపించింది. ఎక్కడ అయితే మొదలు పెట్టారో అక్కడ మునుపటి స్థితి ఉన్నది. అయితే ఆడ పిల్లల సంఖ్య తగ్గడానికి సహజ కారణాల కంటే మానవ మూఢ విశ్వాసాలు ఎక్కువగా ఉడడం కలిచి వేసే అంశం. హర్యానాలో మొదలు పెట్టిన ఈ కార్యక్రమంలో గత దశాబ్ద కాలంలో హర్యానా లో మార్పేమి లేదు అవుతే తెలంగాణ లాంటి రాష్ట్రాలు బేటి కిట్‌తో పాటు ఆడపిల్లలకు 13 వేల రూపాయలు ఇచ్చి తన వంతు ప్రోత్సాహం అందించింది.

-భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తాగునీటి రిజర్వాయర్లను శుభ్రం చేయాలి

## -నగర కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 19 ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ త్రాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి ఆదేశించారు. వెహికల్ షెడ్ ని పరిశీలించి, ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో పారిశుధ్య పనులకు పంపే వాహనాలు తప్పనిసరిగా నిర్దేశిత సమయానికి వెళ్లాలన్నారు. ఈఆటోలు, పుష్ కాట్స్, ఇతర వాహనాలు



శ్రీనివాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. బుధవారం కమీషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా రెడ్డిపాలెం రిజర్వాయర్, వెహికిల్ షెడ్, సంజీవయ్య నగర్ రోడ్ విస్తరణ పనులు, నవభారత్ నగర్, జెకెసి నగర్ ల్లోని పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, త్రాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, త్రాగునీటి శుద్ధి జరిగే హెడ్ వాటర్ వర్క్స్ లో ప్రత్యేకంగా ల్యాబ్ లో క్లోరిన్, నాణ్యత పరిశీలించిన అనంతరమే రిజర్వాయర్లకు సరఫరా జరుగుతుందన్నారు. స్థానికంగా ఉండే రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు తప్పనిసరిగా శుభ్రం చేయించాలని, శుభ్రం చేసిన తేదీ, వివరాలను రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన బోర్డ్ పై కనిపించేలా వ్రాయాలన్నారు. అలాగే ప్రతి ఏఈ పరిధిలో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పైప్ లైన్ లీకుల మరమత్తులను వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడా త్రాగునీటి సరఫరా అందలేదనే ఫిర్యాదు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు మరమత్తులు చేయించాలని ఏఈని ఆదేశించారు. సంజీవయ్య నగర్ గేటు నుండి రెడ్డిపాలెం రోడ్ వరకు చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పనులు వేగంగా జరగాన్నారు. జెకెసి నగర్, నవభారత్ నగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు జరిగే సమయంలోనే నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లుల చెల్లింపు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో డిఈఈలు రమేష్ బాబు, కళ్యాణరావు, సతీష్ కుమార్, ఏసిపి రెహ్మాన్, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఏఈలు, టిపిఎస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# త్రికోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం

**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్ప కొండకు మహాశివరాత్రి పర్వదినం రోజున శ్రీ త్రికోటేశ్వరస్వామిని ముఖ్యమంత్రి నారా



చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలను సమర్పిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండవ సారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నరసరావుపేటకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర పండుగ హోదా కలిగిన మహాశివరాత్రి పర్వదిన జాతర వైభవంగా జరుగుతుందన్నారు. తెలుగు రాష్ట్రాలలో అత్యంత పెద్ద పండుగగా కొండ జాతర ప్రతి ఏడాది 20 లక్షల మంది భక్తులతో జరుగుతుందన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా రావడం సంతోషకరమైన విషయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

**ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ :** పల్నాడు రోడ్డులోని పాత పల్నాడు బస్టాండ్‌లో శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరివింద బాబు ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణ లోని పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. రైతు బజారు ప్రాంగణం మొత్తం శుభ్రం చేయడం జరిగిందన్నారు. కోటప్పకొండకు వచ్చే తిరునాళ్ళ బస్సులను పార్కింగ్‌కు ఈ స్థలాన్ని ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ రామ్‌ప్రసాద్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**మంగళగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఏపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుదవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. గుంటూరు కు చెందిన అగర్వాల కంటి ఆస్పత్రి వైద్యులు తమ బృందంతో విచ్చేసి వైద్యశిబిరాన్ని నిర్వహించరు. రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ .ప్రేమ్‌కుమార్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శ్రావణీ తన సిబ్బందితో కలసి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉదయం 7నుంచి సాయంత్రం వరకు 419మంది ఉద్యోగులు



,విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ ఇప్పటివరకు పలువిద్యాసంస్థల్లో సుమారు 30కి పైగా ఉచిత కంటి వైద్యశిబిరాలను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డైరెక్టర్లు అనిల్ నిగమ్, అనూప్‌సింగ్ సూర్యవంశీ, రేవతీ బాలక్రిష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిర్మాణ పనులకు వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ

## - నగర కమిషనరు పులి శ్రీనివాసులు



**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 19 ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిర్మాణ పనులకు వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసినపట్టికీ, అంతర్గతంగా పనులు జరుగుతుండం, కేటాయించిన విధుల్లో పర్యవేక్షణ లోపంపై స్థానిక వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి, టిపిబిఓలను విధులను సస్పెండ్, టిపిఎస్, ఏసిపి, డిసిపి, సిటి ప్లానర్లలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్ లో నిర్మాణంలో ఉన్న గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిబందనల మేరకు నిర్మాణాలు చేపట్టకపోవడంపై జిఎంసి వర్క్స్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసి, స్థానిక పట్టణ ప్రణాళిక అధికారులను పనులు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం పనులు అంతర్గతంగా జరుగుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు జిఎంసి అదనపు కమిషనర్ నేతృత్వంలో కమిటి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిటి ప్రాథమిక నివేదిక, మంగళవారం తమ క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు అందిన అనంతరం కూడా పనులు జరిగాయని నిర్ధారించడం జరిగిందని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంపై స్థానిక వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి సిహెచ్.జగన్ మెహన్ రావు, టిపిబిఒ కె.నిఖిల్ వంశీలను విధుల నుండి సస్పెండ్ చేస్తూ, పర్యవేక్షణ అధికారులైన టిపిఎస్ సత్యనారాయణ, ఏసిపి రెహ్మాన్, డిసిపి సూరజ్ కుమార్, సిపి రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసులు అందిన తర్వాత కూడా పనులు చేపట్టిన భవన యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# పట్టభద్రుల మద్దతు ఆలపాటికే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కేపట్టభద్రుల మద్దతు ఉందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం స్థానిక 35వ డివిజన్ కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్యా సూ క్ల్లో గళ్ళా మాధవి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమల్లో ఉన్న ప్రవైటు స్కూళ్ళ ఉపాధ్యాయులు మొదటి ప్రాదాన్యత ఓటును ఆలపాటి కే వేసి గెలిపించాలని కోరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆలపాటి ఖచ్చితంగా పట్టభద్రుల తరపున గొంతుకై గట్టిగా వినిపిస్తారని గతంలో గెలిచిన అభ్యర్థుల్లా రబ్బర్ స్టాంఫ్ మాదిరిగా ఉండరని ఎమ్మెల్యే ధీమా వ్యక్తంచేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీరందరూ వేసే ఓటు, ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మద్దతు అనే విషయం గుర్తుంచుకోవాలని, యువత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తారని మీరందరూ సమిష్టిగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఆలపాటి కోరారు. కార్యక్రమంలో ఈరంటి వరప్రసాద్, జెట్టిబాబు, కన్నా మాస్టారు, మేకల రవీంద్రబాబు, పెండ్యాల నర్సయ్య పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

# ఎన్నికల విధులపై అధికారులకు శిక్షణ

**గుంటూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్







ముగిసిన తర్వాత రిసెప్షన్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారులు తీసుకొచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు, మెటీరియల్ రిసెప్షన్ కేంద్రాల వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు స్ట్రాంగ్‌రూమ్‌లో సక్రమంగా భద్రపరచాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్ వద్ద రిసెప్షన్ కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలోరిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ముగిసిన తర్వాత ఏసి కళాశాలలో ్లని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచడానికి ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర పోలింగ్ మెటీరియల్, స్టాట్యూటరీ, నాన్‌స్టాట్యూటరీ కవర్లు, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను తీసుకోవడానికి, స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరచగానికి పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేకంగా టీమ్‌లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సమావేశంలో రిసెప్షన్ కేంద్రాలు వద్దపోలింగ్ సామాగ్రి తీసుకునే అధికారులు పరిశీలించాల్సిన ఫారాలు, వాటి వివరాలను మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డిటిసి సీతారామిరెడ్డి, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ రవికాంత్ ,రిసెప్షన్ కేంద్రాలు వద్ద విధులు కేటాయించిన డిప్యూటీ తహశీల్దార్లు ,ఎంపిడీవోలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# జిందాల్ ప్లాంటును సందర్శించిన ఐజీ

**యడ్లపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండవీడు రెవెన్యూ పరిధిలో ఉన్న జిందాల్ అర్బన్ వేస్ట్ ఎనర్జీ ప్లాంటును బుధవారం ఐజీ అరె రవికృష్ణ అధ్వర్యంలో



పోలీసు ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. ప్లాంటు కార్యనిర్వాహణ ప్రెసిడెంట్ ఎంవీ చారితో సమావేశమయ్యారు. ఇటీవల కృష్ణా జిల్లాలో పట్టుబడ్డ సుమారు 4టన్నుల అక్రమ గంజాయిని స్దానిక ప్లాంటులో ఈనెల 22న తగులబెట్టటానికి అనుమతి తీసుకున్నారు. సదరు కార్యక్రమానికి డీజీపీ హరిష్‌కుమార్ గుప్తాతో పాటు పోలీసు ఉన్నతాధికారులు వస్తున్నట్లు తెలిపారు. అందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని కోరారు. అనంతరం ప్లాంటులో అన్ని విభాగాలను తిరిగి పరిశీలించారు. వ్యర్దాల సేకరణ, వాటిని దగ్దం చేసి విద్యుత్తుఉత్పత్తి అవుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్, ఎస్పీ(ఈగిల్)కె నగేష్‌బాబు, గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, పెనమలూరు సీఐ వెంకట రమణ, చిలకలూరి పేట సీఐ సుబ్బనాయుడు, ఎస్సై బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అసువులు బాసిన ఆర్మీ జవాన్

## - ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ప్రాణాలు కోల్పోయిన జవాన్ పరిశా వెంకట్

**పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలంలోని గౌడపాలెం నకు చెందిన పరిశా శ్రీనివాసరావు శివపార్వతి ల పెద్ద కుమారుడు వెంకట్ రాజస్థాన్లో ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తూ దురదృష్టవశాస్తూ మృత్యువాత చెందారు. మంగళవారం నాడు ఉదయం 11 గంటలకు రాజస్థాన్ ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీస్ లో బుల్లెట్ బ్యాక్ ఫైర్ అవడం చేత, అకాల మృత్యువాత చెందారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. సూరత్ ఘర్ హాస్పిటల్ నుంచి బుధవారం నాడు జవాన్ పార్థివ దేహం గుంటూరు బిఆర్వో దగ్గరకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటుందని, అక్కడి నుండి తన స్వంతగ్రామానికి బుధవారం నాడు సాయంత్రం నకు చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిశా వెంకట్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబసభ్యులకు పిట్టలవానిపాలెం గ్రామ ప్రజలు సానుభూతి తెలియజేస్తున్నారు.



# రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు ఉందా

- -అన్నదాతల ఆస్తులు కాజేందుకు కుట్ర పన్నారు
- - హద్దు రాళ్లు, పాస్ పుస్తకాలపై బొమ్మలు వేయించుకోవడమా ఆదుకోవడమంటే ?
- - రైతులను ముంచిన నువ్వా గిట్టుబాటు ధర గురించి మాట్లాడేది ?
- - పోలవరాన్ని నిర్వీర్యం చేసింది నువ్వు కాదా ?
- - జగన్ పై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఫైర్

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 19 ప్రభాతవార్త :** దేళ్ల పాలనలో రైతులను నిండా ముంచిన జగన్ కు అన్నదాతల గురించి మాట్లాడే అర్హత ఉందా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రశ్నించారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో జగన్ పై ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా రైతుల ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేయడమా అన్నదాతలను ఆదుకోవడం అంటే అని జగన్ ను నిలదీశారు. పొలాలకు సరిహద్దు రాళ్ల, రైతుల పాస్ పుస్తకాలపై బొమ్మలు వేయించుకున్న మాత్రాన రైతులను ఆదుకోవడం అవుతుందా అని ఎద్దేవా చేశారు. మిర్చి రైతులకు గిట్టు బాటు ధర లేదని గగ్గోలు పెడుతున్న జగన్.. ఐదేళ్ల కాలంలో ఏనాడైనా రైతుల గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. పట్టిసీమ ప్రాజెక్టును ఐదేళ్లలో నిర్వీర్యం చేసి పంట పొలాలకు నీళ్ల కూడా లేకుండా చేశారని వివరించారు. మిర్చి రైతులను మొదటి నుంచీ ఆదుకుంది తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన వెంటనే పోలవరంపై దృష్టి సారించి 70 శాతం పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ పోలవరాన్ని నిర్వీర్యం చేసి రైతుల నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉంటే లక్షల ఎకరాల్లో రైతులకు లబ్ది చేకూరేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఎనిమిది నెలల కాలంలోనే మళ్లీ పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని పేర్కొన్నారు. ఇది రైతుల పట్ల చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. గుంటూరు మిర్చి రైతుల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారిస్తే వారు నమ్మే పరిస్థితి లేదన్నారు. గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసిన జగన్ ను రాబోయే ఎన్నికల్లో సింగిల్ డిజిట్ కు పరిమితం చేయబోతున్నారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అన్నదాతలకు మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ చెప్పారు.





# మంగళగిరి ఎయిమ్స్‌లో తొలి అవయవదానం

**మంగళగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మంగళగిరి అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ నందు బుధవారం తొలిసారిగా అవయవదానం నిర్వహించారు. వైద్యులు చెప్పిన వివరాల మేరకు విజయవాడ భవానీపురం కు చెందిన ముత్యాల సరస్వతి (54) తన కుమారుడితో కలిసి ఈనెల14వ తేదీన మంగళగిరి పరిధి నూతక్కి లోని తన కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో తాడేపల్లి పరిధి ప్రాతూరు రోడ్డులో ద్విచక్రవాహనంపై నుండి పడి తీవ్రంగా





గాయపడ్డారు. దీనితో తలకు బలమైన గాయం అయింది. తొలుత తాడేపల్లిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం పరిస్థితి విషయమంగా ఉండటంతో మంగళగిరి ఎయిమ్స్ కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. కాగా సరస్వతి కి ఈనెల 18న బ్రెయిన్ డెడ్ గా వైద్యులు, ప్రభుత్వ కమిటీ నిర్ధారించింది. దీనితో సరస్వతి అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో కాలేయం, కిడ్నిని మణిపాల్ ఆసుపత్రికి, కళ్ళను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి, మరో కిడ్నీని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న పేషెంట్ కు అమర్చారు. ఈ మేరకు బుధవారం ఎయిమ్స్ ఐపీడీ బ్లాక్ వద్ద సరస్వతి భౌతికకాయానికి ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. ఎయిమ్స్ డైరెక్టర్ అహంతేమ్ శాంతాసింగ్, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా భౌతికకాయానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవయవ దానం చేసిన మృతదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ చెప్పారు. తొలుత ఎయిమ్స్ ప్రాంగణంలో జీవన్ ధార్, ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అదే క్రమంలో అవయవదానం (జీవన్ దాన్) చేసినందుకు రూ.10వేలు ప్రోత్సాహకం అందించగా దానిని ఆమె కుమారుడు ఎయిమ్స్ ఆసుపత్రికి వితరణ చేసి రోగుల అవసరార్థం వినియోగించాలని కోరారు. భౌతికకాయాన్ని తరలించే సందర్భంలో ఆసుపత్రి లో పూలబాటను ఏర్పాటు చేసి ఎయిమ్స్ సిబ్బంది చప్పట్ల నడుమ మార్చురీకి తరలించారు.



# పాతగుంటూరు పోలీసులకు 8సిసి కెమెరాలు అందజేత

## -కిమ్స్ శిఖర కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స బోర్డు ఆఫ్ డైరెక్టర్ అధ్విక్ బొల్లినేని

**గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** సామాజిక బాధ్యతలో భాగంగా తమవంతు సాయంగా బుధవారం 8 సిసి కెమెరాలను కిమ్స్ శిఖర కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని పాతగుంటూరు పోలీసులకు అందజేశారు. మల్టి స్పెషాల్టి కేర్ హాస్పటల గా సేవలందిస్తున్న కిమ్స్ కేర్ హాస్పటల్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈ సందర్భంగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ బొల్లినేని తెలిపారు. సీసీ కెమెరాలను ఇన్‌స్పెక్టర్ వై.వి.సోమయ్య, ఎస్సైలు ఎన్‌సి ప్రసాద్, ఎస్‌కె అబ్దుల్ రెహామాన్లను కలసి అప్పగించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి కార్యక్రమలు చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీ యమని ఓల్డ్ గుంటూరు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.





# ఆధార్ సెంటర్స్‌ను సద్వినియోగించుకోవాలి

## - పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి



**కొల్లిపర, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రజలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్స్ ను సద్వినియోగించుకోవాలని పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను ఆయన తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆధార్‌లో ఎటువంటి తప్పులు ఉన్నా అడ్రసు మారిన సరిచేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ఫార్మసీ కళాశాల్లో క్యాన్సర్ పై అవగాహన సదస్సు

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ మరియు గుంటూరులోని ఓమెగా హాస్పటల్ సంయుక్తంగా క్యాన్సర్ నివారణ మరియు చికిత్స పై అవగాహన సదస్సు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. సమావేశానికి కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదనరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిదిగా డాక్టర్ హనీషా పోలవరపు ధూళిపాళ్ళ ఎండి కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్, సహచరులను సాధరంగా స్వాగతించారు. ఈ సదస్సుకు 98మంది మహిళలు హజరైనట్లు వారికి అవసరమైన క్లినికల్ పరీక్షలను ఓమెగా హాస్పటల్ టెక్నికల్ సిబ్బంది నిర్వహించిన తగిన సూచనలు ఇచ్చినట్లు కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ జి.ఇందిరా ప్రియదర్శిని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ మరియు కార్యదర్శి ముఖ్యఅతిధిని దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సీతారామయ్య, ఫార్మసీ ప్రాక్టీసు హెచ్‌ఓడి డాక్టర్ హేమకుమారి, వి.మౌనిక తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# సెంట్రల్ జిఎస్టీ ఉద్యోగులకు క్రీడల్లో బంగారు పతకాలు

## -సెంట్రల్ జిఎస్టీ కమీషనర్ సాధు నరసింహారెడ్డి



**గుంటూరు విద్య, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సౌత్ ఇండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీల్లో సెంట్రల్ జిఎస్టీ కి చెందిన ముగ్గురు ఉద్యోగులు 4బంగారు, 2 వెండి పతకాలు సాధించి గుంటూరు సెంట్రల్ జిఎస్టీ కమీషనరేట్‌కు మంచి పేరు తీసుకొచ్చారని కమీషనర్ సాధు నరసింహారెడ్డి తెలిఆపరు. స్థానిక కన్నావారితోట జీఎస్టీ భవన్‌లో పతకాలుసాధించిన ఉద్యోగులకు బుధవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ పి.వెంకటాచలం లాన్‌టెన్నిస్‌లో 40ప్లస్ సింగిల్స్, 40ప్లస్ డబుల్స్, 50ప్లస్ డబుల్స్ 3బంగారు పతకాలు గెలుచుకున్నాం న్నారు. ట్యాక్స్ అసిసెంట్ పి.వేంకటేశ్వర్లు 100మీటర్ల పరుగుపందెం ,50ప్లస్ కేటగిరిలో బంగారు పతకం సాధించగా ట్యాక్స్ అసిస్టెంట్ అనితకు షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో 2రజిత పతకాలు లభించాయని వివరించారు. ముగ్గురు ఉద్యోగులను కమీషనర్ పట్టుదుశ్శాలు వాలతో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈనెల 21నుంచి 23వ తేది వరకు బెంగళూరులో జరగనున్న ఆలిండియా సెంట్రల్ రెవెన్యూ క్రీడా పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ నుండి ఈ ముగ్గురు ఎంపిక కావడం విశేషంగా కమీషనర్ తెలిపారు. కార్యక్రమంలో జిఎస్టీ అడిషనల్ కమీషనర్ బి.లక్ష్మీనారాయణ, ఏసిలు వి.వేంకటేశ్వరరావు, ఎం.నాగరాజు, బి.రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చీదేళ్ళ ఈశ్వరరావు, ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నూజెండ్ల బ్రాంచ్, నూజెండ్ల గ్రామం & మండలం, పల్నాడు జిల్లా, ఫోన్: 9908524787

బంగారు నగల వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణము గడువు తీరిననూ చెల్లించలేదు. సదరు వ్యక్తులకు నోటీసులు పంపియున్నాము. సదరు నోటీసులను పంపినప్పటికీ ఖాతరు చేయనందున వారి బకాయిలను రాబట్టుకొనుటకు బ్యాంక్ నిబంధనలు అనుసరించి **తేది.21-02-2025 అనగా శుక్రవారం మధ్యాహ్నం గం.3-00 లకు** బ్యాంకు ఆవరణలో బహిరంగంగా వేలం వేయుటకు నిర్ణయించడమైనది.
**షరతులు :** 1) నోటీసులు చేరని వారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. 2) ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వేయుటకు, నిలుపుదల చేయుటకు పూర్తిగా / పాక్షికంగా రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు. 3) ఈ ప్రకటన ఖర్చు అప్పుదారే భరించవలెను. 4) వేలములో పాల్గొనువారు తప్పనిసరిగా రూ.10,000/- ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. వేలము పాడిన వెంటనే పూర్తిగా సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకోవలెను. లేనిచో ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు.

| అకౌంట్ నెం. | అకౌంట్ పేరు | బరువు గ్రాులలో |
|---|---|---|
| 40606991824 | షేక్ ఖాసిమ్ బి, భర్త : హుస్సేన్, నూజెండ్ల | 20.5 |
| 4060147 2510 | షేక్ ఖాసిమ్ బి, భర్త : హుస్సేన్, నూజెండ్ల | 54.5 |

తేది: 19-02-2025, ప్రదేశం: నూజెండ్ల సం/- బ్రాంచ్ మేనేజర్

## కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుంది

### -నగర నగర కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 19 ప్రభాతవార్త :** కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ తరుపున అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన



పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఎఎస్ తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్సోర్సింగ్ కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి ల కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్ లను బుధవారం కమిషనర్ ఛాంబర్ నందు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి లు మరణించారని, వారి కుటుంబ సభ్యులకు సాధారణ మరణానికి అందే ఎక్స్ గ్రేషియా మరియు మట్టి ఖర్చుల క్రింద రూ.2 లక్షల చెక్కు లని అందించామని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు. కార్మికులు కూడా తమ సమస్యల పై అర్జీలు లేదా ఫిర్యాదులు తమకు అందిచవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

**దుర్గి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు బుధవారం మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రాన్ని అందచేశారు. తమ సమస్యలను రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి తమకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కోరారు.



అగ్రిగోల్డ్ సంస్థ 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది నుండి నిధులు సేకరించిందన్నారు. మన రాష్ట్రంలో 19.52 లక్షల మంది నుండి రూ.3, 986 కోట్లు సమీకరించి అగ్రిగోల్డ్ యాజమాన్యం తన కుటుంబ సభ్యులు, బినామి పేర్లతో ఆస్తులను బదిలీచేసి బోర్డు తిప్పేసిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఎటువంటి పరిహారం చెల్లించకపోవటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం చొరవ చూపి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందచేసిన వారిలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి వడ్డె మధుసూధన్‌రావు, సహాయ కార్యదర్శి నరమాల చంద్రయ్య, కొత్తా నాగేశ్వరరావు, టి.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీఅభ్యర్థి ఆలపాటికి మద్దతుగా జీవీ మక్కెన ముమ్మర ప్రచారం

**వినుకొండ,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉదయం పట్టణంలో కూటమి నేతలతో కలిసి ఉపాధ్యాయులను, పట్టభద్రులు కలిసి కూటమి ప్రభుత్వ విధానాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు.



గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యువతకు, ఉద్యోగులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న కూటమిని బలపర్చాలని, ఆలపాటిని గెలిపిస్తే ఆ వర్గాలకు మరింత సంక్షేమాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## తొలిసారిగా గిరిజన మహిళకు ఉపకులపతి పదవి రావడం హర్షనీయం

**వినుకొండ,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా గిరిజన మహిళకు ఉపకులపతి పదవి రావడం హర్షనీయమని ట్రైబల్ రైట్స్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ విష్ణునాయక్, ప్రధాన కార్యదర్శి కొడవత్ మస్తాన్‌నాయక్, కోశాధికారి దేసావతు వెంకటేశ్వర్లు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సాతుపాటి ప్రసన్నశ్రీని నియమించడం గిరిజన ప్రజానీకం హర్షించతగ్గ విషయం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖామంత్రి లోకేష్‌కు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ల్యాండ్ టైటిల్ యాక్ట్ భూరక్ష పేరుతో రైతులను మోసం చేసిన జగన్ : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** జగన్ తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ భూరక్ష పేరుతో రైతుల వద్దనుంచి భూములు కాజేసిన జగన్ నేడు రైతుల గురించి మాట్లాడటం రాజకీయ నాటకంలో ఒక భాగమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. బుధవారం మండలంలోని సాతులూరు గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బాగంగా క్లస్టర్, బూత్ యూనిట్ ఇన్‌చార్జిలు మరియు సాధికారమిత్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయగానే జగన్ రాష్ట్రం విడిచి పోవడం ఖాయమని అన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మంచి మెజారిటీ వచ్చేలా కూటమి పార్టీ నేతలు కృషి చేయాలన్నారు. జగన్‌రెడ్డి,ఆయన అవినీతి మీడియా బలంగా ఉన్న ప్రజాప్రభుత్వాన్ని బలహీన పరిచేందుకు ఇష్టానుసారంగా ప్రచారాలు చేస్తున్నాయని అన్నారు. అధికారులను బెదిరిస్తూ వారిని అగౌరవపరిచేలా జగన్ మాట్లాడుతున్నారని అన్నారు. జగన్ స్థానంలో ఇంకెవరు ఉన్నా తనకు ఎదురైన పరా భవంపై ఆత్మపరిశీలన చేసు కుంటారని, కానీ అతను



ఇంకా తాను అధికారంలో ఉన్నాననే భ్రమతో మాట్లాడు తున్నారన్నారు. జగన్ హెచ్చరికలకు ఎవరూ భయపడేదిలేదని, 8నెలల కూటమి పాలనలో చంద్రబాబు చేసిన మంచిపనులు చూసైనా జగన్ బుద్ధి మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన నాయకులు మార్కొండేయులు, తోట రాజారమేష్, టిడిపి మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపిద్దాం

**కొల్లిపర, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపిద్దామని దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, తూములూరు, కొల్లిపర గ్రామాలలో ఆలపాటిని గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించి పట్టభద్రులను. .ఉద్యోగులను కలసి మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేయాలని కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ ఆలపాటి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీడీ మండల అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి, నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంక కోటిరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, అవుతు సంజీవరెడ్డి, బొంతు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్యాధికారి బి. మహదేవ్ బాధ్యతలు స్వీకారం

**నూజెండ్ల, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** మండలంలోని ములకలూరు ఆయుష్ వైద్యశాల వైద్యాధికారిగా బోరుగుపల్లి మహదేవ్ బుధవారం. బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన అనిత డిప్యూటేషన్‌పై గుంటూరుకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిగా బోరుగుపల్లి మహదేవ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశాలలో అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.



## రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

**నూజెండ్ల, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో



మధులత రెవిన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తలార్లపల్లి రెవిన్యూ పరిధిలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకురాగా ఆమె నేరుగా రైతులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. సర్వే సమయంలో పొలాలు ఉన్న రైతులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రమైన నూజెండ్ల తహశీల్దార్ కార్యాలయం సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్‌కుమార్, డిటి బాల వెంకటేష్, సర్వేయర్ చండీరాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**దుర్గి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మాచర్లకు చెందిన రావెల శివమణి, గుత్తికొండ శివ, గంజి భూలక్ష్మీలు మంగళ వారం రాత్రి మాచర్ల నుంచి ఆటోలో ఒప్పిచర్ల తిరునాళ్ళకు బయలుదేరారు. మార్గమద్యలో అడిగొప్పల సమీపంలో కారంపూడి నుంచి దుర్గికి ద్విచక్రవాహనంపై వస్తున్న దుర్గికి చెందిన తిరుమల రామకృష్ణ, కొండబోయిన మల్లేష్‌ల ద్విచక్రవాహనం, ఆటో ఢీకొని ఆటో ప్రక్కకు పోవటంతో కారంపూడి నుంచి ఎదురుగా వస్తున్న టిప్పర్ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో శివమణి, శివ, భూలక్ష్మీలకు గాయాలయ్యాయి. చికిత్సకు గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు శివమణిని గుంటూరుకు, శివ, భూలక్ష్మీలను నర్సరావుపేటకు తరలించారు. గుంటూరులో చికిత్స పొందుతున్న శివమణి(23) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. శివమణి స్వగ్రామం కారంపూడి మండలం చింతపల్లి. కుటుంబ విభేదాలతో మాచర్లలోని తన పిన్ని వద్ద కొంతకాలం నుంచి ఉంటుంది. మృతురాలికి ఒక బాబు ఉన్నాడు. బంధువుల ఫిర్యాదుమేరకు దుర్గి ఎస్సై సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## సుబాబులు, జామాయిల్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : రైతు సంఘాల నాయకులు

**చిలకలూరిపేట, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** సుబాబుల్, జామాయిల్, సరుగుడు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సామాజిక వన రైతు



సంఘం రాష్ట్ర సమితి అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి బాబూరావు, వి హనిమిరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారుమాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సుబాబుల్, జామాయిల్, సరుగుడు ధరలు బాగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుబాబుల రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కటంలేదని, దళారులు, పేపరు కంపెనీలు కుమ్మక్కై ధరలను తగ్గిండడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రాష్ట్ర అటవి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యూకలిప్టస్ కలప వేలంలో పలు అక్రమాలు జరుగుతున్నాయని, గుత్తే దారులు సిండికేట్‌గా మారి కారుచౌకగా టెండర్లను దక్కించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చంద్ర కొండలరావు తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రానున్న రోజుల్లో వైకాపా అక్రమార్కులతో నిండనున్న జైళ్లు

### -జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు

**గురజాల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** రానున్న రోజుల్లో వైసీపీ అక్రమార్కులతో జైళ్లు నిండనున్నాయని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తీరును వైసీపీ నేతలే అసహ్యించుకుంటున్నారన్నారు. అధికారులను బట్టలూడతీస్తామనడం పైశాచికత్వం అన్నారు. ప్రజలే వైసీపీని 11 పీలికలు చేశారన్నారు. వైసీపీ నేతలు అధికారం కోల్పోయినా శాడిజాన్ని మాత్రం వదులుకోలేదన్నారు. జనసేన ఉన్నంత కాలం



వైసీపీ అధికారంలోకి రావడం జరగదన్నారు. ప్రజలు వైసీపీని ఎప్పుడో మర్చిపోయారన్నారు. వైసీపీలో ఉన్న నేతలు పునరాలోచించుకోవాలన్నారు. తాము అధికారంలోకి వస్తే అధికారుల బట్టలూడతీస్తాం అంటూ వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు.

## నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తాం

### -ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార:** పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా, సంగం డెయిరీ నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. సంగం డెయిరీ ఉత్పత్తులను



ఉభయ తెలుగు రాష్ట్రాలకు మరింత విస్తృతపరుస్తామన్నారు. దేవరపల్లిలో సంగం డెయిరీ ఉత్పత్తుల ఫ్యాక్టరీకి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ 1977వ సంవత్సరంలో సంగం డెయిరీని రైతుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవస్థాపక ఛైర్మన్‌గా ఎడ్లపాటి వెంకట్రావు డెయిరీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని సంగం డెయిరీ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి సంగం డెయిరీని మరింత అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి ఈ ప్రాంతంలో క్షీరవిప్లవ ప్రదాతగా పేరు తెచ్చుకున్నారన్నారు. సంగం ఆవిర్భావం జరిగాక అప్పటి ముఖ్యమంత్రి టి.అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి, జలగం వెంగళరావు, నేటి నారా చంద్రబాబునాయుడు వరకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి వారసుడిగా తాను కూడా వందల కోట్ల టర్నోవర్‌ను వేలకోట్లకు తేవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం సంగం డెయిరీపై కక్షసాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. మాక్స్ చట్టం అమలు నిలుపు ప్రయత్నించిందన్నారు. అయితే తాము సుప్రీంకోర్టుకు వెళ్ళి మాక్స్ చట్టాన్ని పరిరక్షించుకున్నామన్నారు. ఈ చట్టం సహకార వ్యవస్థకు రక్షణ కవచంగా ఉందన్నారు. అయినా అప్పుడప్పుడు ప్రభుత్వానికి సహకార వ్యవస్థకు ఘర్షణ వాతావరణం ఏర్పడుతోందన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సంగం మిల్క్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ ఉత్పత్తులను విస్తరించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాలలో మిర్యాలగూడ ఫా క్టరీని ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఉభయగోదావరి జిల్లాలకు ఉత్తరాంధ్ర జిల్లాలకు పాడి రైతులకు వినియోగదారులకు ఉత్పత్తులు అందించడానికి దేవరపల్లిలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేశామన్నారు. దేవరపల్లి ఫ్యాక్టరీలో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. భవిష్యత్తులో 5లక్షల లీటర్ల పాల ఉత్పత్తులు చేయడానికి అవాకశం కల్పిస్తామన్నారు. సంగం డెయిరీ 18వందల కోట్ల రూపాయల టర్నోవర్ ఉందని తెలిపారు. వందలాదిమంది ఈ సంగం డెయిరీ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లబ్ది పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ బ్రహ్మయ్య, ఎండి గోపాలకృష్ణ, పిఆర్వో శ్రీనివాస్, దేవరపల్లి టిడిపి అధ్యక్షుడు ఆంద్రు అనిల్, రైతు నేతలు పరిమి వెంకటేశ్వరరావు, పరిమి గంగాధరరావు పరిమి శ్రీరామకృష్ణ, పిన్నమనేని సత్యనారాయణ, సర్పంచి కూచిపూడి బుల్లారావు, వంగా జైనుబాబు, దుగ్గిన బాబి, గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి మండలాల రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాజీ మహరాజ్ జయంతి

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో



బుధవారం చత్రపతి శివాజీ మహరాజ్ 395వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కేతావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పరిపాలనా విధానంలో, యుద్ధ తంత్రాలలో, భారతదేశ రాజులలో శివాజీ మహరాజ్ అగ్రగన్యుడని, గూఢాచారి వ్యవస్థను ఏర్పాటు చేసుకొని శత్రువుల వ్యూహాలను కనుగొనడంలో దిట్ట అన్నారు. అన్ని మతాలను గౌరవించిన నాయకుడు అన్నారు. గురజాల కోకన్వీనర్ వడ్లమూడి వెంకయ్య మాట్లాడుతూ పూణే రాజధానిగా మరాఠా సామ్రాజ్యాన్ని దేశవ్యాప్తంగా నిలిబెట్టిన మహాయోధుడు శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు, పట్టణ జనరల్ సెక్రటరీ మణికంఠ, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఉడుత ప్రసాదరావు పాల్గొన్నారు.

## బాల్య సంరక్షణ విద్య పై శిక్షణ

**కొల్లూరు, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) :** రాష్ట్ర బాల సంరక్షణ విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలకు 120రోజులు సర్టిఫికెట్ కోసం పాఠశాల విద్యాశాఖ శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని స్టేట్ రిసోర్స్ పర్సన్ సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక



కొల్లూరు బాలిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సూచించిన తరగతులల సుధాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలలో ఆటల ఆధారిత అభ్యసన మాడ్యుయల్స్ లోనే ఈసీసీఈ మరియు జాతీయ విద్యా విధానాల గురించి వివరిస్తూ పిల్లలో ప్రారంభించు ప్రారంభ సంవత్సరాలలో మెదుడు అభివృద్ధి మరియు అభ్యసన సమ అభివృద్ధి పిల్లలకు అనుకూలమైన ఆసక్తిని కలిగించే అభ్యాసనం సామాగ్రి రూపకల్పన పాఠశాల సమసిద్ధతలను వివరించాలన్నారు. జరిగిన సమావేశంలో ఎంఈవో జ్యోతి, ఉపాధ్యాయులు స్మాలన్ దోనేపూడి సెక్టార్ ఫజరున్నిసా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కొల్లూరు బాలురన్నత పాఠశాల ఆవరణలో పూర్వ ప్రాథమిక విద్యపై నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రీసోర్స్ పర్సన్ సుధాకర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ ఆద్వర్యంలో బాలురోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్స్ మాట్లాడుతూ పిల్లల అభ్యసనను బలోపేతం చేయటం పిల్లలకు ఆటల పాటల ద్వారా అభ్యసన చేయుట తల్లిదండ్రులకు సహజ భాగస్వామ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు చిదంబరరావు, కొల్లూరు, అనంతవరం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించిన ఢిల్లీ పిడబ్లూసీ సభ్యులు

**యడ్లపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెంఘీస్కాన్‌పేట గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించేం దుకు బుధవారం ఢిల్లీ ప్రైస్ వాటర్ రిసోర్స్



కో-అపర్స్ మేనేజర్ వంశీకృష్ణ విచ్చేయటం జరిగింది. గ్రామంలోని సిహెచ్ శ్రీనివాసరావు బొప్పాయిలో అంతర పంటలు మరియు అన్ని రకాల అకుకూరలు, కూరగాయపంటలు ఒకే ఫ్లాటులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఎటువంటి రసాయనాలు వాడకుండా సాగు చేస్తున్నటువంటి పంటలను పరిశీలించారు. రైతుతో మాట్లాడి వ్యవసాయంలో లాభనష్టాలు అడిగి తెల్సుకున్నారు. రైతు వివరిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట పండించుకుంటున్నాని తెలిపారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఎవరు ఇక్కడ ఉంటారు వారి విధులు ఏమిటని తెల్సుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి, వైపీ స్వాతి, ఎన్ఎఫ్ఎస్ సౌజన్య, అప్పలరాజు, నందకుమార్, రైతులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సాధకుడు రామకృష్ణ పరమహంస


**రెంటచింతల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సత్యాన్ని అన్వేషించడం ఎలాగో తన జీవితం ద్వారా, దేవుని రహస్యాన్ని సాధారణ మనిషి



భాషలో వెల్లడించి మతాలన్నీ మోక్షానికి వేర్వేరు మార్గాలని, అన్ని మతాలు ఒకే భగవంతుని వైపు దారితీస్తాయని సనాతన ధర్మం ప్రాముఖ్యతను, భారతీయ తత్వచింతనలోని ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆధ్యాత్మిక సాధకుడు రామకృష్ణ పరమహంస అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రెంట చింతలలో స్థానిక శ్రీరామకృష్ణ పరమహంస 190వ జయంతి వేడుకల్లో పాల్గొన్న పలువురు వక్తలు రామకృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఆధ్యాత్మిక వేత్తగా, స్వామి వివేకానందకు గురువుగా, ఎందరికో జ్ఞాన మార్గదర్శిగా రామకృష్ణ పరమహంస ప్రసిద్ధులన్నారు. అర్ధాంగి శారదాదేవిని జగన్మాతగా ఆరాధించి ఆధ్యాత్మిక గురువుగా తీర్చిదిద్ది సరికొత్త సంప్రదాయానికి రామకృష్ణ పరమహంస శ్రీకారం చుట్టారన్నారు. సాన్వమి రామకృష్ణ ఆధునిక సమాజంలో సనాతన ధర్మం నిలబెట్టిన మహనీయుడని కొనియాడారు. ఈసందర్భంగా రామకృష్ణ గురుకులం పాఠశాల విద్యార్థుల కోలాట ప్రదర్శన నడుమ స్వామి రామకృష్ణ పరమహంస చిత్రపటంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా మండలి సభ్యులు గుంటక కాశిరెడ్డి, పల్సూరి రాముడు, నాళం పెదబాబు, గుండా రామ్మూర్తి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూచిపూడి కార్యదర్శి తిరుమలరావుకు ఘన సన్మానం

**అమృతలూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** అమృతలూరు మండలంలో జనవరి 7వ తేది నాటికే కూచిపూడి గ్రామ పంచాయతీ నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండడం అమృతలూరు మండలానికి, బాపట్ల జిల్లాకు గర్వకారణమని డిపిఓ ప్రభాకర్ కొనియాడారు. కూచిపూడి గ్రామంలో ఇంటి పన్ను నూరు శాతం వసూలుకు కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి బి. తిరుమలరావును డిపిఓ ప్రభాకర్, డిఎల్‌పిఓ కెజెవి శ్రీనివాసన్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దుశ్శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపిఓ ప్రభాకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి తిరుమలరావును మండలంలోని కార్యదర్శు అందరూ ఆదర్శంగా తీసుకొని మండలంలో నూరు శాతం ఇంటి పన్ను వసూలకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల నరేంద్రకుమార్, ఎంపిడిఓ బి.మారుతీ శేషమాంబ, ఇన్‌చార్జ్ ఇఓపిఆర్‌డి మాకినేని రవిశంకర్, ఎఓ మహాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలు

**గుంటూరు కల్చరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** స్థానిక కొరిటెపాడు పార్కు ప్రాంగణంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి కార్పొరేటర్ కోటేశ్వరరావు పూలమాలలు వేసి 395వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మరాఠా సంఘ్ కార్యదర్శి జాజమ్ సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు సిందే లక్ష్మీనారాయణ, సభ్యులు కావే రామయ్య, శ్రీనివాస రావు, నిక్కయు తానాజీ, బాబర్ విఠోభా, దుర్యోధన్ పాటిల్, రామచంద్ర పాటిల్, మోతే శేషగిరిరావు, కె.ధర్మనారాయణ్ సింగ్, చిరుమామిళ్ళ గోపికృష్ణ విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు, బాణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కార్పొరేటర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ శివాజీ శౌర్యసాహసాలను, అకుంఠిత దీక్షను ఈ తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.



## భారతదేశాన్ని దేవాలయాలు ఏకం చేస్తున్నాయి

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** అంతర్జాతీయ దేవాలయాల సమావేశం, ఎక్స్‌పో (ఐటిసిఎక్స్)2025లో తమిళనాడు బిజెపి చీఫ్ కె.అన్నామలై ఆలయ ఆర్థిక వ్యవస్థ, స్వయంప్రతిపత్తి గురించి మాట్లాడారు. హిందూ రెలిజిఎస్, చారిటబుల్ ఎండోమెంట్స్ యాక్ట్స్ వంటి పాలక సంస్థలను రద్దుచేస్తూ, భారతదేశ ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడానికి దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. దేవాలయాలు ధర్మకేంద్రాలుగా మాత్రమే కాకుండా ఉన్నత వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు మధ్య వారధిగా కూడా ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారతదేశాన్ని దేవాలయాలు ఏకం చేస్తున్నాయని, సనాతన ధర్మ పరిరక్షణకు అవసరమైన ఆధ్యాత్మిక సౌభ్రాతృత్వాన్ని పునరుజ్జీవింప చేస్తున్నాయని అన్నామలై చెప్పారు.

## బిసి హక్కుల సాధనకు నూతన కమిటీ ఏర్పాటు

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** బీసీలను చైతన్యం చేసి, వారి హక్కుల సాధనకోసం కృషిచేయడానికి నూతనకమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. గుంటూరులోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం క్రాంతి కుమార్ విలేకరులతో మాట్లాడారు. 34శాతం రిజర్వేషన్ ప్రకటనలు కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జనగణనవెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. బీసీలు మేల్కోవాలని పిలుపునిచ్చారు. ఈరోజు బాపట్ల జిల్లా యువజన అధ్యక్షులుగా పచ్చపట్ల గంగరాజును ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ బీసిల సామాజిక సాంఘీక ఆర్థిక సంక్షేమ అభ్యున్నతికి అభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. సంఘ బలోపేతానికి మరింతగా కృషి చేసా ్తనని తెలిపారు. అది నాయకుల అడుగుజాడల్లో నడుస్తూ బీసీల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రేపల్లె నియోజకవర్గ యువజన అధ్యక్షులు కొనిక వెంకట్రావు, గాలి రాజు, రాకేష్, వంశీ పాల్గొన్నారు.




## గోవాడ, యలవర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహణ

**అమృతలూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోవాడ, యలవర్రు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెసర, మినుము పంటలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో జరిగిన సమావేశంలో ఏఓ వి.లోకేశ్వరి మాట్లాడుతూ పెసర, మినుము పంటలను 10 నుండి 20రోజుల్లో కోయడానికి తయారుగా ఉన్నవని తెలిపారు. పంట ఆఖరి దశలో వచ్చే బెట్టను కాపాడుకోవడానికి రైతులు మల్టీకే లేదా 19-19-19 ఎరువులను పిచికారి చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఓ శ్రీకాంత్, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.



## ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఎంతో ఆదర్శమని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 16వార్డులో ఏర్పాటు చేసిన శివాజీ 395వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు శివాజీచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నతనం నుండే దేశభక్తిని అలవాటు చేసుకున్న శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలతో పెరిగారన్నారు. వారు చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఇస్సపాలెం ఆలయ నిర్మాణానికి విరాళం

**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్స పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికిదాతలు బుధవారం విరాళం అందించారు. వివరాలను ఆలయ ఇవో నలబోతు మాధవీదేవి తెలిపారు. నరసరావుపేట పట్టణానికి చెందిన ఉమేష్ చంద్ర, బండారుపల్లి సతీష్ కుమార్, రేష్మ చౌదరి తమ కుటుంబసభ్యులతో రూ.1,01,116లు చెక్కు రూపంలో ఆలయ నిర్మాణానికి అందించటం జరిగిందన్నారు. దాతలకు ప్రభుత్వం ఆదాయపన్ను మినహాయింపు ఇస్తుందన్నారు. సహకారం అందిస్తున్న భక్తులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి దర్శనంతో పాటు ఆలయ ఇవో దాతలను కార్యక్రమంలో సత్కరించారు.



## ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో బుధవారం డిగ్రీ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలుకళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కమిటీ సభ్యులు బత్తుల మురళీ, పూనుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాయి పాల్గొన్నారు. అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు కొత్త ఆశయాలు, కలలతో అడుగు పెట్టారన్నారు. వారి జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, జీవితంలో భవిష్యత్తుకు బలమైన పునాదిగా డిగ్రీ విద్యను చేసుకోవాలని విజయకుమార్ సూచించారు. సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ డిగ్రీ చదువును కేవలం పరీక్షల కోసం మాత్రమే కాకుండా కెరీర్‌ను మెరుగుపరుచుకునే దిశగా ఉపయోగించుకోవాలన్నారు. విజయం, కృషి, పట్టుదలతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో సాకారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యాపకులు శ్రీనివాసరావు, మోహన్‌రావు, ఆనంద్‌కుమార్, సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వ్యర్థాల నుండి సంపద సృష్టి : ఎంపిడివో కృష్ణకుమారి

**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** వ్యర్థాల నుండి సంపద సృష్టి రాష్ట్ర ప్రభుత్వ



లక్ష్యమని ఎంపిడివో టివి కృష్ణకుమారి అన్నారు. బుధవారం మండలంలోని ములకలూరు గ్రామంలో ఎస్ డబ్ల్యూపిసి షెడ్లను వారు పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పిట్స్‌లో వానపాములు వదిలారు. అదే విధంగా షెడ్స్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చెత్త సేకరణ కార్మికులకు ఇళ్లలోని వ్యర్థాలు అందించి ఆరోగ్యవంతమైన గ్రామానికి సహకారం అందించాలని కోరారు. ఎంపిడివో టివి కృష్ణకుమారితో పాటు పంచాయతీ అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

## అమృతలూరు ఇఓపిఆర్‌డిగా రవిశంకర్ పదవీ బాధ్యతలు స్వీకరణ


**అమృతలూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** అమృతలూరు మండలం నూతన ఇన్‌ఛార్జ్ ఇఓపిఆర్‌డిగా మాకినేని రవిశంకర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రవిశంకర్ నిజాంపట్నం మండలం ఇఓపిఆర్‌డిగా పనిచేస్తున్నారు. ఇంతకుముందు రవిశంకర్ చెరుకుపల్లి మండలం కపూరు, భట్టిప్రోలు మండలం వెల్లటూరు, వేమూరు, తెనాలి మండలాల్లో గ్రామ పంచాయతీలకు కార్యదర్శిగా పనిచేసిన పదోన్నతిపై నిజాంపట్నం ఇఓపిఆర్‌డిగా నియమితులయ్యారు. అమృతలూరు ఇఓపిఆర్‌డి, రేపల్లె డివిజన్ ఇన్‌ఛార్జ్ డిఎల్‌పిఓగా పనిచేసిన నరసింహారావు ఇటీవల మృతిచెందడంతో ఆయన స్థానంలో రవిశంకర్‌ను అమృతలూరు ఇఓపిఆర్‌డిగా నియమించారు. నూతన ఇన్‌ఛార్జ్ ఇఓపిఆర్‌డి పదవీ బాధ్యతలు చేపట్టిన రవిశంకర్‌ను డిఎల్‌పిఓ శ్రీనివాస్, ఎంపిపి రావర్ల నరేంద్రకుమార్, ఎంపిడిఓ బి.మారుతీ శేషమాంబ, ఎపిఎం ఎస్‌పి రాంబాబు, ఎ.ఓ మహాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, మండలంలోని కార్యదర్శులు అభినందనలు తెలిపారు. అనంతరం డిపిఓ ప్రభాకర్, డిఎల్‌పిఓ శ్రీనివాస్ అమృతలూరు, కూచిపూడి గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను పరిశీలించారు.



## రక్తదానం ప్రాణదానంతో సమానం

### -ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ పవని ప్రియాంక

**తెనాలి, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) :** స్వచ్ఛందంగా ఒకసారి రక్తదానం చేయడం ద్వారా ఐదు ప్రాణాలకు అందించే సహాయమవుతుందని అవయవ దానం కంటే రక్తదానం మిన్న అని, ఐఎమ్ఏ కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని గుప్తా



డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఐఎమ్ఏ కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. అవయవ దానం ఒక్కసారే చేయగలుగుతామని, ఆరోగ్య వంతమైన వ్యక్తి ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి యు.భానుమతి మాట్లాడుతూ గుప్త డిగ్రీ కళాశాల యాజమాన్యం స్వచ్ఛంద రక్తదాన సేవలకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయకృష్ణ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు విద్యలో రాణించడంతో పాటు, సామాజిక బాధ్యతగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు దశరధరామి రెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న విజయాలను వివరించారు. గుప్త డిగ్రీ కళాశాల, ఫార్మసీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు బ్లడ్ బ్యాంక్ చైర్మన్ మేడూరి భాస్కరరావు, రెడ్‌క్రాస్ సంస్థ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కారంపూడి అంజుమన్ కమిటీ ఎంపిక

**కారంపూడి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కారంపూడి అబూబకర్ మసీదు అంజుమన్ కమిటీ ఎంపిక బుధవారం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా షేక్ బుడేసా, ఉపాధ్యక్షులుగా మౌలానా, కార్యదర్శిగా షేక్ ఖాసిం సైదా ఎన్నుకోవడం జరిగింది. కోశాధికారిగా దావూదులు, 14 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కారంపూడి అంజుమన్ కమిటీ కారదర్శిగా ఎంపికైన సైదా మాట్లాడుతూ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకున్న కారంపూడి ముస్లిం సోదరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ముస్లిం సోదరుల సమస్యలపై ఎప్పుడూ ముందుండి పరిష్కరిస్తానని ఆయన అన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాచర్ల ఎమ్మెల్యే

**మాచర్ల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. బుధవారం ఉదయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి



మద్ధతు కోరారు. ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలు, సచివాలయాలతోపాటు పట్టభద్రుల ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి మద్ధతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మద్దిరాల మ్యాని, మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి సయ్యద్ అన్వర్‌బాష, ఎన్డీయే కూటమి నాయకులు కజ్జం సైదయ్య, జూలకంటి అక్కిరెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, అనంతరాములు, మాచర్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

## పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలి

**బాపట్ల, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. గృహ



నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో బుధవారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మొదటి త్రైమాసంలో బాపట్ల జిల్లాకు 4,898 గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యం అన్నారు. ప్రస్తుతం 290 మాత్రమే పూర్తి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. మిగినవన్ని మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గృహ నిర్మాణాలలో పని దినాలు కల్పించాలన్నారు. నిర్దేశించిన మాదిరిగా 90 పని దినాలు చూపి లబ్ధిదారులకు కూలి సొమ్ము చెల్లించాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రతి ఇంటికి ఉండాలన్నారు. నిర్మాణమైన గృహాలలో మరుగుదొడ్లు నిర్మించుకుంటే అలాంటి వారికి త్వరగా బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇళ్ళు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలు జరిగిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. లబ్ధిదారులను చైతన్యపరిచడం, గృహాలు నిర్మించుకునేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఈఇలు, డిఈలు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

## దొంగల ముఠా అరెస్టు

**మాచర్ల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలం కేపీ గూడేనికి చెందిన రైతు శంకర్‌కు చెందిన రెండు ఎద్దులు చోరీకి గురి కావడంతో ఈ నెల 6న బాధితుడు వెల్దుర్తి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న శిరిగిరిపాడు చెక్‌పోస్టు సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో



గేదెలను తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 ఆవులు, 4 గేదెలు, 2 ఎద్దులు స్వాధీనం చేసుకున్నామని గురజాల డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎస్‌కే నఫీజ్‌బాష, ఎస్సై సమందర్‌వలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన మండల విద్యాశాఖ అధికారి

**కర్లపాలెం, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** మెనూ ప్రకారంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాలని కర్లపాలెం మండల విద్యాశాఖ అధికారి టి యు మనోరంజని అన్నారు. బుధవారం స్థానిక కర్లపాలెం ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డ్స్ ను రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా స్థాయి



తెలుసుకొని, నాణ్యమైన పోషక విలువలతో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీసు రావు. ఏం ఇందుమతి. డిఎల్ ప్రసన్న తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**కారంపూడి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు శెట్టి హనుమంతరావు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం



నాయకులు భవిరిశెట్టి రామారావు, బీజేపీ జిల్లా నాయకులు పువ్వాడ శ్రీనివాసరావు, కజ్జం ఆంజనేయులు, తెదేపా సీనియర్ నాయకులు కొంగర లక్ష్మీనారాయణ, లింగాల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు ఎస్వీఆర్ కృష్ణ, మండల విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు చిట్టిప్రోలు నరసింహారావు, సభ్యులు గణితి అమరయ్య, కటకం అనిల్‌కుమార్, సాగి వెంకయ్య, కొల్లిపర సుబ్బారావు, తోట రంగారావు, బొంకూరి రఘునందన్, బీజేపీ మండల నాయకులు వేద వెంకట కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసులో ప్రాణాలు ఒదిలిన సైనికుడు పరిశ వెంకటేష్‌కు జోహార్లు

**పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం గౌడపాలెంకు చెందిన పరిశా శ్రీనివాసరావు శివపార్వతి ల పెద్దకుమారుడు వెంకటేశ్ రాజస్థాన్ లో ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసు చేస్తూ దురదృష్టవశాత్తు మరణించటం బాధాకరం అని బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. స్థానిక జిల్లా మాజి సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు శివపార్వతి లకు పుట్టిన ఇద్దరు కుమారులు వెంకటేష్ మరియు



గోపీకృష్ణ లను దేశ రక్షణ కోసం సైన్యంలో చేర్పించటం గర్వకారణం అని, అయితే అనుకోకుండా ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసు లో జరిగిన దుర్ఘటనలో వారి పెద్ద కుమారుడు వెంకటేశ్ ను కోల్పోవటం వారి కుటుంబానికి తీర్చలేని లోటన్నారు. దుర్ఘటనలో మరణించిన అమర సైనికుని మరణం గురించి ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులతో ను మరియు అధికారులతో ను మాట్లాడుతున్నట్లు ఎంపీటీసీ తాండ్ర తెలియ జేశారు. గురువారం ఉదయానికి అమర సైనికుడు వెంకటేశ్ పార్ధేవదేహం పిట్టలవానిపాలెం గౌడపాలెం లోని వారి స్వగృహానికి రావచ్చు కనుక దేశ ప్రేమికులు అందరూ గరువారం జరుగు అంతిమ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరణించిన జవాను వెంకటేష్ కు ఒక కుమార్తె ఉన్నట్లు సమాచారం. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేష రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు మరియు సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గా రావు లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పై ప్రజావేదిక

**కారంపూడి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై



మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. 6 కోట్ల 70 లక్షలతో జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం మండలంలోని గ్రామాల్లో పది రోజులపాటు పనులను పరిశీలించి గ్రామసభలు నిర్వహించారు. ప్రజావేదికలు ఫీల్డు అసిస్టెంట్ల నుంచి లక్షా 30 వేలు రికవరి విధించారు. ఎంక్వయిరీ క్రింద 32 వవేల రూపాయలు, ప్లాంటేషన్ ఎమౌంట్ 5168 వేల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాలని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ద్వారా ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ ఉపాధిహామీ పనులను సమర్థవంతంగా చేయించాలని అన్నారు. పనికి తగిన వేతనం కకూడా కూలీల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, ఎస్ఆర్‌పీ లోకేష్, ఏపీఓలు కోటిరెడ్డి, కొండలు, టీఏలు, విజిలెన్సు క్వాలిటీ కంట్రోల్ అధికారులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాలలో పొలం పిలుస్తుంది

**కర్లపాలెం, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెం మరియు



పెదగొల్లపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలిస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందవచ్చునని తెలిపారు. ప్రస్తుతం సొంత భూమి కలిగిన రైతులను నమోదు చేస్తున్నారని, త్వరలోనే కౌలు రైతుల నమోదు కూడా జరుగుతుందని తెలిపారు. నమోదు కొరకు రైతులు వారి ఆధార్, 1బి మరియు ఆధార్ కు లింక్ అయిన మొబైల్ నెంబర్ ను తీసుకొని దగ్గర లోని రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. ఆధార్ కు మొబైల్ నెంబర్ లింక్ లేనివారు వేలిముద్ర ద్వారా కూడా ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందవచ్చని తెలిపారు. పంట నమోదు చేయించుకున్న రైతులు సత్వరమే ఈకెవైసి చేయించుకోవాలని కోరారు. అపరాలు వేసిన రైతులు పంట 4555 రోజుల దశలో ఉన్నందున ఈ సమయంలో 13:0:45 (మల్టీ కె) ఎకరాకు 1కేజీ చొప్పున పిచికారి చేసుకోవాలని తద్వారా గింజ నాణ్యత పెరిగి దిగుబడి పెరుగుతుందని సూచించారు. బూడిద మరియు ఆకు మచ్చ తెగుళ్లకు సాఫ్ 300 గ్రా లేదా తాకత్ 400 గ్రా పిచికారి చేసుకోవచ్చని పూతలో పురుగు మరియు రసం పేల్చే పురుగులకు పోలీస్ 50 గ్రా ఎకరాకు పిచికారి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షబానా, శివ నాగరాజు రైతులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యే విధంగా విద్యనందించాలి : జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ

**కారంపూడి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువకునే విద్యార్థులు ఉత్తీర్ణులయ్యే విధంగా విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ అన్నారు. బుధవారం కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే



10వ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల నుంచి ఉత్తీర్ణత వచ్చే విధంగా చూడాలని అన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం పరీక్షలకు విద్యార్థులు ఎక్కువమంది హాజరు కానున్నారని పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న విద్యను అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం అందిస్తున్న మెనూ సక్రమంగా అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్, ప్రధానోపాధ్యాయులు అనంతశివ ఉన్నారు.

## నూరుశాతం పన్నులు వసూలు చేయాలి : కమిషనరు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** పురపాలక సంఘ పరిధిలో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు అన్నారు. ఆస్థి పన్ను, నీటి పన్ను ఛార్జీలు, బకాయిలు ఉన్నవారిని మున్సిపల్, రెవిన్యూ సిబ్బంది తక్షణమే కలిసి పన్ను వసూళ్ళకు సహకరించాలని కోరాలన్నారు. అదే విధంగా గ్రౌండ్ లెవల్‌లో పన్నులు చెల్లించే విధంగా చూడాలన్నారు. సచివాలయ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా టీములను ఏర్పాటు



చేసుకోవాలన్నారు. ఇంటి పన్ను, నీటి పన్ను మార్చి 31వ తేదీలోగా నూరుశాతం వసూళ్ళు లక్ష్యంగా పని చేయాలన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌ను 28వతేదీలోపు పూర్తి చేసుకోవాలని కమిషనర్ జశ్వంత్‌రావు సూచించారు. కార్య క్రమంలో మున్సిపల్ ఇంజనీర్ కె.కనకారావు, రెవిన్యూ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, అధికారులు బెయిలీబాబు, జహంగీర్ పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్-బౌలింగ్ గ్రీన్ స్టేట్ వర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం

**పొన్నూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సి టీ-యూఎస్ఏ-ఓహియోలోని






బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీల (బీజీఎస్‌యూ)మధ్య అవగాహనా ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వీసీ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూఎస్ఏ-ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ ఇంటిరిమ్ వైస్ ప్రొవోస్ట్ ప్రొఫెసర్ రామ్ వీరపనేని, అర్కిటెక్చర్ అండ్ అప్లైడ్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ వేల్ మోక్తర్‌తో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ అవగాహనా ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వీసి మాట్లాడుతూ ఈ అవగాహనా ఒప్పందం వల్ల తమ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు బీజీఎస్‌యూతో కలిపి జాయింట్ డిగ్రీలను అందజేయవచ్చునన్నారు. ఉదాహరణకు తమ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థి 3సంవత్సరాల పాటు ఇక్కడ చదివి, 4వ సంవత్సరం కోర్సును బీజీఎస్‌యూలో చదవచ్చునన్నారు. బీజీఎస్‌యూలో వచ్చే క్రెడిట్స్‌ను ఆధారంగా చేసుకొని తమ యూనివర్సిటీ విద్యార్థికి యూజీ డిగ్రీని అందజేస్తామన్నారు. ఒకవేళ అదే విద్యార్థి 5వ సంవత్సరం కూడా బీజీఎస్‌యూలో ఉంటే వారికి బీజీఎస్‌యూ మాస్టర్స్ డిగ్రీని అందజేస్తుందన్నారు. అంతేకాకుండా యూఎస్ఏలో అక్కడే మరో మూడు సంవత్సరాల పాటు ఉద్యోగం చేసుకోవడానికి కూడా అవకాశం లభిస్తుందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకులు, బీజీఎస్‌యూ అధ్యాపకులు కలిసి సంయుక్తంగా పరిశోధనలు, ప్రాజెక్టులు, ల్యాబ్‌లను కలిసి నిర్వహించుకునే సౌలభ్యం లభిస్తుందన్నారు. విద్యార్థులకు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు లభించే అవకాశం ఉందన్నారు. ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతోపాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రామ్ వీరపనేని, ప్రొఫెసర్ వేల్ మోక్తర్, ప్రొఫెసర్ శ్రీకొల్ల, విజ్ఞాన్స్ సీఈఓ డాక్టర్ మేగన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన ఏఆర్ బలగాల శిక్షణ

**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఏఆర్ బలగాల వార్షిక మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఏఆర్ విభాగం ప్రత్యేకమైందన్నారు. వైవిద్యమైన ఈ విభాగం



పోలీస్‌శాఖకు వెన్నెముక వంటిదన్నారు. పెరెడ్ గ్రౌండ్‌లో 15 రోజుల వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం జరిగిందన్నారు. హోంగార్డు, మోటార్ వెహికల్ ట్రాన్స్‌పోర్ట్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎస్.కృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఏఆర్ విభాగాల సిబ్బందిపై భారం ఎంతో ఉంటుందన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం గురించి, పిల్లల పట్ల బాధ్యతలు తీసుకోవాలన్నారు. విధులలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. ఫస్ట్ ఎయిడ్, లైఫ్ సేవింగ్ పై అవగాహన కల్పించారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వింగ్, సెక్యూరిటీ వింగ్, గన్‌మెన్‌లు, డాగ్ స్క్వాడ్, బ్యాండ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ జె.వి.సంతోష్, సత్తిబాబు, డిఎస్పీ వెంకటరమణ, సి.ఐ.లు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు

**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎథికల్ హ్యాకింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సైబర్ క్రైం విభాగం నుండి కొత్తపల్లి ప్రదీప్‌కుమార్ సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఎథికల్ హ్యాకింగ్ గురించి తెలుసుకోవాలన్నారు. బెదిరింపులపై విద్యార్థులు ఆందోళన చెందవద్దన్నారు. ఎథికల్ హ్యాకింగ్ కోర్సులో శిక్షణ పొందడం ద్వారా మోసాల నుండి బయట పడవచ్చన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు షేక్.మస్తాన్‌షరీఫ్, కరీమ్ మొహిద్దీన్ లు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కోర్సులు నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో వేగంగా స్థిరపడే అవకాశం ఉంటుందన్నారు.

## కోటప్పకొండలో బ్యాటరీ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే



**నరసరావుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండలో భక్తుల కోసం నూతనంగా ఏర్పాటు చేసినబ్యాటరీ కారును శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆలయ ఇవో చంద్రశేఖర్ రావుఅధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు అందించిన బ్యాటరీ వాహనం భక్తులకు ఎంతో ఉపయోగమన్నారు. స్వామి వారి దర్శనం కొరకు వచ్చే వయోవృద్ధులు, చిన్నారులు, వికలాంగులకు, మెట్లపై నడిచేందుకు ఇబ్బంది ఉన్న వారికి ప్రత్యేక వాహనంద్వారా ఆలయ గేటు నుండి స్వామి వారి ఆలయానికి తీసుకుని వెళ్లటం జరుగుతుందన్నారు. కోటప్పకొండకు ఈ వాహనాన్ని రావెళ్ల కోటేశ్వరరావు అందించారని వారికి అభినందనలు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసిరెడ్డి రవి, అంకమ్మ చౌదరి, ఆలయ అర్చకులు ఉన్నారు.

## యూరియాను తక్కువగా వాడాలి

**-మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య**



**పొన్నూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** రైతులు మొక్కజొన్న పైరులో యూరియా మోతాదును ఎక్కువగా వాడుతున్నారని, దీని వల్ల భూములు చౌదుబారిపోయే ప్రమాదం ఉందని మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య అన్నారు. మండల పరిధిలోని మన్నవ, దొప్పలపూడి గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పలు పొలాలను ఆయన పరిశీలించారు. ఒకేసారి నాలుగు నుంచి ఐదు బస్తాలయూరియా మొక్కజొన్నకు వాడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఇది చాలా ప్రమాదకరమైందన్నారు. తదుపరికాలంలో చీడపీడలు, తెగుళ్ళు ఏమైనా వ్యాపించినా వాటి నివారణ సాధ్యం కాకపోవచ్చన్నారు. మినుము, పెసర పంటలలో గ్రోత్ ప్రమోటర్స్ వాడినంత ఎక్కువగా ఫార్ములేషన్ నెంబర్ 4, మల్టీకి వాడేందుకు రైతులు సుముఖత చూపడం లేదన్నారు. మల్టీకే ఎక్కువ అంటే మూడు నుంచి నాలుగు సార్లు పిచికారి రూపంలో మినుము, పెసర పంటలకు అందించినట్లయితే పైరు నీటి ఎద్దడిని తట్టుకునే శక్తిని పెంచుకొంటుందన్నారు.రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి మేలైన దిగుబడులు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది షరీఫా, రేష్మ, సురేష్‌బాబు తదితతులున్నారు.

## రీ సర్వే ద్వారా రైతులకే ప్రయోజనం

**-తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్**

**పొన్నూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** భూములను రీ సర్వే చేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. మండల



పరిధిలోని వల్లభరావుపాలెంలో జరుగుతున్న రీ సర్వేని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంత మంది రైతులున్నారు..? ఎన్ని ఎకరాల పొలం ఉంది...? రైతుల నుంచి ఏమైనా సమస్యలున్నాయా..? సిబ్బంది నుంచి రైతులకు ఏమైనా సమస్య ఉందా..? తదితర విషయాలను రైతులను, సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. రీ సర్వే చేయడం ద్వారా రైతుల భూమిని మరొకసారి సరిచూసినట్లవుతుందన్నారు. అంతేకాకుండా సర్వే పూర్తి అయ్యాక అందుకు సంబంధించిన పత్రాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కొన్ని పొలాల్లో ప్రస్తుతం ఉన్న రైతులు వేరు. రికార్డు పరంగావేరొకరి పేరు ఉండడం, ఈ విధంగా అనేక రకాలైన భూ సమస్యలకు రీ సర్వేలో పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులకు సంబంధించిన భూములకు హద్దులు కూడా నిర్ణయించడం జరుగుతుందన్నారు. రైతులు అధికారులకు సహకరిస్తే సర్వే వేగవంతంగా చేయవచ్చన్నారు. పైలట్ ప్రాజెక్ట కింద తీసుకున్న వల్లభరావుపాలెం గ్రామంలో సర్వే పూర్తయితే మిగిలిన అన్నీ గ్రామాల్లో కూడా రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం త్వరలో ప్రారంభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## పిల్లల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**-మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి**



**పొన్నూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** చిన్నారుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేతాజీనగర్‌లోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధి, పిల్లలను పాఠశాలకు సంసిద్ధులను చేయడంతోపాటు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో 120రోజులు ఈ జ్ఞాన జ్యోతి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ శిక్షణా కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు కె.రాజశేఖరరెడ్డి సందర్శించి ఇక్కడి పరిస్థితులను తెలుసుకొన్నారు.

## స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలి

**-కార్మికశాఖ డిప్యూటీ కమీషనర్ గాయత్రీదేవి**



**పొన్నూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కార్మికశాఖ డిప్యూటీ కమీషనర్ ఎ.గాయత్రీదేవి ఆదేశించారు. స్థానిక సహాయ కార్మిక శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈశ్రమ కార్డులు నమోదు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డుల గురించి స్థానిక సహాయ కార్మికశాఖాధికారి వి.సాయిజ్యోతిని అడిగి తెలుసుకొన్నారు.

## చెత్త సేకరణ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలి


**-డిపిఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.పద్మారాణి**

**పొన్నూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** చెత్త సేకరణ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన




అవసరం ఎంతైనా ఉందని డిపిఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.పద్మారాణి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఎస్‌డబ్ల్యూపిసిషెడ్ వద్ద జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా చెత్త సేకరణ సులువు అవుతుందన్నారు. మూడు బుట్టల విధానం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ముందుగా పంచాయితీ సిబ్బంది మూడు బుట్టల విధానంపై అవగాహన కలిగినట్లయితే ప్రజలకు వివరించడం సులభమవుతుందన్నారు. ప్రధానంగా ఇంటి నుంచి వచ్చే చెత్తను తడిచెత్త, పొడిచెత్త, హానికర చెత్తను వేర్వేరుగా పంచాయితీ సిబ్బంది అందించాలన్నారు. ప్రజలు కూడా చెత్తను అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆవిధంగా సేకరించిన తడి చెత్తను వానపాముల ఎరువుగాను, పొడి చెత్తను బేలింగ్ చేసి అమ్మకాలు జరపాలన్నారు. చెత్త రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. ప్రజలు కూడా రోడ్లపై, కాలువల్లో చెత్తను పడేయకుండా ప్రజలలో చైతన్యం తేవాలన్నారు. ఇంటిలోని వ్యర్థాలను ఏ విధంగా ఎరువుగా తయారు చేసుకోవచ్చునో కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తను ఎరువుగా మారిస్తే సందపను సృష్టించినట్లేనన్నారు. శిక్షణలో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓలు కె.శ్రీనివాసరావు, వి.స్వరూపరాణి, ఎంపిడిఓ ఉమాదేవి, ఈఓపిఆర్డీ టి.ఉషారాణి, స్వచ్ఛ భారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ జి.ప్రసాదరావు,ఏపిఎం యశ్వంత్‌శ్రీనివాస్, తదితరులున్నారు.

## వార్షికోత్సవ వేడుకలు



**సత్తెనపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** పోలేరమ్మతల్లి 17వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మూడు రోజుల పాటు వేడుకలు జరుగుతాయని ఈ సందర్భంగా అర్చకులు తెలియజేశారు. సాయంత్రం లలిత పారాయణం, భజనా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే విధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం జరుపుతామని ఆలయ అర్చకులు తెలియజేశారు.

## పండ్ల వ్యాపారి హత్యకేసులో నిందితుని అరెస్టు : త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్‌బాబు

**తెనాలి, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త) :** పట్టపగలు షేక్ రబ్బాని అనే పండ్ల వ్యాపారిని హత్య చేసిన ఉదంతంతో ముద్దాయిని అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సిఐ



రమేష్‌బాబు మాట్లాడుతూ మృతుని సోదరుడు షేక్ చాన్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టామన్నారు. మృతుడు రబ్బాని మేనకోడలు సనాకు పినపాడుకు చెందిన ముద్దాయి షేక్ గౌస్‌బాషాతో 13సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ సంతానం ఉన్నారని తెలిపారు. గౌస్‌బాషా వ్యసనాలకు బానిసై భార్య పట్ల అనుచితంగా వ్యవహరిస్తుండడంతో, మూడు నెలల క్రితం సనా పుట్టింటికి వెళ్ళింది అని తెలిపారు. ఆ తర్వాత గౌస్‌బాషా తన భార్య కోసం రెండు మూడుసార్లు వెళ్ళినా, అతని ప్రవర్తన సక్రమంగా లేక పోవడంతో రబ్బాని తన మేనకోడలిని పంపించేందుకు నిరాకరించాడు. సనా భర్త వద్దకు వెళ్ళకుండా అడ్డుకుంటున్న కారణంగా గౌస్ బాషా రబ్బానిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 16వ తేది మూడు గంటల సమయంలో ముద్దాయి గౌస్‌భాష చాకుతో దాడి చేశాడు. తన భార్యను కాపురానికి పంపలేదు అన్న ఒక కారణంతో కక్షపూరితంగా దాడికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని సిఐ రమేష్‌బాబు తెలిపారు. ముద్దాయిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్సై ప్రకాష్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పర్యటన

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** పట్టణంలో బుధవారం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు విస్తృతంగా పర్యటించారు. ఆయనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు,కాంట్రాక్ట్ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, న్యాయవాదులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు మద్దతు తెలిపిన యుటిఎఫ్, సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతులకు ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఛత్రపతి శివాజీకి నివాళి



**పెదకూరపాడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీకి జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం కె.వి.రమణ మాట్లాడుతూ భారత జాతి ముద్దుబిడ్డ, గొప్ప దేశభక్తుడు శివాజీ అని కొనియాడారు. పరాక్రమానికి ఆయన ప్రతీక అన్నారు. హిందూ సామ్రాజ్య పరిరక్షణకు ఆయన నడుంకట్టారని తెలిపారు. శత్రువులకు సింహ స్వప్నం అని తెలియజేశారు. దేశభక్తి, ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని హెచ్‌ఎం రమణ తెలిపారు.

## శ్రీ సరస్వతీ శిశు విద్యామందిర్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**అమరావతి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ధర్మ పరిరక్షకుడు, ధర్మ పాలకుడు అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతని శ్రీ సరస్వతీ శిశు విద్యామందిర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. ఆనాడు ఔరంగజేబు దురాగతాల నుండి భారతీయులను సంరక్షించి ధర్మస్థాపన చేసిన శివాజీ మహారాజ్ జీవితం ఎందరికో స్ఫూర్తినిచ్చిందని వక్తలు తెలియజేశారు. అటువంటి గొప్ప పోరాట యోధున్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

## జిల్లా స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్ పోటీలు

**పెదకూరపాడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఈ నెల 22,23 తేదీలలో జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించనున్నట్లు జనచైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడులోని జి.ఆర్.సి.ఆర్.కె. శ్రీచైతన్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో గెలుపొందిన వారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్లతో పాటు షీల్డ్‌లను బహూకరించనున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలలో ఉత్సాహవంతులైన యువతీ, యువకులు పాల్గొనవచ్చునని, పురుషులకు, మహిళలకు వేరువేరుగా ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు : 8886777767, 9848977677, 8008094045 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని అనీల్‌కుమార్ కోరారు.

## వెంకటేష్ మృతి పట్ల సంతాపం తెలియచేసిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



**పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** దేశ సేవలో మరువలేని త్యాగంతో నేను సైతం అంటూ ముందుకెళ్లి అసువులు బాసిన పిట్టల వాని పాలెం గౌడ పాలెం కు చెందిన సైనికుడు పరిశా వెంకటేష్ అమరుడుగా నిలిచారని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. చిన్న వయసులోనే దేశ సేవలో అంకితమై పనిచేయటం గర్వ కారణమని తెలిపారు. రాజస్థాన్ లో బాధ్యతలు నిర్వర్తిస్తూ విధి నిర్వహణలో అనుకోని సంఘటనలో మృత్యువాత పడటం బాధ కలిగిస్తుందన్నారు. వెంకటేష్ సోదరుడు కూడా సైన్యంలో పనిచేస్తూ ఆ కుటుంబం సేవకు పునరంకితమై పనిచేస్తుందని తెలిపారు. మంచి భవిష్యత్తు ఉన్న వెంకటేష్ ను కోల్పోవడం విచారకరమన్నారు. వెంకటేష్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఆ కుటుంబానికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

## ఎన్ఎంఎంఎస్‌కి నలుగురు విద్యార్థులుఎంపిక



**కర్లపాలెం,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్షకు కర్లపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి నలుగురి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం. వీరజ్యోతి అన్నారు . ప్రతిభా పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సంవత్సరానికి 12000 లెక్కన నాలుగు సంవత్సరాలు ఆ ఉపకార వేతనం అందించబడుతుందని తెలిపారు. ప్రతిభ పరీక్షకు ఎస్.కె శంషాధి, ఎస్.కె సుబాన, పి.సుశీ, పి.వినూత్న ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ్ కుమార్, ఎం శ్రీనివాసరావు, ఏ వెంకటేశ్వరరావు, పిటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజెంద్రను భారీ మెజార్టీతో గెలిపించాలి

**బాపట్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారది అన్నారు.బుధవారం బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ లో జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌నలతో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు.ముందుగా స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు,ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి,బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు,బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ,ఆప్ కో చైర్మన్ సజ్జా హేమలత,తెలుగుదేశం పార్టీ నాయకులు చీరాల గోవర్ధన్ రెడ్డి,బాపట్ల పట్టణ బిజెపి అధ్యక్షులు బాల నారాయణ , బాపట్ల మండలం బీజేపీ అధ్యక్షులు శ్రీరామయ్య మరియు బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ ఉపాధ్యాయులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**మాచర్ల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం నిర్వహించారు. మాచర్ల బార్ అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు ముందుకు రాలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు సమీకరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పథకాలఉఎ కొనసాగాలంటే విద్యావేత్తలు మేధావులు ఎన్డీయే కూటమికి మద్దతు పలకాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆలపాటి అపార అనుభవం ఉపాధ్యాయులకు మేలు జరుగుతుంది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు,కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనుభవం ఉపాధ్యాయులకు మేలు జరుగు తుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రచారంలో బాగంగా పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలైన వికాస్ స్కూల్, విట్, కాకతీయ, చార్లెస్ కాన్వెంట్ విద్యాసంస్థలలో ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం సాధించేవిధంగా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి,జనసేన నాయకులు రాజారమేష్,టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కరిముల్లా, సమద్‌ఖాన్, మద్దుమాల రవి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటి విజయం కోరుతూ తెదేపా నాయకులు ప్రచారం

చిలకలూరిపేటటౌన్,ఫిబ్రవరి19,ప్రభాతవార్త: ఉమ్మడి గుంటూరు,కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని పండరీపురంలో ఓయాసిస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మను కెజె ఆసుపత్రిలో కలసి కరపత్రాన్ని అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈదర వెంకట్రావు, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

## గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ



**చిలకలూరిపేట,ఫిబ్రవరి19ప్రభాతవార్త :** పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థ జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వేలూరు రోడ్‌లోని 75 గంగిరెద్దుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న విశ్రాంత అదాయపు పన్ను అధికారి యద్ల అయ్యన్న మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి బి రాజేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేద ప్రజల కుటుంబాలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు అందచేయడం అభినందనీయమని అన్నారు. సంస్థ డైరక్టర్, న్యాయవాది దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ పలు సేవాకార్యక్రమాలు సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్నామని ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో ఉన్న పేదలకు సహాయం చేయడమే తమ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గేరా యాకోబు, .జె మల్లిబాబు, వి చంద్రం, దార్ల బుజ్జిబాబు, షేక్ బాజీ, బెజ్జం రవి, కుంగ్‌ఫూ మాష్టర్ విక్రం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంఈఓ ఎ శ్రీనివాసరావును సన్మానించిన ఎస్‌టియు నాయకులు



**చిలకలూరిపేట,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండల విద్యాశాఖాధికారిగా నూతనంగా భాద్యతలు స్వీకరించిన ఎ శ్రీనివాసరావును బుధవారం ఆయన కార్యాలయంలో ఎస్‌టియు నాయకులు కలసి అభినందనలు తెలియచేసి సన్మానించారు. ఈ సందర్భంగా యంఈఓ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ పరిధిలో ఉన్న ఉపాధ్యయులు సంక్షేమం, పాఠశాల పరిరక్షణ కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్‌టియు అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, ఎస్‌టియు నాయకులు వడ్డాని జయప్రకాష్,వినుకొండ అక్కయ్య, అంకమ్మరావు, సాగర్‌బాబు, ఏడుకొండలు, పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్‌యులో ట్రిపుల్‌ఈ కార్యశాల ప్రారంభం



**తాడేపల్లి,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** కెఎల్ డిమ్డ్ యూనివర్సిటీలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్యశాలను ఘనంగా ప్రారంభించారు. డిఎస్టీ,ఏఎన్ఆర్ ఎఫ్,కెఎల్‌యు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాయోజిత అంతర్జాతీయ కార్యశాలను నిర్వ్హిస్తున్నట్లు ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బిఆర్ ప్రకాష్ తెలిపారు.పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ నెక్ట్స్ జనరేషన్స్ ఎనర్జీ అండ్ ఎలక్ట్రిక్ వెహికల ఛాలెంజస్ మరియు హ్యాండ్ ఆన్ అప్లికేషన్స్ అనే అంశంపై టెక్నికల్ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జీ వైస్‌చాన్సలర్ డాక్టర్ రాజశేఖరరావు,ప్రొఫెసర్ విసి డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షమం విభాగం ఇన్‌చార్జీ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,ప్రిన్సిపాల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ టి.రామకృష్ణారావు,ట్రిపుల ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బిఆర్ ప్రకాష్,కార్యశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బిఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఏఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం బిఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ డి.సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అభ్యసించడం ద్వారా నాణ్యమైన ఔషధాలను తయారు చేసే ఉత్తమ ఫార్మసిస్ట్‌లుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి నాలుగు సంవత్సరాల బిఫార్మసీ కోర్సులో ప్రతి పాఠ్యాంశాన్ని ప్రాక్టికల్‌గా నేర్చుకోవాలని డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ సునీత సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నమైనటువంటి ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. కళాశాలలో అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ భార్గవభూషణ్‌రావు, అకడమిక్ డీన్ లక్ష్మిసురేఖ, ప్రిన్సిపాల్స్ మల్లికార్జునరావు, కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయస్వామి తిరునాళ్ళ



**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండలంలోని అచ్చమ్మపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి తిరునాళ్ళ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో వేడుకలను నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజాము నుండే ప్రత్యేక అలంకరణలు, ఆకు పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అభయాంజనేయస్వామిని గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. వేడుకలలో పాల్గొన్న భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేశారు.

## అర్ధరాత్రి నియామకాలపై భాజపా జవాబివ్వాలి

**-కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్**

**పొన్నూరు, ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** భారత ప్రధాన ఎన్నికల అధికారిగా జ్ఞానేశ్ కుమార్‌ను అర్ధరాత్రి నియమించడంలోని ఆంతర్యాన్ని బిజెపి ఈ దేశ ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందే దిలీప్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశ ప్రధానమంత్రి, హోంశాఖామంత్రి వీలున్నప్పుడల్లా ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారన్నారు. భారత సీఈసీ నియామకంలో బిజెపి అవలంభించిన అప్రజాస్వామిక, అనుమానాస్పద వైఖరిపై నిరసన తెలిపారు. భారత 26వ ప్రధాన ఎన్నికల అధికారిగా జ్ఞానేశ్‌కుమార్‌ను నియమించడంలో మోదీ, అమిత్‌షాలు అనేక అప్రజాస్వామిక విధానాలను అవలంభించారన్నారు. 2029వరకు దేశంలో జరిగే ఎన్నికలలో మేలు పొందేలా తమకు అనుకూలంగా ఉండే వ్యక్తిని అర్ధరాత్రి నియమించుకోవడంతో రానున్న రోజుల్లో దేశంలోని అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యపరచి, దేశాన్ని మనువాద, మతతత్వ రాజ్యంగా నిలిపే ప్రయత్నంలో ఈ ఎంపిక దోహదపడుతుందని, లోక్‌సభ ప్రతిపక్ష నాయకునిగా సెలక్షన్ కమిటీలో ఉన్న కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చి, గతంలో ఆర్టికల్ 370రద్దుకు, అయోధ్య రామమందిర తీర్పుకు సహకరించిన వివాదాస్పద జడ్జి జ్ఞానేశ్‌కుమార్‌ను ఇలా అర్ధరాత్రి నియమించి తమ నియంతృత్వానికి హద్దులుండవని మోదీ తెలియజేశారని మండిపడ్డారు.

## బిసి సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బిసి సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. నాయకులు మంగళపురి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శివాజీ మహారాజ్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుద్ధంతో పాటు పరిపాలనా విధానంలో ఆయన అగ్రగన్యునిగా నిలిచారన్నారు. ఎక్కడా పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదన్నారు. ఓడిపోయిన శత్రువుల రాజ్యంలో ఉన్న స్త్రీలకు రక్షణ కల్పించారని తెలిపారు. శివాజీ అన్ని మతాలకు అనుకూలంగా ఉండి రాజ్యాన్ని అభివృద్ధి చేశారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి.భానూజీ, గుంటూరు గోవిందు, గుంజి విజయ్‌కుమార్, కె.దస్తగిరి, అంకమ్మరావు, రత్తయ్య, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.



20-2Pg5.qxd:20-2Pg5.qxd 01/01/01 8:07 AM Page 1



# టారిఫ్‌లలో మినహాయింపులు ఇవ్వలేం..



## ప్రధాని మోడీకి స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## సుంకాలలో ట్రంప్‌ను సమర్థించిన ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** టారిఫ్‌ల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని తాను మోడీతో వెల్లడించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. వీరిద్దరి మధ్య ఇటీవల జరిగిన మీటింగ్‌లో టారిఫ్‌ల గురించి ఆసక్తికర చర్చనడిచింది. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ నేడు వెల్లడించారు. బిలియనీర్ మిత్రుడు ఎలాన్ మస్క్‌తో కలిసి ఆయన నేడు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మనం ఇక్కడ ఏం చేయబోతున్నాం, పరస్పరం పన్నులు విధించుకోబోతున్నామని నేను ఇటీవల మోడీకి చెప్పాను. మీరు ఎంత ఛార్జి చేస్తే నేనూ అంతే విధిస్తా. ఇంతలో ఆయన ఏదో చెప్పయారు. వద్దు, వద్దు నేను దానిని ఇష్టపడను. మీరు ఎంత ఛార్జి చేస్తే నేను అంతే విధిస్తాను అని స్పష్టంగా చెప్పాను. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వాటిపై అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ కూడా ఉంది. ముఖ్యంగా ఆటో మొబైల్ రంగంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై దాదాపు 100 శాతం సుంకాలను విధిస్తుంది. తాజాగా సమావేశంలో ట్రంప్ పక్కనే కూర్చొన్న మస్క్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అవును. ఆటో దిగుమతులపై 100 శాతం పన్ను విధిస్తుంది అని ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించారు. దీనికి మరోసారి ట్రంప్ స్పందిస్తూ అవి చాలాచిన్నవి. వాటిని మించిన సుంకాలు విధిస్తుంది. ఇతరులు కూడా అంతే. నేను 25 శాతం పన్నులు విధిస్తే అబ్బో అంత భయంకరంగానా అని అంటారు. అందుకే నేను ఆ మాట ఇక అనను. వారెంత విధిస్తే మనమూ అంతే ఛార్జి చేస్తాం. నాతో ఎవరూ వాదించలేరు. అప్పుడే వారు సుంకాలను నిలిపివేస్తారు అని వివరించారు. పన్ను విషయంలో భారత్‌ను ట్రంప్ తప్పుపట్టడం ఇదే తొలిసారి కాదు. తన తొలి విడత పాలన సమయంలో కూడా ఇండియన్ టారిఫ్ కింగ్ అని వ్యాఖ్యానించేవారు. ఈ సందర్భంగా భారత్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా డబ్బులు ఇవ్వడంపై కూడా ట్రంప్ స్పందించారు. న్యూఢిల్లీ వద్ద చాలా సొమ్ము ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న దేశాల్లో అది ఒకటిగా అభివర్ణించారు.

తనకు భారత ప్రజలు, ఆ దేశ ప్రధాని పట్ల చాలా గౌరవం ఉందన్నారు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా? మరి మనదేశంలో ఓటర్ల పరిస్థితి ఎలా ఉందని ట్రంప్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ ఇటీవల వాషింగ్టన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా భారత్, అమెరికా వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.



# సంగమం నీరు తాగేందుకు సరైనదే!

## అసెంబ్లీలో సిఎం యోగి ఆదిత్యనాథ్

**లక్నో, ఫిబ్రవరి 19:** త్రివేణి సంగమంలో నీటిలో ఫేకాల్ బ్యాక్టీరియా ఉందని, కోలిఫామ్ పూర్తి స్థాయిలో ఉన్నందున తాగేందుకు ఎట్టిపరిస్థితుల్లోను పనికిరాదన్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. మహాకుంభ్‌లోని వివిధ ప్రాంతాల్లోని గంగా యమున సరస్వతి త్రివేణి సంగమం నీటిపై దుష్ప్రచారం తగదని అన్నారు. ఎలాంటి కలుషిత జలాలు కావని తాగేందుకు పనికిరావనడం కేవలం దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో బ్యాక్టీరియా ప్రచారంపై సిఎం యోగి స్పందించారు. అంతకుముందే నేషనల్‌గ్రీన్ ట్రిబ్యునల్ పూర్తిస్థాయిలో కోలిఫామ్, ఫేకాల్ బ్యాక్టీరియా ఉన్నందున తాగేందుకు సంగమం నీళ్లపనికిరావని ప్రకటించింది. శుద్ధిచేయని మురుగుజలాలను గంగా యమునా నదుల్లోకి వదిలిపెడుతున్నారన్న పిటిషన్లను విచారించిన ఎన్జీటీ తాగేందుకు పనికిరావని వెల్లడించడంపై సిఎం యోగి ఖండించారు. కేంద్ర కాలుష్య నివారణ మండలి నివేదికను ఎన్జీటీకి అందచేసింది. గతనెల 12,13 తేదీల్లో చేసిన సర్వేలో ఈ జలాలు కనీసం స్నానంచేసేందుకు సైతం పనికిరావని, తాగేందకు అసలే పనికి రావని కాలుష్య జలాలని వెల్లడించింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వీటిపై స్పందిస్తూ కొందరు వీటిపై దుష్ప్రచారంచేస్తున్నారని, 56.25 కోట్లమంది నేటికి పుణ్యస్నానాలుచేసారని ఇలాంటి నిరాధార ఆరోపణలు తగదని సనతాన ధర్మం, గంగా మాత, భారత్ లేదా మహాకుంభ్‌పై దుష్ప్రచారాలు మానుకోవాలని 56 కోట్లమంది భక్తుల నమ్మకాలను వంచించినట్లే అవుతుందని ఆయన అన్నారు.

తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు తమ ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం శక్తి వంచనలేకుండా సాయం చేస్తుందని అన్నారు. ఈసంఘటనను రాజకీయం చేయడం తగదని అన్నారు. మహాకుంభ్ ప్రారంభంనుంచే రాజకీయాలు ప్రారంభించారని అన్ని పార్టీలతో చర్చించామని, సలహాలు సూచనలు కూడా తీసుకున్నామని చెప్పారు. అయితే మీరు మాత్రం సభను ముందుకు నడింపించేందుకు ఇష్టంలేదన్నట్లుగా ఉన్నారని మండిపడ్డారు. కొందరు ఫాల్తూ కుంభ్ అని, మహాకుంభ్‌పై ఇంతపెద్ద మొత్తం ఎందుకు ఖర్చుచేసారని ఒకరు, మృత్యుకుంభ్ అని మరొకరు ఇలా అన్‌పార్లమెంటరీ పదజాలంతో పోస్టులు పెడుతున్నారని ఎంతమాత్రం తగదని యోగి అన్నారు.



# గగన్‌యాన్-జి1 కోసం సి32 దశ మోటార్ ఇంజన్ సిద్ధం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఇస్రో గగన్‌యాన్ ప్రయోగంకోసం ముందస్తు పరీక్షలు ఒక్కొక్కటి పూర్తి చేస్తోంది. ఈ ప్రాజెక్టులో కీలకమైన క్రయోజనిక్ దశను మరింత అభివృద్ధి చేసినట్లు ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. ఇంతకు ముందు సి25 దశగా ఉన్న ఈ కీలక దశను సి32గా మరింత అభివృద్ధి చేసింది. గగన్‌యాన్‌కు సంబంధించి ముందస్తు మానవ రహిత ప్రయోగాల్లో కూడా సి32 దశను ఉపయోగిస్తారు. గతంలో ఎల్‌విఎం3లో సి25ను ఉపయోగించే వారు. అంటే అందులో 25 టన్నుల క్రయోజనిక్ ఇంజన్‌ను వాడుతున్నారు. ఇప్పుడు ఏడు టన్నుల అధిక బరువుతో సి32 పేరుతో ఈ మూడవ దశను అభివృద్ధి చేశారు. హెచ్ ఎల్‌విఎం3లోని అన్ని దశలను మిగిలిన సాంకేతిక వ్యవస్థలను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకుపోతున్న శాస్త్రవేత్తలు శ్రీహరికోట నుంచి త్వరలోనే మానవ రహిత ప్రయోగానికి సిద్ధమవుతున్నారు.

# మృత్యుకుంభ్ విమర్శలపై అసెంబ్లీలో సిఎం యోగి వివరణ



### నేటికి 56.25 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసారని వెల్లడి

### మమతా బెనర్జీ మృత్యుకుంభ్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు

### బెనర్జీ వ్యాఖ్యలకు పరోక్ష మద్దతుపలికిన ఉత్తరాఖండ్ మఠాధిపతి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** మహాకుంభ్ కాదు అది మృత్యుకుంభ్ అంటూ పశ్చిమ బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీచేసిన విమర్శలకు ఉత్తరాఖండ్ మఠాధిపతినుంచి మద్దతు లభించింది. మహాకుంభ్‌ను ఆరాధిస్తాం, పవిత్ర గంగామాతను గౌరవిస్తా. ఎలాంటిప్రణాళిక లేదు. ఇప్పటివరకూ ఎన్ని మృతదేహాలు రికవరీచేసారు. ఇది మహాకుంభ్‌కాదు మృత్యుకుంభ్ అని మమతా బెనర్జీ విమర్శించారు. అయితే బిజెపి కేడర్, కేంద్రంలోని నాయకులు కూడా మమతా బెనర్జీ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి మహరాజ్ మాత్రం బెనర్జీ వ్యాఖ్యలను సమర్థిస్తూ వ్యాఖ్యలు చేసారు. మహాకుంభ్ నిర్వాహకులకు ప్రణాళిక లేదని, రద్దీనిర్వహణ, పర్యవేక్షణ ప్రక్రియ లేకపోవడంవల్లనే ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకుందని అన్నారు. మమతా వ్యాఖ్యలకు ప్రత్యక్షంగా మద్దతివ్వనప్పటికీ ఆమెచేసిన వ్యాఖ్యలకు సానుకూలంగానే ఉత్తరాఖండ్ మఠాధిపతి వ్యాఖ్యలుచేసారు. 300 కిలోమీటర్లవరకూ ట్రాఫిక్ జామ్ ఉందని ఇది యాజమాన్య లోపం కాక మరేమిటి? 25నుంచి 30 కిలోమీటర్లు తమ లగేజితో నడిచి వెళ్లాల్సి వచ్చింది. మురుగునీరుతో కలిసి పవిత్రస్నానంచేసే జలాలు కలుషితం అయ్యాయి. శాస్త్రవేత్తలు కూడా ఫేకాల్ బ్యాక్టీరియా ఉందని తాగేందుకు కూడా పనికిరాదని చెపుతున్నారని జగద్గురు గుర్తుచేసారు. మురునీరువచ్చే కాలువలను మళ్లించాల్సి ఉందని దీనితోప్రజలకు స్వచ్ఛమైన నీరు లభిస్తుందని, 12 ఏళ్లక్రితం మహాకుంభ్ జరిగిందని, మళ్లీ 12 ఏళ్లకు వస్తుందని ఈలోపు మీరు ఎందుకు సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారని జగద్గురు కుంభ్ నిర్వాహకులను ప్రశ్నించారు. పరిమిత విస్తీర్ణంలో లెక్కకుమించిన జనాభాను ఎలా అనుమతిస్తారని, అందువల్లనే రద్దీపర్యవేక్షణ, నియంత్రణ, ఆతిథ్య ఏర్పాట్లు లేకపోవడంవల్లనే దుర్ఘటనలు జరిగాయని, ఈపరిస్థితుల్లో వివిధ పేర్లతో పలువురు విమర్శించినా వాటిని మనం వ్యతిరేకించలేమని స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి అన్నారు. బిజెపి జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి మాట్లాడుతూ మమతా బెనర్జీ సనాతన ధర్మం, హిందువుల పట్ల ద్వేషం వ్యక్తపరిచారని అన్నారు. ఇండియాకూటమి నాయకులు కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదిపార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్‌లకు హిందువులపైనా, సనాతన ధర్మంపైనా విద్వేషం పేరుకుపోయిందని అన్నారు. స్వామి జితేంద్రానంద్ సరస్వతి మాట్లాడుతూ బెంగాల్, జార్ఖండ్, బీహార్, ఒడిశా ఇతర ప్రాంతాలనుంచి వెల్లువలా హిందువులు రావడంతో మమతా బెనర్జీకి అసహనం పెరిగిపోయిందని అన్నారు. బెంగాల్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికలు మమతాకు మృత్యుకుంభ్ లాంటివేనని గుర్తుంచుకోవాలని స్వామి జితేంద్రానంద్ సరస్వతి అన్నారు.

**మమతా వ్యాఖ్యలపై సిఎంయోగి ధ్వజం**

ఇదిలా ఉంటే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై యోగి ఆదిత్యనాథ్ వివరణ ఇస్తూనే బెనర్జీ వ్యాఖ్యలను నిశితంగా విమర్శించారు. మృత్యుకుంభ్ అని పేర్కొనడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. నేటికి 56.25 కోట్లమంది మహాకుంభ్‌లో పవిత్రస్నానాలు ఆచరించారని, త్రివేణిసంగమంలో ఫేకాల్ బ్యాక్టీరియా ఉన్నదనడం కూడా వాస్తవం కాదని గతనెల 29 సంఘటన దురదృష్టకరమని బాధితులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని వారికి పూర్తి భరోసా కల్పిస్తామని అన్నారు. విపక్షాలుచేస్తున్న వ్యాఖ్యలు ఇప్పటివరకూ పుణ్యస్నానం ఆచరించిన 56 కోట్లమంది భక్తులను అవమానించినట్లేనని అన్నారు. మహాకుంభ్ సంఘటన రాజకీయం చేయడం తగదని ఈశతాబ్దంలో మహాకుంభ్ వంటి పవిత్రవేడుకను నిర్వహించడం రాష్ట్రబిజెపి ప్రభుత్వానికి కలిసివచ్చిన అదృష్టం అన్నారు.

# యుపి జైళ్లలోని ఖైదీలకూ సంగమం పుణ్యస్నానాలు

## పవిత్రజలాలను జైళ్లకు తీసుకెళ్లి ఖైదీలకు ఛాన్స్ ఇస్తామన్న మంత్రి

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 19:** కుంభమేళాలో పవిత్రస్నానం చేయాలనుకుంటున్న ఖైదీలకోసం ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లుచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 75 జైళ్లలోని 90వేలకు పైగా ఉన్న ఖైదీలకు గంగా జలాలతో స్నానం చేసే అవకాశం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలోని పవిత్రజలాలను సేకరించి ఈనెల 21న ఆయా జైళ్లకు తీసుకువెళతామని అధికారులుచెప్పారు. జైళ్లలో ఉన్న నీటితో గంగాజలాలను మిశ్రమం చేసి పవిత్రస్నానాలకు అవకాశం ఇస్తామన్నారు. ఆతర్వాత పూజలు, ఇతర క్రతువులు చేసేందుకు కూడా ఏర్పాట్లుచేస్తున్నట్లు జైళ్లశాఖమంత్రి దారాసింగ్ చౌహాన్ తెలిపారు. ఈకార్యక్రమంలో తానుకూడా పాల్గొంటానని తెలిపారు. కుంభ్ మేళాలో పాల్గొనాలనుకునేఖైదీలకోసం చరిత్రలో తొలిసారి ఇలాంటి కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామన్నారు. కాగా ఇప్పటివరకూ మహాకుంభ్ నగర్‌లో 56.25 కోట్లమంది పుణ్యస్నానాలు చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలోనే ప్రకటించారు.

# ఢిల్లీ పోలీసులను అరెస్టు చేసిన యుపి పోలీస్

**లక్నో, ఫిబ్రవరి 19:** ఒక మోసం కేసులో దర్యాప్తు కోసం ఉత్తరప్రదేశ్‌కు చేరిన ఢిల్లీపోలీసులను యుపి పోలీసులు అరెస్టుచేసారు. ఈకేసులో ఇద్దరు యూపికానిస్టేబుళ్లతోపాటు మరో వ్యక్తిని ఢిల్లీపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం తెలిసిన యుపి పోలీసులు రంగంలోకి దిగారు. ఢిల్లీ పోలీస్‌బృందాన్ని అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1.5 కోట్లమోసం కేసులో దర్యాప్తుకోసం ఢిల్లీపోలీసులు యుపిలోని లలిత్‌పూర్‌కు చేరుకున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా లలిత్‌పూర్‌స్టేషన్‌లోకి వెళ్లారు. యుపికి చెందిన పోలీస్‌కానిస్టేబుల్స్ విశ్వజీత్, సచిన్ అవస్థిని వారి క్వార్టర్లనుంచి అదుపులోకితీసుకోగా మరో నిందితుడు బిక్కీరాజాను ఆతడి ఇంటినుంచి తెచ్చి అరెస్టుచేసారు. లలిత్‌పూర్ పోలీసులకు సమాచారం తెలిసి ఢిల్లీబృందాన్ని మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఢిల్లీపోలీస్ ఇన్‌స్పెక్టర్ దర్శన్‌సింగ్‌తో సహా ఆపోలీస్‌బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి లిఖితపూర్వక ఉత్తర్వులు అధికారిక అనుమతి లేకుండాపోలీస్ కానిస్టేబుల్స్‌ను అరెస్టుచేయడంపై రోజంతా విచారణజరిపారు. చివరకు క్షమాపణలు చెప్పిన తర్వాత ఢిల్లీపోలీస్ బృందాన్ని విడిచిపెట్టారు.

# అధ్యక్ష ఎన్నికల సర్వేలో జెలెన్‌స్కీకి 57% రేటింగ్!



**క్యీవ్, ఫిబ్రవరి 19:** ఉక్రెయిన్‌లో అధ్యక్ష ఎన్నికలంటూ నిర్వహిస్తే ప్రస్తుత అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీకి 57శాతం ఆమోదం లభించినట్లు పోల్ సర్వేలు వెల్లడించాయి. బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జెలెన్‌స్కీ రేటింగ్ కేవలం నాలుగుశాతం మాత్రమేనని చెప్పిన వెంటనే బయటకు వచ్చిన ఈ పోల్‌షర్వే నివేదికలో జెలెన్‌స్కీకి 57శాం ఆమోదం లభించింది. క్యీవ్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ ఆధ్వర్యంలో వెయ్యిమందిని పోన్ సర్వేచేసారు. ఈ సర్వేలో స్పందించిన వారు జెలెన్‌స్కీకే మద్దతుపలికారు. 37శాతం మంది ప్రతికూలంగా స్పందించగా మిగిలివారు ఎటూ తేల్చలేకపోయారు. గత డిసెంబరులో నిర్వహించినపోల్ సర్వేకంటే ఐదుశాతం ఎక్కువ మద్దతును జెలెన్‌స్కీ సాధించగలిగారు.

మిలిటరీ సైనిక చర్యలు కొనసాగుతున్నా, రష్యా దండయాత్రను ధీరోధాత్తంగా ఎదుర్కొనడం పట్ల ఉక్రెయిన్ ప్రజలు జెలెన్‌స్కీని కొనియాడుతున్నారు. 2022 మార్చిలో అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడికి రేటింగ్ 90శాతంవరకూ పెరిగింది. రష్యా దండయాత్ర చేస్తునప్పటికీ ఈ సోషియాలజీ సంస్థనిర్వహించిసర్వేలో జెలెన్‌స్కీ అత్యున్నతస్థాయి రేటింగ్ పొందారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ జెలెన్‌స్కీ ఆదేశానికి సరైన అద్యక్షుడు కాదనిచేసిన వ్యాఖ్యలు, అమెరికా అద్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఈసర్వే చెక్‌పెట్టినట్లయింది.

అయితే ఉక్రెయిన్ వాసులు మాత్రంయుద్ధంముగిసిన తర్వాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. తన రేటింగ్ తగ్గిపోయిందని డొనాల్డ్ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపైనా జెలెన్‌స్కీ స్పందించారు. డొనాల్డ్‌ట్రంప్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్‌ప్రభావం ఉందని అన్నారు. పుతిన్ ఇచ్చే తప్పుడు సమాచారంపైనే స్పందిస్తున్నారని జెలెన్‌స్కీ రాజధాని క్యీవ్‌లో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ట్రంప్ చెపుతున్న గణాంకాలు రష్యానుంచి వచ్చినవేనని అన్నారు. యుద్ధవిరమణకు జరుగుతున్న చర్చల్లో ఉక్రెయిన్ లేకుండా రష్యాతో చర్చలేమిటని యూరోపియన్ దేశాలు కూడా అమెరికాపై మండిపడుతున్నాయి.

# రెండు గంటల్లో 3వేల టిక్కెట్లు ఎలా ఇచ్చారు?



## పరిమితికిమించి ఎందుకు టిక్కెట్లు అమ్మారు?

## రైల్వే, కేంద్రంపై ప్రశ్నలు కురిపించిన హైకోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** అంతపెద్దరద్దీ ఉన్న స్టేషన్‌లో ప్రణాళికాబద్ధంగా టికెట్లను ఇవ్వకుండా ఎందుకు అదనంగా టికెట్లు మితిమీరి పరిమితికిమించి ఇచ్చారని ఢిల్లీ హైకోర్టు కేంద్రం, రైల్వేశాఖలపై ప్రశ్నల వర్షం కురిపించింది. చీఫ్‌జస్టిస్ డికె ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్‌రావు గేదెల నేతృత్వంలోని బెంచ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం పిటిషన్ విచారణచేస్తూ రైల్వేల్లో భద్రతా చర్యలు కొరవడటం వల్లనే ఇలాంటి విషాదకర సంఘటనలు జరుగుతున్నాయని, రైల్వే చట్టాన్ని ఎందుకు ప్రయోగించలేదని ప్రశ్నించారు. ఈ చట్టం ప్రకారం పరిమితికి మించి ఒక కోచ్‌లో ప్రయాణాలుచేస్తే ఆరునెలల జైలు విధించాలని ఉందని, ఇదే నిబంధన సెక్షన్ 147 ప్రకారం వెయ్యిరూపాయల జరిమానా కూడా విధించాలని అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైల్వేచట్టం అమలుచేసారనటానికి మీవద్ద ఆధారాలేమి ఉన్నాయి, మీరు చేపట్టిన చర్యలు ఏమిటి. కోచ్‌లలో ప్రయాణీకుల పరిమితులను ఎందుకు నిర్ణయించలేదు. అనుమతిలేకుండా కోచ్‌లలోకి వస్తున్న వారిపై జరిమానాలు ఎందుకు విధించడంలేదని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

రైల్వే చట్టంలోని వివిధ సెక్షన్లు ఉపయోగించాల్సి ఉండగా ఎందుకు అలా చేయలేదని, రైల్వే అధికారులు కూడా చట్టపరిధిలో కోచ్‌కు నిర్దిష్టమైన సంఖ్యలోప్రయాణీకులను అనుమతించాల్సి ఉందిపోయి చేష్టలుడిగిచూస్తుండిపోయారు దేనికని ప్రశ్నించింది. కోచ్‌లో ఉన్న సీట్లకు మించి బెర్త్‌ల సంఖ్యకు మించి టికెట్లు ఎందుకు విక్రయించారని ఆయన ప్రశ్నించారు. రైల్వేలతరపున వాదనలు వినిపించిన సొలిసిటర్‌జనరల్ తుషార్‌మెహతా కోర్టు మార్గదర్శకాలను అంగీకరించారు.

రైల్వే బోర్డు ఈ పరిస్థితులను కట్టడిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. తదుపరి విచారణను మార్చి 26వతేదీ నిర్వహిస్తామని బెంచ్‌ప్రకటించింది. 11 మంది మహిళలు, ఐదుగురు చిన్నారులతో మొత్తం 18 మంది ఈ తొక్కిసలాటలో చనిపో యారు. రెండుగంటల్లోనే మూడువేల టికెట్లు విక్రయించడం వల్లనే తొక్కిసలాటకు ఎక్కువ ఆస్కారం ఏర్పడిందన్నారు.

# సిఇసి, ఇసి నియామకాలపై విచారణ పిటిషన్ వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించినచట్టం చెల్లుబాటును సవాల్‌చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదావేసింది. సిఇసి, ఇసిల నియామక ప్యానెల్‌లో గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం ఉండేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సిజెఐని తొలగించి ఆ స్థానంలో కేంద్ర న్యాయశాఖమంత్రికి చోటు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లుప్రవేశపెట్టి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. కొత్తచట్టాన్ని సవాల్‌చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సిఇసి, ఇసిల నియామకాలకు వ్యతిరేకంగా దాఖలయిన పిటిషన్లపై ఈనెల 19న విచారిస్తామని కోర్టు ప్రకటించింది. పిటిషన్‌పై విచారణలో ఎడిఆర్ తరపున హాజరైన సీనియర్‌న్యాయవాది ప్రశాంత్ భూషణ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్ బెంచ్ ముందు వాదనలు వినిపించారు. ప్యానెల్‌నుంచి సిజెఐని తొలగించి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేయాలని అన్నారు. పిటిషనర్ జయతాకూర్ తరపున హాజరైన న్యాయవాది వరుణ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం కొత్తచట్టం పరిధిలో నియామకాలుచేపడుతోందని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్‌కుమార్‌ను నియమించిన సంగతి తెలిసిందే. సిఇసి రాజీవ్ కుమార్ మంగళ వారం పదవీ విరమణచేయగా బుధవారం భారత 26వ సిఇసిగా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలుస్వీకరించారు. సిఇసి నియామకంలో కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. చట్టంపై సుప్రీంకోర్టులో సవాల్‌చేసిన సమ యంలో అర్ధరాత్రి కొత్త సిఇసిని నియమిం చడంపై తీవ్ర నిరసన తెలిపింది.

# ఫిలిప్పీన్స్ విమానాన్ని భయపెట్టిన చైనా హెలికాప్టర్!



**బీజింగ్, ఫిబ్రవరి 19:** ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ విమానం సమీపంలోకి చైనా నేవీకి చెందిన హెలికాప్టర్ వచ్చింది. ఒక దశలో రెండూ ఢీకొంటాయని భయడాల్సిన స్థితి నెలకొంది. ఈ ఘటన స్కార్‌బోర్గ్ షోల్ సమీపంలో చోటు చేసుకుంది. వాస్తవానికి ఫిలిప్పీన్స్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో ఉన్న ఈ ప్రదేశం తమదేనని చైనా 2012 నుంచి తమ ఆధీనంలో ఉంచుకొంది. తాజాగా ఫిలిప్పీన్స్ బ్యూరో ఆఫ్ ఫిషరీస్‌కు చెందిన సెస్నా కారవాన్ శ్రేణి సింగిల్ ఇంజిన్ విమానం అసోసియేటెడ్ ప్రెస్ రిపోర్టర్‌ను తీసుకుని ఈ మార్గంలో ప్రయాణమైంది. హఠాత్తుగా వీరిని చైనా నేవీకి చెందిన హెలికాప్టర్ వెంబడించడం మొదలుపెట్టింది. దాదాపు 30 నిమిషాలపాటు ఇది నడిచింది. ఈ క్రమంలో ఫిలిప్పీన్స్ విమానం పైలెట్, చైనా హెలికాప్టర్ పైలట్‌ను ఓ దశలో హెచ్చరించాడు. మీరు మరీ సమీపంలోకి వస్తున్నారు. అది అత్యంత ప్రమాదకరం. మా విమానంలోని ప్రయాణికులు, సిబ్బందికి ప్రాణాంతకం అని పేర్కొన్నారు. ఒక దశలో విమానానికి కేవలం 10 అడుగుల దూరంలోకి హెలికాప్టర్ వచ్చింది. ఈ ఘటనపై అమెరికా రాయబారి మారీ కై కార్ల్‌సన్ స్పందిస్తూ దుందుడుకు చర్యలకు దూరంగా ఉండాలని, విభేదాలకు అంతర్జాతీయ చట్టాలను అనుగుణంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి అని సూచించారు. తమ సముద్ర జలాలకు సమీపంలోకి వచ్చిన విదేశీ విమానలను వేధించడం చైనాకు కొత్తేమీ కాదు. గతవారం ఆస్ట్రేలియాకు చెందిన పి 8 విమానం దక్షిణ చైనా సముద్రంపై నుంచి ప్రయాణించింది. అప్పుడు చైనాకు చెందిన ఫైటర్ జెట్లు దానిని వెంబడించి సుమారు 100 అడుగులు దగ్గరకు వచ్చాయి. అనంతరం నిప్పులు విరజిమ్మాయి. ఒకవేళ పొరపాటున ప్లేయర్లు పి-8 ఇంజిన్‌లోకి వెళితే పెను ప్రమాదం జరిగేది. దాదాపు 13 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలోకి దక్షిణ చైనా సముద్రం మొత్తం తనదేనని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. తన ప్రధాన భూభాగం నుంచి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలోని దీవులను చైనా వదలడంలేదు. దీంతో ఫిలిప్పీన్స్, మలేసియా, తైవాన్, బ్రూనై, వియత్నాంతో వివాదాలు జరుగుతున్నాయి.

# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనాను దేశంలోకి రప్పించడమే ప్రధాన లక్ష్యం

## యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం!

**ఢాకా, ఫిబ్రవరి 19:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఓ ఉగ్రవాది అంటూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. హసీనా వ్యాఖ్యలపై ఢాకా ప్రభుత్వం స్పందించింది. భారత్‌లో ఆశ్రయం పొందున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానిని తమ దేశంలోకి రప్పించడమే తమ అత్యంత ప్రధానమైన లక్ష్యమని యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం పేర్కొన్నారు. హసీనాను న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సి ఉందని ఆమెను తమకు అప్పగించాలని భారత్‌ను కోరుతున్నామని అన్నారు. ఇందుకు ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లోని హసీనా అవామీలీగ్ పార్టీని రాజకీయాల్లో కొనసాగించాలా, వద్దా అనే విషయాన్ని దేశ ప్రజలు, రాజకీయ పార్టీలు నిర్ణయిస్తాయని అన్నారు. అయితే ఆమె అధికారంలో ఉన్న సమయంలో జరిగిన హత్యలు, అదృశ్యాలు, ఇతర నేరాలకు పాల్పడినవారు తప్పకుండా శిక్ష అనుభవించి తీరుతారని అన్నారు. హసీనా దేశ ప్రధానిగా ఉన్న సమయంలో అధికారం చేజారకూడదనే ఉద్దేశంతో నిరసనకారులను హతత్య చేసినట్లు దాడులు జరిపినట్లు ఐక్యరాజ్యసమితి పేర్కొన్న నివేదికలను ఆయన ఉదహరించారు.

20-2Pg6exHMNWJQE.qxd:20-2Pg6exHMNWJQE.qxd 01/01/01 10:06 AM Page 1



# ఇకపై పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్

## - ప్రక్షాళనకు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు

**విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో లోపాలను గుర్తిస్తూ మరింత మెరుగైన సేవలందించేందుకు డిఎస్‌ఓలు, డిఎం లు సిద్ధంగా వుండాలని రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు మరియు వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరులోని సివిల్‌సప్లై భవన్లో మంత్రి అధ్యక్షతన బుధవారం జరిగిన సివిల్ సప్లై అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అధికారులంతా టీం స్పిరిట్‌తో ప్రజలకు జవాబుదారీ తనం పెంచేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా సమస్య వస్తే సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ రెండూ కలిసి ఒకే నిర్ణయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ధాన్యంకొనుగోలు ప్రారంభించిన తరువాత మిల్లర్లకు కాకుండా రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్ముతున్నారన్నారు. ఇప్పటివరకు 5.21లక్షల మంది రైతుల నుండి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రు.7,522 కోట్లు విడుదల చేశామన్నారు. 24 గంటల్లోనే రు.7,508 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. ధాన్యం సేకరణలో 30వేల లారీల ద్వారా 37వేల మంది హమాలీలు ధాన్యం సేకరణలో పాల్గొన్నారన్నారు. 7337359375 నెంబర్‌కు వాట్సప్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. దీపం 2 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. రు.714. 75 కోట్లు నగదు లబ్దిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. డెలివరీ బాయ్‌లు అదనపు చార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఈ ఆఫీస్, ఈ ఫైల్‌కు పటిష్టవ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎండియు వాహనాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వచ్చే అడకమిక్ ఇయర్ నుండి మిడ్‌డే మీల్స్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ళకు పౌరసరఫరాల శాఖ నుండి సన్నబియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందిస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమీషనర్ సౌరబ్‌గౌర్, ఎండి మనజీర్ జిలానీ, అన్ని జిల్లాల సివిల్‌సప్లై, తూనికలు, కొలతలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

## - గుంటూరు మిర్చి యార్డు పర్యటన పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారు

## - మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి



**ఒంగోలు, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి రైతులను కలిశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, మిర్చి యార్డులోకి అనుమతి లేదని అధికారులు చెప్పినప్పటికి లెక్కచేయకుండా ప్రవర్తించారని రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. బుధవారం ఒంగోలు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నవోదయం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో 14వేల మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డు పర్యటన పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. రైతుల ఆత్మహత్యలు దేశంలో ఏపీని మూడో స్థానంలో జగన్ నిలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో ఎన్నికల కోడ్ ఉందని చెప్పినా జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి యార్డుకు వెళ్లారన్నారు. దుర్మార్గమైన కార్యకలాపాలతో రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో నిలిపివేసిన పోలవరం పనులు, సీఎం చంద్రబాబు పరుగు తీయిస్తున్నారని తెలిపారు. దళితుడు సత్యవర్ధన్‌పై దాడి ఘటనలో నిందితుడు అయిన వల్లభనేని వంశీని జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారని, పోలీసులను ,అధికారులను బయపెట్టే విధంగా జగన్ మాట్లాడారని అన్నారు. ఐదేళ్ల చేసిన దుర్మార్గ కార్యక్రమాల వల్ల బట్టలు ఊడదీసి 11 సీట్లు ఇచ్చారని, ఇలాగే ఉంటే 11 సీట్లు కూడా రావంటూ ఎద్దేవ చేశారు. జగన్‌కు రెడ్‌బుక్ ఫోబియో పట్టుకుందన్నారు. రెడ్‌బుక్ పేరు వింటే నాయకులకు తడిసిపోతుందని అన్నారు. రెడ్‌బుక్ తెరిస్తే ప్రభుత్వం వచ్చిన నెలలోనే వైసీపీ నాయకుల ఇళ్లల్లో ఉండేవాళ్లు కాదన్నారు. జీవితాన్ని ఇచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని వంశీ తగలబెట్టారని విమర్శించారు. సత్యవర్ధన్‌ను వంశీ, ఆయన అనుచరులు బెదిరించి తీసుకెళ్తున్నా వీడియోలు బయటకు వచ్చాయన్నారు. మద్యం విధానంలో దందాలు చేసి తాడేపల్లె ప్యాలెసుకు లక్ష కోట్లు నిధులు మళ్లించారని ఆరోపించారు. మద్యంలో జరిగిన అక్రమాలపై సిట్ వేస్తే తాడేపల్లి ప్యాలెస్ వద్ద ఫైల్స్ అన్ని తగలబెట్టారని అన్నారు. జగన్ అక్రమ మద్యం విధానం వల్ల లక్ష మంది లివర్, కిడ్నీ వ్యాధుల భారిన పడ్డారని వెల్లడించారు. జగన్ విపరీతంగా మద్యం ధరలు పెంచడంతో నాటు సారాకు అలవాటు పడ్డారని అన్నారు. నాటుసారా నివారణ కోసం నవోదయం కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్ల దోపిడి కోసం జగన్ పాలసీ తీసుకువస్తే, ప్రజల ఆరోగ్యం కోసం ఎక్సైజ్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టు విషయంలో జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయస్వామి అన్నారు. జగన్‌కు ఆ 11 సీట్లు కూడా ఈసారి రావని ఎద్దేవ చేశారు. వైసీపీకి చెందిన దళిత నాయకులు జైల్లో ఉంటే, జగన్ వెళ్ళలేదని అన్నారు. గుంటూరులో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఆయన మిర్చి యార్డుకు వెళ్లి జగన్ న్యూసెన్స్ చేశారని మంత్రి మండిపడ్డారు. రైతులపై ప్రేమ ఉన్నట్లు జగన్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతు భరోసా నిధులు కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వంలో జగన్ మోసం చేశారని ఆయన ఆరోపించారు. రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకుంది ఎన్డీఏ ప్రభుత్వం అని ఆయన వెల్లడించారు. జగన్ ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు నమ్మరని అన్నారు. అన్ని విధాలుగా జగన్ తిరస్కరణకు గురయ్యారు కాబట్టి రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన జగన్‌ను , ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని మంత్రి డిమాండ్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలను కూడా జగన్ అసెంబ్లీకి పంపడం లేదని అన్నారు. గతంలో అసాంఘికంగా చెలరేగిన వారిపై వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా అరెస్టులు జరుగుతున్నాయని చెప్పారు. పోలీసులను బట్టలు ఊడదీసి కొడతామని జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సప్తసముద్రాలు జగన్ దాటాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలన్నారు. సప్త సముద్రాలు దాటే శక్తి జగన్‌కు లేదని, జగన్ పని అయిపోయిందని అన్నారు. జగన్‌కు మళ్లీ అధికారం అందని ద్రాక్ష అని ఎద్దేవ చేశారు.



# శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మార్పులు - ఎంఆర్ వితరణతో శాశ్వత లైటింగ్

### ప్రభాతవార్తతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖాముఖి

**(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి) పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. తిరుపతిజిల్లాలోని తిరుపతికి 35 కిలో మీటర్ల దూరంలో వెలసిన ఈ దివ్యక్షేత్రంలో శివరాత్రిని బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ దివ్యక్షేత్రం రూపురేఖలు 1989లో ప్రస్తుత శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాం నుంచి ప్రారంభం అయ్యింది. అయన ఆదాయ వనరులను పెంచుటకు కృషి చేస్తే ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దటమే కాకకుండా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వేదికగా పలు సంస్కరణలు చేపట్టారు. ఆయన తో 'ప్రభాతవార్త' కలిసినపుడు ఆయన ఆలోచనలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే పరిశీలిద్దాం....**

**ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రికి సంబంధించి మీ అభిప్రాయాలేమిటి?

**ఎమ్మెల్యే :** ఆలయం పవిత్రమైనది.ఇక్కడ ఆధ్యాత్మిక చింతన తప్ప మరోకటి ఉండరాదు.అంతేకాక తాను గత కొంత కాలంగా ఇక్కడ చూస్తున్నాను. అడ్డదిడ్డంగా వీధులు,దుకాణాలు, దర్శనాలకు వచ్చేవారిని తప్పుదారి పట్టించటం,ఆలయం ఎటు చూసినా దళారులు, డబ్బులు వసూళ్ళు.ఇక్కడ రాజకీయంగా ఓ దందా నడిచేది. దానిని మార్చటానికి తన వంతు ప్రయత్నం ప్రారంభించాను

**ప్రభాతవార్త** :మార్పులు చేర్పులు ఎలా చేయాలనుకుంటున్నారు?

**ఎంఎల్ఏ** :తాను దేశంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలను సందర్శించాను. అలాగే మన శ్రీకాళహస్తికి సమీపంలోని తిరుమలేశుని సన్నిధిని అధ్యయనం చేసారు. ఏ భక్తుడు అయినా ఆలయానికి అని వచ్చి అడుగుపెడితేనే వారు బయటి ప్రపంచాన్ని మరచిపోవాలి! మానసిక ప్రశాంత కలిగి ఉండాలి.అది ఆలయంలోని కంచుగడప లోపల అడుగుపెడితేనే ఎవరికైనా ఆ అనుభూతి కల్గుతుంది. అలాంటి వాతావరణమే ఆలయం పరిసరాల్లో కల్గించాలన్నది తన లక్ష్యం.

**ప్రభాతవార్త :** అందుకు మీరు తీసుకుంటున్న చర్యలేమిటి?

**ఎంఎల్ఏ** :మొదటి దశగా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను. అందులో ముఖ్యంగా పరిసరాలలో భక్తులు ఇబ్బంది వడకూడదు. 2017లో నాన్నగారు ఉన్నపుడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గారు మాస్టర్ ప్లాన్‌ను ఆదేశించారు.కానీ గత ఐదేళ్ళలో ఆ పథకం కన్సెల్టెన్సిలకే పరిమితం అయ్యింది. మొదటి ప్రయత్నంగా ఆలయ పరిసరాల్లో చక్కటి రోడ్లు, ఆహ్లాదానిచ్చే పచ్చని చెట్లు చక్కటి లైటింగ్ సదుపాయాలతో భక్తుల మనస్సులను ప్రశాంతత కల్పించుటకు చర్యలు తీసుకున్నాను.మాస్టర్‌ప్లాన్‌కు అడ్డంకులను కూడా తొలగించుకుంటున్నాము.

**ప్రభాతవార్త** : ఇప్పటివరకు ఏమైనా ముందడుగు వేసారా?

**ఎంఎల్ఏ** :మీరుచూస్తున్నారు కదా? పట్టణంలో అడుగుపెడుతూనే డివైడర్లను మార్పు చేసాము. చక్కటి చెట్లను ఏర్పాటు చేసాము. అలాగే మన ఆలయ చరిత్రను చాటిచెప్పెవిధంగా డివైడర్ల మధ్య స్థంభాలు వాటిపై నంది విగ్రహాలను ఏర్పాటు చేయిస్తున్నాను. హరితాభివృద్ధికి దేవస్థానం రూ.40లక్షలు మంజూరుచేస్తే తన చేతిది మరో రూ.17లక్షలు పడింది. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చేభక్తులు అడుగుపెట్టిన వెంటనే ఆధ్యాత్మిక చింతన వాతావరణ రావాలి.

**ప్రభాతవార్త** : ఆలయంలో లైటింగ్‌కు ప్రధాన్యత ఇస్తున్నట్లుంది.మీ ఆలోచనలేమిటి?

**ఎంఎల్ఏ** : ఔను! శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏటా గతంలో పరిపాలించిన వారు లైటింగ్ ముసుగులో లక్షలకు లక్షలు దిగమింగుతున్నారు. కానీ తాను హైదరాబాదుకు చెందిన 'ఎంఆర్' నిర్వాహకులను ఒప్పించి రూ.కోటి విరాళంతో శాశ్వత లైటింగ్‌ను తిరుమల తరహాలో ఏర్పాటు చేస్తున్నాను. ఆలయంలోపల సుమారు 295 పిల్లర్లకు,అలాగే బయట 150 పిల్లర్లకు చుట్టుపక్కల ఉన్న నాలుగు గోపురాలకు ఇక శాశ్వత లైటింగ్ ఉంటుంది. ప్రధాన రోజుల్లో లైటింగ్‌తో ఆకట్టుకుంటుంది.

ప్రభాతవార్త :ఈ ఏడాది పూల ముస్తాబులకు సంబంధించి ఏం చర్యలు తీసుకున్నారు?

**ఎంఎల్ఏ** : గతంలోపరిపాలించిన పాలకులు పూల ముస్తాబుల ముసుగులో బెంగుళూరు వాసులచే సొమ్ములు దిగమింగినట్లు రికార్డులు చెబుతున్నాయని అయితే ఈ ఏడాది హైదరాబాదుకు చెందిన ఓ సంస్థతో చేయిస్తున్నామని వారురూ.వంద కోట్లు అయితే తప్ప పనులు చేయరని అలాంటి వారిచే 'కాస్ట్ టు కాస్ట్'కు చేయిస్తున్నాను.

**ప్రభాతవార్త** : ఈ సారి లేజర్ లైటింగ్ అన్నారు.అమలు చేస్తున్నారా?

ఎంఎల్ఏ : చేయగల్గిందే చెబుతాను. ఈ సారి ప్రత్యేక ఆకర్షణ లేజర్ లైటింగ్. ముంబాయికి చెందిన భరత్ లైటింగ్‌చే సుమారు రూ.1.5కోట్లతో చేసే ఏర్పాట్లును అతి తక్కువ ఖర్చు రూ.20లక్షల లోపల లేజర్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాను. ఎలా ఉంటుందో చూడండి.

**ప్రభాతవార్త** : సాంస్కృతిక కార్యక్రమాలను ఎలా ఎంపిక చేసారు?

**ఎఎల్ఏ** : శ్రీకాళహస్తీశ్వరుడు నటరాజు అంటారు. ప్రతి ఏడాది శివరాత్రికి ప్రత్యేంగా 13 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది స్థానిక కళాకారులతో పాటు రాష్ట్ర సాంస్కృతిక చైర్మెన్ తేజశ్రీని సంప్రదించి రాష్ట్ర స్థాయిలో పేరెన్నిక గన్న కళాకారులచే కార్యక్రమాలను నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నాము. పలువురు సినీ ప్రముఖులను కూడా ఆహ్వానించామన్నారు.

**ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన ఆలయంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు? భక్తులకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?

**ఎంఎల్ఏ** : మహాశివరాత్రిలో ఈ ఏడాది ఈ నెల 25 నుంచి 28 వరకు ఎంతో కీలకంగా భావిస్తున్నారు. 25న మధ్యాహ్నం 4.30గంటలకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలను అందిస్తున్నారు. అలాగే మహాశివరాత్రి పర్వదినాన ముగ్గురు మంత్రుల సూచనలను అమలు చేస్తాము.వారు భక్తులకు కల్పించుటకు ఆదేశించిన ఆదేశాలను అమలు చేస్తాము. సామాన్యభక్తులకు పెద్ద పీట వేస్తున్నాము. వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తి కరంగా శివయ్యను దర్శించుకోవాలి. స్వామి గర్భగుడి ముందు ఓ స్వామిలా పీఠాధిపతిలా కూర్చొని దేవుని కన్నా ముందు తన దర్శనం చేసుకునే దుస్థితిని భక్తులకు ఉండదు. చివరగా నేను చెప్పేది వచ్చిన ప్రతి భక్తుడు స్వామిని దర్శించుకొని అభివృద్ధికి ఇంకా తమకు బలం ఇవ్వాలని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

# ముస్లిం బాలికలకు సంప్రదాయ విద్య అవసరం

## జమియతుల్ ఉలమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలాన ఇలియాస్ సాహెబ్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** సమాజంలో ముస్లిం మహిళలకు బాలికల స్థాయి నుంచే సంప్రదాయ విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి రాష్ట్రాల జమియతుల ఉలమ ఉపాధ్యక్షులు మౌలాన ఇలియాస్ సాహెబ్ అన్నారు.బుధవారం ఆయన శ్రీకాళహస్తిలోని జామియా మస్‌జిద్‌లోని బాలుర మద్రసాలోనూ, బాలికల మద్రసాలో ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జామియామస్‌జిద్‌లోని మద్రసాలో 13 సంవత్సరాల బాలుడు 'దివ్యఖుర్‌ఆన్‌ను'కంఠస్థం చేసి వినిపించారు. శ్రీకాళహస్తి చెందిన న్యాయవాది బషీర్ సాహెబ్ తన కుటుంబం నుంచి ఓ చిన్నారిని ఆధ్యాత్మిక చింతనకు నిర్ణయించారు. దివ్యఖుర్‌ఆన్‌లో ప్రతి ఇంటి నుంచి దివ్యఖుర్‌ను పఠించే హాఫీజ్‌లు కావాలన్న పిలుపుతో తన తనయుడు 'హాఫైజా'ను హాఫీజే ఖుర్ ఆన్ చేసారు. రెండేళ్ళ పాటు కఠోర సాధనతో ఆ బాలుడు దివ్యఖుర్ ఆన్‌ను కంఠస్థం చేసి ఉత్తీర్ణులయ్యారు. ఆ బాలునికి అల్లాహ్ దువాను అందిస్తూ సర్టిఫికేటును అందించారు. ఆ బాలునికి జామీయామస్‌జిద్ పేష్‌ఇమాం హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ మెలుకులను నేర్పించారు. ఈ కార్యక్రమాల్లో అతిధి మౌలాన ఇలియాస్‌సాహెబ్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన జిల్లా జమియతుల్ ఉలమ అధ్యక్షులు ముఫ్తీ నయి సాహెబ్,హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ ఆలీ,ముతవల్లి అక్రమ్‌సాహెబ్,ఖాజీ షరీఫ్ అనే మున్నా,అంజద్‌సాహెబ్, గోరా,మీర్జాం సాహెబ్, హాజీ గౌస్ సాహెబ్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో ముఫ్తి నయిం సాహెబ్ బాలికల మద్రసను నిర్వహిస్తున్నారు.ఈ మద్రస వార్షికోత్సవాన్ని ఏర్పాటు చేసారు. ఈ సభకు అతిధిగా విచ్చేసిన మౌలానా ఇలియాస్ సాహెబ్ మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలపై సాగుతున్న దాడులు,దౌర్జాన్యాలు,వేధింపులకు కారణం సంప్రదాయ విద్యపై అవగాహన లేకపోవటం. అంతేకాక మహిళలను ఇంటి పనికి వంట పనికి పరిమితం చేస్తున్నారు.



మదరసాలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇలియాస్ సాహెబ్

# విద్యా నైపుణ్యాలు పెంచేందుకు సింఘానియా ట్రస్టుతో ఒప్పందం

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ విద్యావిధానం లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యా నైపుణ్యాల అభివృద్ధికి సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్టుతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు.ఆయన సమక్షంలో ఈ ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలుత ట్రస్టు తరపున తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయులపనితీరు, శిక్షణ, ఆంగ్లభాష శిక్షణ, జాతీయ విద్యా విధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానంలాంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురానున్నారు. ఐదేళ్లపాటు అమలు చేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. తిరుపతి తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు సింఘానియా స్కూల్ ట్రస్ట సేవలను విస్తరిస్తారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏపీ విద్యా రంగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. సింఘానియా గ్రూపు ఛైర్మన్ గౌతమ్ హరి సింఘానియా మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నిపుణులుగా తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు.

ఉపాధ్యాయులను ఆధునిక సాంకేతికతతో సన్నద్ధం చేయడంతోపాటు డిజిటల్ సాధనాలను ఉపయోగించేలా శిక్షణ ఇస్తామన్నారు.

అనంతరం సింఘానియా గ్రూపు ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ సాంకేతికతతో కూడిన అభ్యసరం, ఆంగ్ల ప్రావీణ్యం పై దృష్టిసారించినట్లు వెల్లడించారు.

# చిన్నశేష వాహనంపై బద్రీనారాయణుడు సరస్వతీదేవీ అలంకరణలో శ్రీనివాసుడు



**చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** పండరీపురం పాండురంగస్వామి వారి అలంకరణలో శ్రీనివాసుడు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు పార్ధసారధి స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి శ్రీవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరించారు. రెండవ రోజున ఉదయం స్వామివారు పండరీపురం పాండురంగస్వామి వారి అలంకరణలో చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పాంచభౌతిక ప్రకృతికి సంకేతం. చిన్నశేష వాహనం పంచభూతాత్మకమైన విశ్వా నికి, అందులో నివ శించే జీవునికి వరాలిస్తుంది. విశ్వం కనిపించే శ్రీవారి ప్రకృతి, విష్ణువు ఈ ప్రకృతికి ఆధారమై నడిపించే శక్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే విశ్వాన్ని రక్షించేందుకు తానొక్కడే చిన్నశేష వాహనంపై విహరిస్తారు. పంచశిరస్సుల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయఃప్రదం. శేషవాహనోత్సవాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వలన కలిగే దుష్ప్రబావాలు భక్తులు కళ్యాణప్రదులై, సుఖశాంతులతో వర్ధిల్లగలరని శాస్త్రాలు వివరిస్తున్నాయన్నారు. ఈ వాహన సేవలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈఓ ఎం.గోపినాధ్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కావలి ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం!

## శ్రీదేవి రచించిన రెండు పాఠ్యపుస్తకాలను ఎంపికచేసిన రాష్ట్ర ప్రభుత్వం



**కావలి,(నెల్లూరు) ఫిబ్రవరి19 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రి కళాశాల ఆంగ్ల (ఇంగ్లీషు) అధ్యాపకురాలు గుంటుపల్లి శ్రీదేవిచౌదరికి అరుదైన గౌరవం లభించింది. ఆమె రచించిన రెండు ఆంగ్ల పాఠ్యపుస్తకాలను ఎ.పి ప్రభుత్వ పౌరగ్రంధాలయశాఖ మంగళవారం ఎంపికచేయడంతో ఆమె కావలి బావుటాను ఎగురవేసినట్లయింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎంతో పేరుప్రఖ్యాతులు గడించి అందరి మన్ననలను పొందారుకూడా. అటు రాజకీయపరంగా, ఇటు ఉన్నత విద్యావంతురాలుగా, ఆంగ్ల అధ్యాపకురాలుగా, ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలకు ఆమె ఎంతోపేరు తెచ్చారు. శ్రీదేవిచౌదరి రచించిన కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్‌స్కిల్స్, బిజినెస్ కమ్యూనికేషన్ అనే రెండు పుస్తకాలను ఎ.పి ప్రభుత్వ పౌరగ్రంధాలయశాఖ 2022-23 విద్యాసంవత్సరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఎంపికచేసింది. ఆ సమావేశంలో ఆమోదం పొందిన పుస్తకాల వివరాలను ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి విడుదలచేసింది. శ్రీదేవిచౌదరి గతంలోనూ అకడమిక్ పుస్తకాలను, నైపుణ్యాభివృద్ధి సంబంధిత పుస్తకాలను, ప్రాంగణ ఎంపికల పుస్తకాలను వెలువరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడారు. తాను రచించిన పుస్తకాలను ప్రచురించిన స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ సంస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కావలి ఎమ్మెస్సార్ డిగ్రి కళాశాల కరస్పాండెంట్, లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ టిడిపి కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ ఉమ, పలువురు అధ్యాపకులు, రచయితలు, పరిశోధకులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# సమగ్ర పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా రూ.25 వేల కోట్ల పెట్టుబడులు

## - రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ 2025 (ఎస్ఏటీటీఈ) వేదికపై రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమగ్ర పర్యాటకాభివృద్ధే కీలకంశంగా ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు టార్గెట్‌గా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ 2025 (ఎస్ఏటీటీఈ) వేదికగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తనదైన శైలిలో ప్రసంగించి ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నారు. పర్యాటక రంగంలో ఉత్తేజం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తింపజేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీలో పర్యాటకాభివృద్ధి కోసం నూతన టూరిజం పాలసీ 202429 తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పన తదితర విభిన్న కార్యక్రమాలు, పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు.

# వివాద రహితంగా టీచర్ల బదలీలు : మంత్రి లోకేష్

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వివాదాలకు తావు లేకుండా ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియారిటీ జాబితాలను రూపొందించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఎక్స్‌వేదికగా ఆయన ఈ విషయ వివరించారు. జీఓ117 కు ప్రత్యామ్నాయ వ్యవస్థపై త్వరలోనే ప్రజాప్రతినిధుల సదస్సు నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించాలని అధికారులకు సూచించామన్నారు. జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల వేతనాల పెంపుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటాం. వచ్చే విద్యాసంవత్సరంనుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే లెక్చరర్ల బదిలీలు చేపట్టాలి. జగన్ ప్రభుత్వంలో అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 42 వల్ల 80 ఎయిడెడ్ కళాశాలలు మూతపడ్డాయి. దీని వల్ల విద్యార్థులకు నష్టం వాటిల్లింది. ఎయిడెడ్ కళాశాలల ఆస్తులను కాజేసేందుకు జగన్ కుట్ర పన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 42 ద్వారా జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా పాలసీని రూపొందించాలి.

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్

## -17 లక్షలు విలువగల 174 కేజీల గంజాయి స్వాధీనం

**వెంకటాచలం,(నెల్లూరు) ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** గత కొంత కాలంగా జాతీయ రహదారిపై గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారని జిల్లా ఎస్పి కృష్ణ కాంత్‌కి సమాచారం రావడంతో ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డిఎస్పి గట్టమనేని శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. 18వ తేదీ వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద సిఐ సుబ్బారావు,ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో కలిసి తనిఖీ చేయుచుండగా నెల్లూరు నుండి గూడూరు వెలుతున్న ఆటో పోలీస్ వాహనాలు చూసి వెనక్కి తిప్పుకొని వెల్తుండగా పోలీసులకు అనుమానం రావడంతో ఆటోను వెంబడించి పట్టుకున్నారు.ఆటోలో 10 ప్యాకెట్లు గంజాయి 174 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులను విచారించగా గత కొంత కాలంగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు.వివరాలు అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం టి-దాకబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ తండ్రి వెంకటయ్య ,మేదరి రాజి రాజమ్మ, మయప్ప,ముత్యాలు,దేవమ్మ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు విచారణలో వెల్లడయింది.దీంతో వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు.



గంజాయితో పట్టు పడిన ఆటో

20-2P□g7exHMNWJQE.qxd:20-2P□g7exHMNWJQE.qxd 01/01/01 10:02 AM Page 1



# నందవరంలో పొగాకు బ్యారన్లు దగ్ధం

**మర్రిపాడు,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండలంలోని నందవరం కూడలి వద్ద ప్రమాదవశాత్తు రెండు పొగాకు బ్యారన్లు బుధవారం దగ్ధమయ్యాయి. బాధితుల సమాచారం మేరకు మర్రిపాడు, ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పక్కనున్న బ్యారన్ల కు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. పరిమి వెంకటరమణమ్మకు చెందిన ఒక బ్యారన్, కాకర్ల వెంకటేశ్వర్లు, కాకర్ల హజరత్తయ్యకు చెందిన ఒక బ్యారను మొత్తం రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమైన ఘటనలో దాదాపు 9లక్షలు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు.

# విజయవాడ బిఐఎస్ నేతృత్వంలో సైన్స్ టీచర్లకు శిక్షణ



**విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలల్లో ప్రామాణిక క్లబ్‌లకు మార్గనిర్దేశం చేస్తున్న 40 మంది ఉపాధ్యాయులకు పాడేరులోని ప్రముఖ హోటల్లో కాఫీ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటిడిఎ లెర్నింగ్‌సైన్స్ వయా స్టాండర్డ్స్ పై సైన్స్ టీచర్లకు రాష్ట్రంలో 6వ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా బిఐఎస్ సైంటిస్ట్ సి/ డిప్యూటి డైరెక్టర్ డి వివేక్‌వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పద్ధతి సైన్స్‌లో విజయం సాధించడానికి , సమాజానికి విలువైన సహకారాన్ని అందించడానికి సహాయ పడుతుందన్నారు. బిఐఎస్ విధి విధానాలను సోదాహరణంగా వివరించారు. ముఖ్య అతిథి అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి పి బ్రహ్మాజి మాట్లాడుతూ భవిష్యత్‌లో నిజజీవిత పరిస్థితులు ధైర్యంగా ఎదుర్కోడానికి శక్తినిచ్చేలా పాఠ్యప్రణాళికలు సాధనంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటి డైరెక్టర్ ఎల్ రజని మాట్లాడుతూ ఈ స్టాండర్డ్స్ క్లబ్‌ల ద్వారా నాణ్యత ప్రమాణాల విషయాన్ని విద్యార్థులకు వివరించిన బిఐఎస్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో బిఐఎస్ స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణవీర్ వర్మ, జె అనిల్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి రాంబాబు, బిఐఎస్ అధికారులు పాల్గొన్నారు.



# పద్మావతి యూనివర్సిటీలో 7.5 కోట్లతో అధునాతన ఇండోర్ హాల్ ప్రారంభం

## - రాష్ట్రంలో క్రీడలకు అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేస్తాం:మంత్రి నారా లోకేష్

**తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త** రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి, క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తామని రాష్ట్ర విద్య,ఐటి,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు.తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం,మహిళా యూనివర్సిటీ,శాప్ సంయుక్తంగా రూ.7.5 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నీ మంత్రి లోకేష్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ అమరావతిలో అధునాతన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం,స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.పద్మావతి యూనివర్సిటీ వేదికగా ఉత్తమ క్రీడాకారిణులను తయారుచేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం దోహదపడుతుందన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారిణులతో మంత్రి లోకేష్ కొద్దిసేపు షటిల్ ఆడి ఉత్సాహ పర్చారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఏరోబిక్స్, టైక్వాండో,యోగా మెడిటేషన్ సెంటర్లను కూడా లోకేష్ ప్రారంభించారు. యూనివర్సిటీ విద్యార్థినులు,క్రీడాకారిణులు ఇక్కడ ఏర్పాటు చేసిన క్రీడా వసతులను వినియోగించుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమ మాట్లాడుతూ క్రీడాకారిణులకు యూనివర్సిటీలో మంచి శిక్షణ వేదిక లభించడం తమ విద్యార్థినులకు గొప్ప అవకాశమన్నారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.క్రీడాభివృద్ధికి మంత్రి లోకేష్ చూపుతున్న చొరవ, కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్,జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్,శాప్ ఎండి గిరీషా,శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు,పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్,తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, యూనివర్సిటీ రిజిస్ట్రార్ రజని తదితరులు పాల్గొన్నారు.

# జైలుకు వెళ్లి నేరస్తులను పరామర్శించే జగన్‌కు అసెంబ్లీకి వెళ్లేందుకు ముఖం చెల్లదు

## పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయ వాడ.ఫిబ్రవరి 19,ప్రభాత వార్తప్రతినిధి:** నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్లను జైలుకు వెళ్లి పరామర్శించే జగన్‌కి, అసెంబ్లీకి వెళ్లేందుకు ముఖం చెల్లదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళ్లని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యల మీద మాట్లాడే నైతికత లేదన్నారు. జగన్ ప్రెస్ మీట్ లు పెట్టి పురాణం అంతా చెప్పే తీరిక దొరుకుతుంది, కానీ అసెంబ్లీలో పాలకపక్షాన్ని నిలదీసే ధైర్యం లేదన్నారు. జగన్ పై ఎక్స్ వేదికగా షర్మిల ఆరోపణలు చేసారు.ప్రజలు 11 మందిని గెలిపిస్తే శాసనసభకు రాకుండా నీతుల చెబుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజల మధ్య తిరిగే అర్హత లేదని ఆక్షేపించారు. ఈ సారి కూడా అసెంబ్లీకి వెళ్లే దమ్ము లేకుంటే వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి నిరూపించుకోవాలని వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బడ్జెట్ లో సూపర్ సిక్స్ పథకాలకు అగ్రభాగం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని పథకాలను ఈ ఏడాది నుంచే అమలు చేయాలని సూచించారు.

# మానవ అక్రమ రవాణా మూడవ అతిపెద్ద చట్టవిరుద్ధమైన నేరం

## జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న సురక్షిత వలసల సంక్షోభం నేపథ్యంలో, తొమ్మిది దక్షిణాసియా దేశాలకు చెందిన సామాజిక సంస్థల ప్రతినిధులు ప్రభుత్వాలు, విధాన రూపకర్తలు, చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు, ఐక్యరాజ్యసమితి ,పౌర సమాజ సంస్థలు కలిసి "సౌత్ ఏషియా కన్సల్టేషన్ ప్రమోటింగ్ సేఫ్ మైగ్రేషన్‌ను ప్రమోటింగ్ ట్రాఫికింగ్‌పై పోరాటం చేస్తున్నాయి.వీటి ప్రాముఖ్యతను వాసవ్య మహిళా మండలి కేంద్రంగా వివరిస్తూ కీలకచర్చ జరిగింది..'సౌత్ ఏషియా కన్సల్టేషన్ ప్రమోటింగ్ సేఫ్ మైగ్రేషన్‌ను ప్రమోటింగ్ ట్రాఫికింగ్‌పై పోరాటంపై బుధవారం రాత్రి వాసవ్యమహిళా మండలి సమాచార పత్రాన్ని విడుదల చేసింది.సమగ్రమైన, హక్కుల ఆధారిత వ్యూహం, ప్రాంతమంతటా సామరస్య పూర్వకమైన వలస విధానాలు మరియు అంతర్జాతీయ మరియు ప్రాంతీయ ప్రమాణాలకు అనుగుణంగా చట్టపరమైన మరియు విధాన సంస్కరణల ఆవశ్యకత, ట్రాఫికింగ్ వంటి సంఘటిత నేరాలకు, ద్వైపాక్షిక మరియు బహుళ పక్షీయ ఒప్పందాలను ప్రోత్సహించడంతోపాటు, ద్వైపాక్షిక మరియు బహుళ పక్షీయ ఒప్పందాలను ప్రోత్సహించడం కూడా అవసరమని నొక్కి చెప్పింది ఈ సంప్రదింపులలో వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చినవారు మరియు అక్రమ రవాణా బాధితులు తమ అనుభవాలను మరియు పోరాటాలను పంచుకున్నారు మరియు వారి సూచనలను అందించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, 39 దేశాల్లో బాలల రక్షణ,. పిల్లల హక్కుల కోసం పనిచేస్తున్న పౌర సమాజ సంస్థల నెట్‌వర్క్, సంప్రదింపుల యొక్క సాంకేతిక భాగస్వామిగా ఉంది, అయితే అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ సంప్రదింపులను నిర వ్వహించింది. అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి బహుముఖ వ్యూహం యొక్క తక్షణ అవసరాన్ని నొక్కి చెప్పడం. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు మాట్లాడుతూ, "ట్రాఫికింగ్ అనేది ఒక వ్యవస్థీకృత మరియు ఆర్థిక నేరం, ఇది ముఖ్యంగా పిల్లలు మరియు బలహీనమైన యువత దోపిడీకి గురవుతుంది. దీనిని ఎదుర్కోవడానికి, మనకు బహుముఖ వ్యూహం అవసరం, అక్రమ రవాణా, విచారణ మరియు వ్యవస్థీకృత క్రైమ్ సిండికేట్‌లను విచ్ఛిన్నం చేయడం మరియు అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత క్రైమ్ సిండికేట్‌ల ద్వారా వ్యవస్థీకృత ట్రాఫిక్ మరియు గ్లోబల్ కోఆర్డినేషన్‌ను మెరుగుపరచడం." భారతదేశానికి బహిష్కరించబడిన వ్యక్తుల దుస్థితి మరియు ఇలాంటి పరిస్థితులలో ఇతరులలో భయం గురించి వ్యాఖ్యానిస్తూ, ఈ భయంకరమైన వాస్తవికత, అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త ప్రతిస్పందన యొక్క తక్షణ అవసరాన్ని ఎత్తి చూపుతుందని, ఈ అక్రమ రవాణాదారుల సిండికేట్‌లను దేశ వ్యాప్తంగా అణిచివేసేందుకు భారతదేశం, అమెరికా, ఇతర ప్రభుత్వాలను కోరుతున్నట్లు ఆయన అన్నారు. మేము బాధితులు అందించిన సమాచారాన్ని విశ్లేషించాలి, ఆర్థిక లావాదేవీలను గుర్తించాలి మరియు దోపిడీ చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఈ నేరాన్ని నడిపించే ఆర్థిక సిండికేట్‌లను విచ్ఛిన్నం చేయాలి. వలసలు అనేది మానవ స్వభావం యొక్క ప్రాథమిక అంశం అని కూడా అతను నొక్కిచెప్పాడు, పెరుగుదల, అవకాశం మరియు అభివృద్ధిని సాధించడం ద్వారా నడపబడుతుంది. అయితే, దోపిడీ, బలవంతం మరియు అవకతవకలు పట్టుకునే దశలోనే వలసలు అక్రమ రవాణాగా మారతాయి.కన్సల్టేషన్‌ను ఉద్దేశించి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు మరియు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (విదిశిదిలి) మాజీ ఛైర్మన్ ప్రియాంక్ కనూంగో మాట్లాడుతూ, "అవగాహన అవసరమయ్యే ఒక క్లిష్టమైన అంశం.

# సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తా

## - ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్

**తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** పలు రకాల సమస్యలతో బాధపడుతున్న వారందరికీ అండగా నిలుస్తానని,సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. తిరుపతిపర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం పార్టీకార్యాలయంలో మంత్రి 59వ రోజు ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధసమస్యలతో బాదపడుతున్న బాధితులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. 2007నుండి 2011వరకు కాంట్రాక్టు పద్ధతిలో నియమితులై, సొంత మండలాల్లోని పిహెచ్‌సి సబ్‌సెంటర్లలో రెండవ ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీ కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. 16ఏళ్ళుగా రెగ్యులర్ వారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, వేతనాలు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెగ్యులర్ ఎఎన్ఎం పోస్టులను 2007 నుండి పనిచేస్తున్న వారితోనే భర్తీచేయాలని కోరారు. ఎస్ఎల్ఎమ్ పిసి కార్పొరేషన్ తరపున తిరుమల లడ్డూ కౌంటర్‌లో విధులు నిర్వహించే తాను రోడ్డుప్రమాదం కారణంగా కొన్ని నెలలుగా విధులకు హాజరుకాలేక పోయానని, రీజాయినింగ్‌కు అనుమతించాలని తిరుపతికి చెందిన

ఏ.నాగసాయికార్తీక్ విజ్ఞప్తి చేశాడు. హంద్రీనీవా ప్రాజెక్టు క్రింద భూమి కోల్పోయామని, ఇంటర్ చదివిన తన కుమారుడికి టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం అవకాశం కల్పించి ఆదుకోవాలని చిత్తూరు జిల్లా ఐరాల మండలం చెంగనపల్లికి చెందిన పి.మునీశ్వరశెట్టి కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన విధంగా ఆదుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

# మహిళా శక్తి క్యాంటిన్లకు బ్యాంకు రుణాలు

## రూ.5నుంచి రూ.20లక్షల వరకు వడ్డీలేని రుణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి,19 ప్రభాతవార్త:** మహిళలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థిక స్వాలంబన దిశగా నడిపే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు కోసం మహిళా శక్తి క్యాంటిన్లు అనే ప్రత్యేక పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా మహిళలకు రాష్ట్ర సచివాలయంలోనే కాకుండా, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో, కలెక్టర్‌టలలో,కార్పోరేషన్ కార్యాలయాలు, బస్టాండ్‌లలో మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. వీటికి పలు వర్గాల నుంచి కూడా మంచి స్పందన రావడంతో వారిని మరింత ప్రోత్సహించే కార్యక్రమంలో బాగంగా వాటికి వాటికి పలు బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు కూడా ఇప్పిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతి జిల్లాలో మహిళాశక్తి క్యాంటిన్లు ఉన్నాయి. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో కూడా వీటి ఏర్పాటు జరుగుతోంది. మరిన్ని ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు దరఖాస్తుల పరిశీలన కూడా జరుగుతోంది.మహిళా శక్తి క్యాంటీన్ల వల్ల 2 రకాల ప్రయోజనాలు ఉన్నాయి. మహిళా సంఘంలోని సభ్యులు కలిసి ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసుకొని.. రోజువారీ టిఫిన్లు, భోజనాలు అమ్ముకోవచ్చు. పచ్చళ్లు, కర్రీస్ అమ్ముకోవచ్చు. ఈ క్యాంటీన్ల ఏర్పాటుకి పూర్తి ట్రైనింగ్ కూడా ఇస్తారు. అం దువల్ల ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహిం చుకోవచ్చు. క్రమంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ.. వడ్డీ లేని రుణాలను చిన్న మొత్తాల్లో నెలవారీ చెల్లించవచ్చు. ఇటీవల ఓ మహిళ.. సిద్దిపేటలోనే మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించింది. ఆమె రూ.5 లక్షలకు పైగా రుణం తీసుకుని ఆ మొత్తంతో యంత్రాలు, ఫర్నిచర్, టేబుళ్ల వంటివి కొన్నదితర్వాత టిఫిన్లు, భోజనం, స్నాక్స్, పచ్చళ్లు అమ్ముతోంది. ఇప్పుడు ఆమె ఖర్చులు పోగా రోజూ రూ.3వేల దాకా లాభం సంపాదిస్తోంది. అంటే.. నెలకు రూ.90వేల దాకా లాభం వస్తోంది. అందువల్ల ఆమె ఇప్పుడు తన రుణాన్ని క్రమంగా చెల్లించడం తేలికవుతోంది. ఈ క్యాంటీన్లలో ఆహారం అత్యంత నాణ్యమైనదిగా శుచిగా, శుభ్రంగా ఉండటంతో కస్టమర్లు మళ్లీ మళ్లీ వచ్చి తింటున్నారు.ఒక క్యాంటీన్ ఏర్పాటుకి 10 లక్షల నుంచి 20 లక్షల వరకుబ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తున్నారు. ఈ రుణానికి పూచీకత్తు అవసరం లేదు. వడ్డీ కూడా ఉండదు. ఇటీవల సిద్దిపేటలో 3 క్యాంటీన్లకు రూ.34 లక్షలుమంజూరయ్యాయి. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లపాటూ మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చెయించాలని నిర్ణయించుకుంది. అందువల్ల ఎవరైనా ఈ క్యాంటీన్ పెట్టాలి అనుకుంటే.. ముందుగా మెప్మా అధికారులను సంప్రదిస్తే వారు పూర్తి సమచారాన్ని అందిస్తారు. అంతే కాకుండా క్యాంటీన్‌కి రుణం ఇప్పించడం, కావాల్సిన యంత్రాలు, టేబుళ్లు, సామాగ్రి అన్ని ఎలా ఎక్కడ కొనాలో చెప్పడమే కాకుండా క్యాంటీన్ ఎక్కడ పెట్టాలో సూచిస్తారు. వారు చెప్పిన చోటు కాదనుకుంటే, ఎక్కడ పెట్టాలో మహిళలు తమ నిర్ణయం చెప్పవచ్చు. ప్రభుత్వం రద్దీ ప్రాంతాల్లోనే ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుండటంతో వ్యాపారం బాగానే సాగుతోందని నిర్వహకులు చెబుతున్నారు.

# మిర్చి రైతులకు లబ్దిచేకూర్చేందుకే ఎంఎస్‌పిని ఖరారు చేయలేదు

## - రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** బహిరంగ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరుగుతున్ననేపథ్యంలో ప్రభుత్వం కనీసమద్దతు ధర ప్రకటించినట్లయితే నష్టపోతారనే ఉద్దేశ్యంతో మిర్చికి ఇప్పటి వరకు కనీస మద్దతు ధర ప్రకటించలేదని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్ శాఖమంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు.బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలోఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ శ్రీలంక,చైనా మలేషియా తదితర దేశాలకు మన మిర్చి ఎగుమతయ్యేదని అయితే ఆయా దేశాలు సొంతంగా మిర్చి పంట సాగుచేసుకోవడం వల్ల మిర్చి ఎగుమదతులు చాలా తగ్గిపోవడ వల్ల మిర్చరేటు తగ్గిందన్నారు.కానీ చైనాలో మిర్చి పంట సరిగాలేకపోవడం వల్ల మళ్ళీ ఆదేశం మన మిర్చి పంటపై ఆధారపడే పరిస్థితులు ఏర్పాడ్డాయని ఫలితంగా మిర్చి ధరలు బారీగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు.మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని ప్రస్తుతం ఉన్నకేంద్ర మద్దతు ధరను కూడా పెద్దఎత్తున పెంచాలని కోరేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీ వెళుతున్నారన్నారు.కేంద్రమంత్రుల బృందంతో చర్చించనున్నారని,చర్చల ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తంచేశారు.గత ప్రభుత్వం భూసార పరీక్షలను పూర్తిగా నిలిపివేయడమే కాకుండా,వ్యవసాయ యాంత్రీకరణ కింద ఒక్కపైసా కూడా కేటాయించలేదన్నారు. బిందుసేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్/స్ప్రింకర్లను ఏ ఒక్కరికి పంపిణీ చేయలేదన్నారు. దాదాపు రూ.1600కోట్లమేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే తాము అధికారంలోనికి వచ్చిన వెంటనేరైతులకు ఆ సొమ్ము చెల్లించడం జరిగిందన్నారు. 2020జనవరి మాసంలో బహిరంగ మార్కెట్‌లో మిర్చి ధర దాదాపు రూ.12000లు వరకు ఉంటే అదే సమయంలో గత ప్రభుత్వం మిర్చికి రూ.7000లు కనీస మద్దతు ధరను ప్రకటించి రైతులకుపూర్తిస్థాయిలో నష్టాన్ని కలిగించిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు.



సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చన్నాయుడు

ఆ సమయంలో కూడా మార్కెట్ ఇంటర్వేన్షన్ ఫండ్ క్రింద ఒక్కపైసా కూడా అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించలేదన్నారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఢిల్లీరావు, మార్కెటింగ్ శాఖ సంచాలకులు మరియు రైతు బజార్ల సీఈవో విజయ సునీత సమావేశంలో పాల్గొన్నారు.

# కెసిఆర్ పగటికలలు కంటున్నారు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి,19 ప్రభాత వార్త:** కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కన బడుతుందని రెవెన్యూ,హౌసింగ్,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్లు ఫాంహౌస్ దాటని దొరవారు అధికారంపై పగటికలలు కం టున్నారని ఆయనఎద్దేవా చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేళ్లు అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచి అజ్ఞాతంలోకి వెళ్లిన కేసీఆర్‌కి 14 నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభి వృద్ధి ఏ విధంగా కనబడుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ ,ఎన్నికల పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారు. 14 నెలల నుంచి ఫాంహౌస్ దాటని ఆయన స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని బుధవారం ఒక ప్రకట నలో వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గాని, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చి నప్పుడు గాని ఆయనకు ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. శాసనసభలో కీలకమైన తీర్మా నాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మా నానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారు. తెలంగాణ ప్రజలు కష్టపడి కేసీఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే, ఆయన ఏనాడు ప్రజాతీర్పును గౌరవించలేదు. అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. కానీ కేసీఆర్ తాను ప్రజలు జవాబుదారీగా లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమనదిశలోకి తీసుకెళ్లారు, పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14నెలల్లో తాము సాధించిన అభివృద్ధిని సవివరంగా కేసీఆర్ ముందుంచుతాం.కాంగ్రెస్ భవిష్యత్ గురించి కాకుండా ముందుగా కేసీఆర్ తన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుం టుందని సలహా ఇచ్చారు.విపరీతమైన అప్పులు చేసి నెత్తినమీద మిత్తిల భారం పెట్టిపోయారన్న పొంగులేటి పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదన్నారు.

# ఐదు సంవత్సరాల వరకు ఉప ఎన్నికలు రావు

## కేసీఆర్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి అంటున్నాయని, అయితే ఐదు సంవత్సరాల వరకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు ఉనికి లేదన్నారు. అందుకే కెసిఆర్ ఇలాంటి మెసేజ్ లు ఇస్తున్నాడన్నారు. ఫాంహౌస్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కార్యకర్తల ముందు అంటున్నాడని, కేవలం కార్యకర్తలను ఉత్తేజ పర్చడానికే కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది అంటున్నాడని, ఆయనకు చిత్త శుద్దే లేదన్నారు. చిత్త శుద్ధి ఉంటే అపొజిషన్ లీడర్‌గా అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలు చర్చించే వారన్నారు.

# 15 నెలల తరువాత ప్రజలు గుర్తుకు వచ్చారా?

## టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** 15 నెలల తరువాత మాజీ సిఎం కెసిఆర్‌కు ప్రజలు గుర్తుకు వచ్చారా? అంటూ టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రజల గొంతుకగా మాట్లాడుతారని ఆశించాం కానీ మాట్లాడలేదన్నారు.బిజెపి పార్టీ లోపాయికారి ఒప్పందంతోనే ఎంఎల్సీ ఎన్నికల్లో పోటీచేయలేదన్నారు. ప్రభుత్వం ప్రాతిష్టాత్మికగా కులగణన చేస్తే కనీసం కెసిఆర్ స్పందన లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించడంలో పూర్తి విఫలం అయ్యారన్నారు. కెసిఆర్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు అన్నారు. తెలంగాణ రాష్టంను పది ఏళ్ల స్వంత ఆస్తిలాగా వ్యవహరించారని అన్నారు. కెసిఆర్ ప్రజల కోసం సలహాలు సూచనలు ప్రభుత్వం కోరిన స్పందన లేదన్నారు.

# కులగణనలో గతంలో పాల్గొనని వారు ఎన్‌రోల్ చేసుకోవాలి

## బిసి సంక్షేమం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గతంలో కులగణనలో పాల్గొనని వారు తప్పకుండా తమ వివరాలను ఇవ్వాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి చెందిన మేధావులు, బలహీన వర్గాల నాయకులు, ప్రొఫెసర్లు వివిధ స్థాయిల్లో ఉన్న అందరి విజ్ఞప్తిమేరకు కులగణనలో నమోదు చేసుకోని వారికి మరో అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 16 నుంచి 28 వరకు.. ఇప్పటి వరకు కులసర్వేలో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. మూడు పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. కులసర్వేకి ఆనాడు విజ్ఞప్తిచేసిన వారు, విమర్శలు చేసిన వారు,ఇప్పుడు మిస్ అయిన వారందరినీ మోటివేట్ చేపించి సర్వేలో భాగస్వామ్యులు అయ్యేవిధంగా చూడాలని తెలంగాణ మేధావులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్, హరీష్‌రావు సర్వేలో పాల్గొని పార్టీపక్షాన, బలహీనవర్గాలపక్షాన సానుకూలంగా ఉన్నామని చెప్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అవేమీ చేయకుండా విమర్శలకే పరిమితమయితే తెలంగాణ బలహీనవర్గాలు చూస్తూ ఊరుకోరని మంత్రి గుర్తు చేశారు.

# కేసీఆర్‌కు ప్రజాస్వామ్యమంటే విలువ లేదు

## అధికారం దరిదాపుల్లో కనబడకపోవడంతోనే ఈ అసహనం: చిట్ చాట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మాట్లాడిన మాటలకు మంత్రి పొన్నం కౌంటర్ ఇచ్చారు. బుధవారం తనను కలిసిన మీడియా వారితో కేసీఆర్ వ్యాఖ్యలపై చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ పాస్ పోర్ట్ ఆఫీస్‌కు వచ్చాడు కాబట్టి ఎలాగూ హైదరాబాద్ వచ్చానని పార్టీ ఆఫీసుకెళ్లి మీటింగ్ పెట్టాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామన్నారు. పంట బోనస్, రైతు భరోసా పెంపు, 55 వేల ఉద్యోగాలు, డీఎస్సీ పోస్టింగ్‌లు ఇలా చెప్పుకుంటే పోతే అనేకం చేశామన్నారు. కేసీఆర్ వాఖ్యల్లో అసహనం తప్ప మరోకటి లేదని పొన్నం మండి పడ్డారు. అధికారం దరిదాపుల్లో కనబడకపోవడంతోనే కేసీఆర్‌కు ఈ అసహనమని అన్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తారని అది పక్కా అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వాస్తవం మాట్లాడుతుంటే ..జీర్ణించుకోలేక అసహనంతో కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా పాత పథకాలను ఒక్కటి కూడా రద్దు చేయకుండా, తాము ఇచ్చిన హామీలను సైతం అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా సహాకరిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు కేసీఆర్ కలసి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమిళనాడు తరహాలో అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వంతో కలసి రావాలన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళ్తామని.. అందుకు ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కూడా కలసి రావాల్సిందేనని మంత్రి హితవు పలికారు.

# దివ్యాంగ విద్యార్థులకు ఆధునిక బోధనా సామాగ్రి!

## డెహ్రాడూన్‌లోని పాఠశాలలను పరిశీలించిన విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా దృష్టి లోపం గల విద్యార్థుల కోసం విద్యా విధానాలు, మౌలిక సదుపాయాల తోపాటు అభ్యాస పద్ధతులను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోనున్నారు. ఇందు కోసం ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి విధానాలను అమలు చేస్తున్నారో తెలుసుకోవడం కోసం విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యశాఖ అధికారులతో కలిసి డెహ్రాడూన్‌లోని కొన్ని దివ్యాంగ పాఠశాలలను పరిశీలించారు. అక్కడ అధికారులు పరిశీలించిన విధానాలు, ఆధునిక యంత్రాలున ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు గణనీయంగా దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య జేడీ వెంకట నర్సమ్మ, దారుల్షిఫా అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ మందడి వెంకట్ రెడ్డి, మలక్‌పేటలోని బి బ్లాక్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌కి చెందిన సీనియర్ టీచర్ సుపర్ణ ఈ నెల 18, 19 తేదీల్లో డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజేబిలిటీస్ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. తెలంగాణ ప్రతినిధి బృందాన్నిఎన్ఐఈపీవీడీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ అమిత్ శర్మ, డాక్టర్ కె శ్రీనివాస్ రెడ్డి,

డాక్టర్ రామకృష్ణ, అధ్యాపక సభ్యులు, విద్యార్థులు స్వాగతించారు. తెలంగాణ రాష్ట్రంలో దృష్టి లోపం ఉన్న విద్యా ర్థుల కోసం ప్రత్యేక పాఠశాలలు మరియు ప్రత్యేక విద్యా సంస్థలను బలోపేతం చేయడంపై విలు వైన చర్చలకు దోహద పడినట్టు అధికారులు తెలిపారు.

# పాస్‌పోర్టు కార్యాలయానికి తెలంగాణ మాజీ సీఎం కెసిఆర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి తెలంగాణ రాష్ట్ర మాజీముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చారు.తన పాస్‌పోర్టును రెన్యువల్ చేసుకోడానికి ఆయన వచ్చారు. కార్యాలయ సిబ్బంది వెంట ఉండి ఆయన పాస్‌పోర్టును రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేశారు.

20-2pg10.qxd:20-2pg10.qxd 01/01/01 8:12 AM Page 1





# హాకీ ప్రొ లీగ్‌లో.. భారత్‌కు నిరాశ

### పురుషుల, మహిళల జట్లు ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల, మహిళల జట్లకు నిరాశ ఎదురైంది. భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 1-4 గోల్స్ తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్ జర్మనీ జట్టు చేతిలో భారత మహిళల జట్టు 3-4 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టు చేతిలో ఓడిపోయాయి. జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున గుర్జంత్ సింగ్ (13వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. జర్మనీ తరఫున ఫ్లోరియన్ స్పెర్లింగ్ (7వ నిమిషంలో), థీస్ ప్రింజ్ (14వ నిమిషంలో), మైకేల్ స్ట్రుతోఫ్ (48వ నిమిషంలో), రాఫెల్ హార్టకోప్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు తరఫున బల్జీత్ కౌర్ (19వ నిమిషంలో), సాక్షి రాణా (38వ నిమిషంలో), రుతుజా (45వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. స్పెయిన్ జట్టుకు సోఫియా (21వ నిమిషంలో), లూసియా (52వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా, ఎస్తెల్ (25వ, 49వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించింది.



# వన్డే ర్యాంకింగ్స్‌లో గిల్ నం.1

### టాప్ 10లో నలుగురు టీమిండియా ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు. గత ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలో ఉండిన గిల్ ఓ స్థానం మెరుగుపర్చుకుని టాప్ ర్యాంక్‌కు చేరాడు. దీంతో ఇప్పటి వరకూ ఆస్థానంలో ఉన్న పాక్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజమ్‌ను వెనక్కు నెట్టాడు. ప్రస్తు ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బాబర్ 773 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో ఉన్నాడు. సచిన్, విరాట్, ధోని తర్వాత ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరిన 4వ భారత బ్యాటర్‌గా గిల్ రికార్డుల్లోకెక్కాడు. ప్రస్తుతం గిల్ ఖాతాలో 796 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఐసీసీ బుధవారం విడుదల చేసి ఈ వారం ర్యాంకింగ్స్‌లో గిల్‌తో కలుపుకుని భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు టాప్10లో ఉన్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 3వ స్థానంలో, విరాట్ కోహ్లి 6లో, శ్రేయస్ అయ్యర్ 9వ స్థానంలో నిలిచారు. గతంతో పోలిస్తే శ్రేయస్ ఓ ర్యాంక్ మెరుగుపర్చుకుని 9వ స్థానానికి చేరాడు. ఇక సౌతాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ 4లో, న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ 5, ఐర్లాండ్ ఆటగాడు హ్యారీటెక్టార్ 7, లంక కెప్టెన్ అసలంక 8, షాయ్ హోప్ 10వ స్థానంలో ఉన్నారు. బౌలర్ల విషయానికొస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్‌ను కిందకు దించి లంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత బౌలర్ కుల్దీప్ యాదవ్ ఓ స్థానం మెరుగుపర్చుకుని నాలుగో స్థానానికి చేరాడు. భారత్ నుంచి టాప్10లో కుల్దీప్‌తో పాటు, సిరాజ్ (10వ ర్యాంక్) మాత్రమే ఉన్నాడు. ఆల్‌రౌండర్లలో ఆఫ్ఘనిస్తాన్ వెటరన్ మొహమ్మద్ నబీ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా 2వ స్థానంలో నిలిచాడు. భారత్ నుంచి రవీంద్ర జడేజా ఒక్కడే టాప్10లో ఉన్నాడు. జడ్డూ 217 రేటింగ్ పాయింట్లతో పదోస్థానంలో నిలిచాడు. జట్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే టీమిండియా టాప్ ర్యాంక్లో కొనసాగుతుంది. 2వ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు భారత్ అందనంత ఎత్తులో ఉంది. ఇరు జట్లకు మధ్య దాదాపు 800 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది.



# అత్యుత్తమ ఎకానమీ బౌలర్లు

### ఛాంపియన్స్ ట్రోఫీలో.. భారత్ నుండి ఒకే ఒక్కడు

**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించిప ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభమైంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్లో అదరగొట్టిన బౌలర్లు ఉన్నారు. ప్రధానంగా అత్యుత్తమ ఎకానమీ ఉన్న బౌలర్ల జాబితాలో టీమిండియా నుండి ఒకే ఒక్కడు ఉన్నాడు. ఇప్పటిదాకా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యల్ప ఎకానమీ ఉన్న 5గురు బౌలర్లు గూర్చి తెలుసుకుంటే ఈ లిస్టులో టీమిండియా తోపు ప్లేయర్ కూడా ఉన్నాడు. మరి అలాంటి పొదుపు బౌలింగ్ వేసిన టాప్ 5 బౌలర్లలో అరవింద డి సిల్వా ఒకడు. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌ల చరిత్రలో అత్యుత్తమ ఎకానమీ రేటుతో బౌలింగ్ చేసిన బౌలర్ శ్రీలంక గ్రేట్ అరవింద్ గుర్తింపు తెచ్చుకున్నాడు. డిసిల్వా 7 మ్యాచ్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి, రెండు మెయిడెన్ ఓవర్లు వేశాడు. అతను 60 బంతుల్లో 16 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. ఎకానమీ రేటు 1.60గా ఉంది, ఇదే టోర్నీలో అత్యల్పం. పొదుపుగా బౌలింగ్ వేసిన బౌలర్ల లిస్టులో వెస్టిండీస్ ఆటగాడు వేవెల్ హిండ్స్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ దశలో, అతడు 11 మ్యాచ్‌ల్లో 20 ఓవర్లు బౌలింగ్ చేశాడు. వేవెల్ మూడు మెయిడెన్ ఓవర్లు వేసి 51 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టాడు. హిండ్స్ ఎకానమీ రేటు 2.55. అలాగే ఆస్ట్రేలియా లెజెండ్, దివంగత బౌలర్ షేన్ వార్న్ తన స్పిన్‌తో ప్రపంచంలోని గొప్ప బ్యాట్స్‌మెన్‌లను కూడా పడగొట్టాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్‌గా పరిగణించబడే వార్న్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో 3 మ్యాచ్‌లకు గానూ 20.2 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతని ఎకానమీ రేటు 2.95. ఇందులో వార్న్ నాలుగు మెయిడెన్ ఓవర్లు బౌలింగ్ చేసి 122 బంతుల్లో 60 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక దక్షిణాఫ్రికా తరఫున 44 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జస్టిన్ ఒంటాంగ్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు. జస్టిన్ ఒకే ఒక్క నాకౌట్ మ్యాచ్ ఆడాడు. 10 ఓవర్లలో, జస్టిన్ ఒక మెయిడెన్ ఓవర్ వేసి మొత్తం 30 పరుగులు ఇచ్చాడు. ఎకానమీ రేటు 3గా ఉంది. కాగా ఈ జాబితాలో ఉన్న ఏకైక భారతీయ ఆటగాడు రమేష్ పొవార్. జస్టిన్ లాగే, అతడు కూడా ఒకే ఒక్క నాకౌట్ మ్యాచ్ ఆడాడు. 8 ఓవర్లు బౌలింగ్ చేసిన రమేష్ 24 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. పొవార్ ఎకానమీ రేటు కూడా 3గా ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ చరిత్రలో ఐదవ అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు.

# ముంబయి ఇండియన్స్ బోణీ

### గుజరాత్ జెయింట్స్‌పై గెలుపు



**ఢిల్లీ:** మహిళ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025లో మాజీ చాంపి యన్ ముంబై ఇండియన్స్ బోణీకొట్టింది. వడోదరలో జరిగిన లీగ్ మ్యా చ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై 5 వికెట్ల తో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. హర్లీన్ డియోల్ (31 బంతుల్లో 32, 4 ఫోర్లు) బంతికో పరుగు చొప్పున సాధించి, టాప్ స్కోరర్ గా నిలిచింది. హీలీ మథ్యూస్ మూడు వికెట్లతో రాణించింది. ఈ లక్ష్య ఛేదనలో 16.1 ఓవర్లలోనే ఐదు వికెట్లకు 122 పరుగులు చేసి ముంబై పూర్తి చేసింది. వన్ డౌన్ బ్యాటర్ నాట్ స్కివర్ బ్రంట్ ఫిఫ్టీ (39 బంతుల్లో 57, 11 ఫోర్లు)తో సత్తా చాటింది. బౌలర్లలో ప్రియా మిశ్రా, కశ్వీ గౌతమ్ లకు రెండేసి వికెట్లు దక్కాయి. హీలీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. టోర్నీలో గుజరాత్ కిది రెండో పరాజయం కావడం గమనార్హం. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు శుభారంభం దక్కలేదు. 14 పరుగులకే ఓపెనర్లు బేత్ మూనీ, లారా వోల్వార్ట్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో హర్లీన్ ఓపికగా ఆడింది. ఆమెతోపాటు కశ్వీ గౌతమ్ (20) కాస్త వేగంగా ఆడటంతో గుజరాత్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. చివర్లో తనూజ కన్వర్, సయాలి సాత్ఘరే తలో 13 పరుగులు జోడించి జట్టుక గౌరవ ప్రదమైన స్కోరును అందించారు. బౌలర్లలో బ్రంట్ , అమెలియా కెర్ కు రెండేసి వికెట్లు, షబ్నిం ఇస్మాయిల్, అమన్జోత్ కౌర్ కు ఒక వికెట్ లభించింది. గుజరాత్ బౌలర్లను ఆటాడుకున్న బ్రంట్ తన ఇన్నింగ్స్ లో ఏకంగా 11 ఫోర్లు బాదడం విశేషం. దీంతో 33 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. ఒక్క ఓవర్ తేడాతో ఆఖర్లో వీరిద్దరూ వెనుదిరిగినా, సజనా, కమలిని జట్టును విజయతీరాలకు చేర్చారు.

# వన్డేలో సరికొత్త చరిత్ర: స్పిన్నర్లతోనే ఓవర్లు

### భారత్ రికార్డు బద్దలు కొట్టిన అమెరికా

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఓ మ్యాచ్ మొత్తంలో (రెండు ఇన్నింగ్స్‌ల్లో) ఒక్క ఫాస్ట్ బౌలర్ కూడా బౌలింగ్ చేయలేదు. అన్ని ఓవర్లు స్పిన్నర్లే బౌలింగ్ చేశారు. యూఎస్ఏ, ఒమన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన సందర్భం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ చేసిన ఒమన్ అమెరికా బ్యాటింగ్ చేసిన 35.3 ఓవర్లు స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించింది. అనంతరం అమెరికా సైతం ఒమన్ బ్యాటింగ్ చేసిన 25.3 ఓవర్లను స్పిన్నర్లతోనే వేయించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 61 ఓవర్లు జరగ్గా, అన్నింటినీ స్పిన్నర్లే వేశారు. వన్డే క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఈ మ్యాచ్లో మరో రికార్డు వరల్డ్ రికార్డు కూడా నమోదైంది. వన్డేల్లో అతి తక్కువ స్కోర్ను (122) డిఫెండ్ చేసుకున్న జట్టుగా అమెరికా సరికొత్త చరిత్ర సృష్టిం చింది. గతంలో ఈ రికార్డు భారత జట్టు పేరిట ఉండేది. 1985లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 125 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. 40 ఏళ్ల తర్వాత యూఎస్ఏ ఇప్పుడు భారత్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టింది. ఇకఈ మ్యాచ్‌లో ఒమన్‌పైఅమెరికా 57పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 35.3 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. యూఎస్ఏ ఇన్నింగ్స్‌లో మిలింద్ కుమార్ (47 నాటౌట్) టాప్ స్కోరర్గా నిలువగా, ఆండ్రియస్ గౌస్ (14), హర్మీత్ సింగ్ (10), ఆరోన్ జోన్స్ (16), సంజయ్ కృష్ణమూర్తి(16) రెండంకెల స్కోర్లు చేశారు. అనంతరం 123 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఒమన్ అమెరికా స్పిన్నర్ల దెబ్బకు 25.3 ఓవర్లలో 65 పరుగులకే చాప చుట్టేసింది. అమెరికా లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ నోష్తుశ్ కెంజిగేఐదు వికెట్లు తీసి ఒమన్ పతనాన్ని శాశించాడు.



# వాణిజ్యం

# 'ఎక్స్' ప్రీమియం ప్లస్ ధర డబుల్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని సామాజిక మాధ్యమం 'ఎక్స్' తన ప్రీమియం ప్లస్ ధరల్ని భారత్‌లో పెంచింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరల్ని ఏకంగా రెట్టింపు చేసింది. గత మూడు నెలల్లో ఈ ప్లాన్ ధరల్ని పెంచడం ఇది రెండో సారి. గ్రోక్ 3 ఎఐ మోడల్‌ను విడుదల చేసిన తర్వాత ప్లాన్ ధరల్ని పెంచడం విశేషం. మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్‌ఎఐ, గ్రోక్ 3 సేవల్ని తాజాగా అందు బాటులోకి తీసుకొచ్చింది. ఈ ఎఐ మోడల్ సామర్థ్యాలు వినియోగించాలంటే ఎక్స్‌లో ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని కంపెనీ లాంచింగ్ సమయంలో తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్లాన్ ధరల్ని పెంచింది. ఇప్పటి వరకు ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధర భారత్‌లో నెలకు రూ.1,750 ఉండేది. తాజాగా దీన్నిరూ.3,470కి పెంచింది. ఇక యేడాది ప్లాన్ ధర రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది. అంటే ధరల్ని దాదాపు రెట్టింపు చేసింది. తన ప్లాట్‌ఫామ్ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లోనే తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. తొలుత ప్లాన్ ధర రూ.1300గా ఉండేది. ఆ తర్వాత గతేడాది డిసెంబరులో దాని ధరను రూ.1750కి పెంచింది. తాజాగా ఈ ధరను రూ.3,470కు చేర్చింది. ఇతర ప్లాన్ల ధరలను మాత్రం అలాగే ఉంచింది. ఎక్స్‌లో బేసిక్, ప్రీమియం, ప్రీమియం ప్లస్ పేరిట మూడు రకాల ప్లాన్లు అందిస్తోంది. బేసిక్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా ఉంది. ఇక ప్రీమియం ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్-ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం ప్రీమియం ప్లాన్లలో లభిస్తుంది.




# ఎల్ఐసి పెట్టుబడుల్లో రూ.84వేల కోట్లు హాంఫట్

**ముంబై, ఫిబ్రవరి 19:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా తమ విలువను కోల్పోయాయి. గరిష్టాల నుంచి 10 శాతానికిపైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) తరలిపోవడం, వాణిజ్య యుద్ధభయాలు వంటివి ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో దలాల్ స్ట్రీట్‌లో పెట్టుబడులు పెట్టిన వారి పోర్ట్‌ఫోలియోల్లో నిధులు కరిగిపోతున్నాయి. ప్రముఖ ఇన్వెస్టర్లుగా పేరొందిన టాప్-10 వ్యక్తుల పోర్ట్‌ఫోలియోలు రూ.81వేల కోట్ల విలువను కోల్పోయి, ఎల్ఐసి కూడా పెద్ద మొత్తంలో నష్టపోయింది. ఒకటిన్నర నెలలో ఏకంగా రూ.84వేలకోట్లు కోల్పోయింది. జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసి లిస్టెడ్ కంపెనీల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. స్టాక్ మార్కెట్లో ఇటీవల కరెక్షన్ కారణంగా ఎల్ఐసి పెట్టుబడుల విలువ జనవరి 1 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.84వేల కోట్లు పడిపోయింది. గతేడాది డిసెంబర్ త్రైమాసికంలో ఎల్ఐసి హోల్డింగ్స్ విలువ రూ.14.72 లక్షల కోట్లుగా ఉంది. 2025 ఫిబ్రవరి 18 నాటికి ఆ విలువ రూ.13.87 లక్షల కోట్లకు చేరింది. అంటే మొత్తం స్టాక్ విలువ రూ.84,247 కోట్లు మేర హరించుకుపోయింది. 2024 డిసెంబరు నాటికి ఎల్ఐసి 330 కంపెనీల్లో ఒక శాతానికి పైగా వాటా కలిగి ఉంది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల్లో మొత్తం మార్కెట్ విలువలో ఈ కంపెనీలే దాదాపు 66శాతం వాటా కలిగిఉన్నాయి. స్టాక్ మార్కెట్ నష్టాల నేపథ్యంలో ఆయా కంపెనీల షేర్ల విలువ క్రమంగా తగ్గుతోంది. ఎల్ఐసి పెట్టుబడులు పెట్టిన వాటిలో ఐటిసి రూ.11,863 కోట్లు, ఎల్అండ్‌టి రూ.6,713 కోట్లు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.5,647 కోట్లు వంటి ప్రధాన కంపెనీల్లో అధిక పెట్టుబడులున్నాయి. వీటితో పాటు టిసిఎస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, హెచ్‌సిఎల్‌టెక్నాలజీస్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, అదానీ పోర్ట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐడిబిఐ బ్యాంకుల్లోనూ ఎల్ఐసి పెట్టుబడులు పెట్టింది.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం నష్టాలతో ట్రేడింగ్ మొదలుపెట్టిన సూచీలు, ఒడుదుడులకు లోనయ్యాయి. రోజంతా లాభనష్టాల మధ్య చలించిన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిసాయి. ఉదయం 75,787.27 పాయింట్ల వద్ద నష్టంతో ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు, ఇంట్రాడేలో 75,581 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి 28 పాయింట్లు తగ్గి 75,939పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 12 పాయింట్లు నష్టపోయి 22,932 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇన్ఫోసిస్, టిసిఎస్, హిందుస్థాన్ యూని లీవర్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంకు, ఎన్‌టిపిసి, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.30 డాలర్ల వద్ద ట్రేడయింది.



# ఏప్రిల్ నుంచే భారత్‌లో టెస్లా కార్ల సేల్స్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** అమెరికా దిగ్గజ 'ఇవి' కంపెనీ టెస్లా, భారత్‌లో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఈ సంస్థ ఇక్కడ నియామకాలు ప్రారంభించిన విషయం విదితమే. షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇక ఈ యేడాది ఏప్రిల్ నుంచి భారత మార్కెట్లో టెస్లా 'ఇవి' విక్రయాలు ప్రారంభం కానున్నట్లు తాజాగా కొన్ని కథనాలు వెలువడ్డాయి. వీటి ప్రారంభ ధర రూ.21 లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి కంపెనీ రిటైల్ కార్యకలాపాలను మాత్రమే ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెల్లడించాయి. జర్మనీలోని బెర్లిన్ ప్లాంట్ నుంచి 'ఇవి) కార్లను దిగుమతి చేసుకుని భారత్ మార్కెట్లో విక్రయించేందుకు టెస్లా సన్నాహాలు ప్రారంభించినట్లు తెలిసింది. షోరూంల ఏర్పాటు కోసం ముంబైలోని బికెసి బిజినెస్ డిస్ట్రిక్ట్, న్యూఢిల్లీలోని ఏరోసిటీ ప్రాంతాలకు ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. తొలుత 25వేల డాలర్ల వరకు విలువ చేసే ఎలక్ట్రిక్ వాహనాలను టెస్లా విక్రయించనున్నట్లు కూడా తెలిసింది. ప్రస్తుతానికి భారత్‌లో 'ఇవి'ల తయారీపై టెస్లా ఇంకా ఎలాంటి స్పష్టతనివ్వలేదు. అయితే భారత ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుల నుంచి విడిభాగాలను కొనుగోళ్లను మరింత పెంచుకోవాలని కంపెనీ ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపింది.



# వడ్డీరేట్లను సవరించిన డిసిబి బ్యాంకు

**ముంబై, ఫిబ్రవరి 19:** ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన డీసీబీ బ్యాంక్ కొన్ని కాలపరి మితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 65 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. సవరిం చిన రేట్లు అమల్లోకివచ్చాయి. ఫిబ్రవరి ఎంపీసీ సమావేశం 2025లో ఆర్‌బీఐ తన రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50శాతం నుండి 6.25 శాతానికి తగ్గించాలని నిర్ణయించాక ఎఫ్‌డీ రేట్లలో సవరణ వచ్చింది. ఐదేళ్ల తర్వాత బెంచ్‌మార్క్ లెండింగ్ రేటులో మొదటి సారి కోత విధించారు. రెపో రేటు తగ్గుదల బ్యాంకుల నిధుల ఖర్చును తగ్గిస్తుంది. కాబట్టి రుణాలు, డిపాజిట్ రేట్లు ప్రభావితమవుతాయి. రెపో రేటు తగ్గడం వల్ల బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు తగ్గిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో డీసీబీ బ్యాంకు తాజా వడ్డీరేట్ల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. డీసీబీ బ్యాంక్ ప్రస్తుతం 7రోజుల నుండి 10 సంవత్సరాల వరకు టెన్యూర్‌కు అనుగుణంగా రూ. 3కోట్ల కంటే తక్కువ ఎఫ్‌డీలపై సాధారణ పౌరులకు 3.75 శాతం నుంచి 8.05 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. 19 నుండి 20 నెలల వ్యవధి కలిగిన ఎఫ్‌డీలకు అత్యధిక వడ్డీ రేటు 8.05 శాతం అందిస్తుంది. రూ.3కోట్ల లోపు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 4.25 శాతం నుంచి 8.55 శాతం వరకు వడ్డీరేట్లను అందిస్తుంది. 19నుంచి 20 నెలల టెన్యూర్ డిపాజిట్లకు అయితే 8.55 శాతం వడ్డీను అందిస్తుంది. అలాగే సాధారణ పౌరులకు 26 నెలల కంటే ఎక్కువ కానీ 37 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉన్న ఎఫ్‌డీ వడ్డీ రేటును 55 బేసిస్ పాయింట్లు తగ్గించారు. అంటే 8.05 శాతం నుంచి 7.50 శాతానికి తగ్గించారు. 37 నుంచి 38 నెలల మధ్య కాలపరిమితితో వచ్చే ఎఫ్‌డీల వడ్డీరేటును 8.05శాతం నుంచి 7.85శాతానికి తగ్గించారు. అదనంగా డీసీబీబ్యాంక్ 38నెలల కంటే ఎక్కువ కానీ 61 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉన్న ఎఫ్‌డీ వడ్డీరేటును 65 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అంటే 8.05 శాతం నుంచి 7.40 శాతానికి తగ్గాయి.



# 5% ప్రీమియంతో హెక్సావేర్ టెక్నాలజీస్ లిస్టింగ్

**ముంబై, ఫిబ్రవరి 19:** ఐటి సేవల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేర్లు బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. ఐటి సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఒగా వచ్చిన ఈ కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.708తో పోలిస్తే ఎన్ఎస్ఇలో 5శాతం ప్రీమియంతో రూ.745.50 వద్ద లిస్టయ్యాయి. ఇన్వెస్టర్లకు స్వల్ప లాభాల్ని తెచ్చిపెట్టాయి. ఇక బిఎస్ఇలో రూ.731 వద్ద ప్రారంభమయ్యాయి. ముంబై కేంద్రంగా సేవలందిస్తున్న హెక్సావేర్ టెక్నాలజీస్ రూ.8,750 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. ఈ ఐపిఒను పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌లో నిర్వహించింది. ధరల శ్రేణిని రూ.674-708గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తంగా 2.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 9.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 0.20శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 0.11 రెట్లు మాత్రమే సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఐటి సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఒ ఇదే కావడం విశేషం. రెండు దశాబ్దాల క్రితం టిసిఎస్ రూ.4,700 కోట్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14